www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 12
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 90
సోమవారం | 15-7-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 7.19 తదుపరి దశమి; నక్షత్రం: స్వాతి రా. 12.30 తదుపరి విశాఖ; వర్జ్యం: శేషం ఉ.6.01; దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14; అమృతఘడియలు: మ.2.49-4.34; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ట్రంప్ చెవికి తగిలి దూసుకెళ్తున్న బుల్లెట్ (వృత్తంలో). న్యూయార్క్ టైమ్స్ పత్రిక సీనియర్ ఫొటోగ్రాఫర్ డగ్ మిల్స్ తన ప్రత్యేక కెమెరాతో ఈ ఫొటో తీశారు. సెకనుకు 1/8,000 షట్టర్ స్పీడ్‌తో పని చేసే ఈ కెమెరా సెకనుకు 30 ఫ్రేమ్‌లను ఫొటో తీయగలదు.



కాల్పులు జరిగిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ చుట్టూ రక్షణగా నిలబడిన భద్రతా సిబ్బంది

ట్రంప్‌పై హత్యాయత్నం

రైఫిల్‌తో కాల్పులు జరిపిన యువకుడు.. వెంటనే స్పందించిన సీక్రెట్ ఏజెంట్లు

దుండగుడి కాల్చివేత.. ట్రంప్ క్షేమం.. కుడి చెవి పైభాగంలో తూటా గాయం

- ట్రంప్‌ను ఆస్పత్రికి తరలించిన ఏజెంట్లు.. నిందితుడిని గుర్తించిన ఎఫ్‌బీఐ
- పక్కా ప్లాన్‌తో కాల్పులు జరిపిన క్రూక్స్.. అతడు రిపబ్లికన్ పార్టీ అభిమాని!
- కాల్పులకు ముందు వీడియో పోస్ట్.. దుండగుడిని ముందే పసిగట్టిన ఓ వ్యక్తి
- సెక్యూరిటీ ఏజెంట్లకు సమాచారం.. ట్రంప్‌ను అప్రమత్తం చేయని సిబ్బంది
- దాడిని ఖండించిన జో బైడెన్.. యూఎస్‌లో హింసకు తావు లేదని వ్యాఖ్య
- ట్రంప్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన మోదీ, రాహుల్, పలు దేశాల నేతలు
- రాబోయే అమెరికా ఎన్నికల్లో భారీగా పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

2

వేలాదిమందితో ఎన్నికల ప్రచార సభ..! చుట్టూ అభిమానులు.. మద్దతుదారులు..! అనుకూలంగా నినాదాలు..! రెండు రోజుల్లో అభ్యర్థిత్వం ఖరారు కానుండడంతో రెట్టించిన ఉత్సాహంతో నాయకుడు..! మీరు నిజంగా విచారకరమైనదాన్ని చూడాలనుకుంటే.. ఏం జరిగిందో చూడండి అంటూ ఉద్వేగంగా ప్రసంగం..! యాదృచ్ఛికమే అయినా, ఆయన మాటలు అలా తూటాల్లా పేలుతుండగానే దూసుకొచ్చిందో నిజమైన తూటా..! సినిమాలో చూపినట్లుగా సమీపంలోని భవనంపై నుంచి తుపాకీతో దుండగుడి కాల్పులు..! రెప్పపాటులో తప్పిన ప్రాణాపాయం.. ఇదీ.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పెన్సిల్వేనియా రాష్ట్రంలో ప్రచారంలో ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం..!

అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించారు. పారదర్శకతకు పాతరేశారు. కనిపించిందల్లా దోచుకున్నారు. గత ఐదేళ్ల జగన్ సర్కారులో సహజ వనరులను చెరపట్టి దోపిడీ చేశారు. గనుల శాఖలో జరిగిన ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కూటమి సర్కారును గనుల శాఖ కోరనుంది. అలాగే గత వైసీపీ పాలకులు, బంధువులు, అధికారులు విశాఖ, విజయనగరం పరిధిలో విలువైన భూములు దోచుకున్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. మరి నాటి భూదందాలను కూటమి సర్కారు నిగ్గుతేలుస్తుందా?

సర్వం స్వాహా!



జగన్ ఏలుబడిలో అడ్డగోలుగా సహజ వనరుల దోపిడీ

గనుల అక్రమాలే 19,000 కోట్లు!

- కేవలం ఐదారు అంశాల్లోనే ఈ నష్టం
- గనుల శాఖ ప్రాథమిక అంచనా
- ఇంకా లెక్క తేలాల్సినవి ఎన్నెన్నో
- జగన్ అసమర్థ పాలనతో నష్టం
- అంతులేని పర్యావరణ విధ్వంసం
- సమగ్ర విచారణ జరిపించాలని చంద్రబాబును కోరనున్న గనుల శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సహజ వనరులైన భూములు, గనులు, అటవీ వనరులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సీఎంకు సమర్పించేందుకు గనుల శాఖ నివేదికను తయారు చేసింది. అందులో అనేక కీలకమైన అంశాలను పొందుపరిచింది. 'జగన్ ఏలుబడిలో గనుల తవ్వకాలు, అమ్మకాల్లో అంతులేని దోపిడీ జరిగింది. ఖనిజాల తవ్వకాలకు ఇచ్చే పర్మిట్లు, రవాణా, ఇతర వ్యవహారాల్లో అంతుచిక్కని అనేకానేక అక్రమాలున్నాయి. కేవలం ఐదారు అంశాలను ప్రాథమికంగా పరిశీలన చేస్తేనే గత ఐదేళ్ల కాలంలో 19 వేల కోట్లపైనే అక్రమాలు జరిగాయి. ఇంకా లెక్క తేలాల్సినవి ఎన్నో ఉన్నాయి. కాబట్టి గనుల శాఖలో జరిగిన అక్రమాలు, ఘోరాలపై సమగ్ర విచారణ జరగాలి' అని గనుల శాఖ నివేదించనుంది. చంద్రబాబు వద్ద జరిగే సమావేశంలో... జగన్ హయాం నాటి అక్రమాలను నిగ్గుతేల్చడానికి సమగ్ర విచారణ చేయించాలని గనుల శాఖ ప్రధాన డిమాండ్‌గా ఉంచనుంది. సీఐడీ విచరణా లేక విజిలెన్స్‌తోనా అన్నది ప్రభుత్వ నిర్ణయానికే వదిలేయనున్నది. విచారణ మాత్రం జరిగి తీరాలని, అప్పుడే అసలైన అక్రమాలు, ఘోరాలు బయటికి

మిగతా 12వ పేజీలో...

భూదందా కేరాఫ్ విశాఖ

విలువైన భూముల్లో జగన్ పరివారం పాగా

- జవహర్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి బంధువులు, విజయసాయిరెడ్డి, అనుచరులపై ఆరోపణలు
- ఎన్ని ఫిర్యాదులొచ్చినా చర్యల్లేవు
- పెద్దల భూదందాను బయటికి తీస్తారా?

12

భూములు, గనులు, అటవీ వనరులపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల నేడు

వైద్య కాలేజీలకు వైసీపీ గ్రహణం!

పూర్తికాని భవనాలు.. 64% వైద్య, బోధనా సిబ్బంది లేని వైనం

లైసెన్స్ లేని బ్లడ్ బ్యాంక్.. అడ్మిషన్లకు 'నో' అన్న ఎన్ఎంసీ

- అడ్మిషన్ల కోసం సర్కారు లేఖ.. తిరస్కరించిన వైద్య మండలి
- ఎన్ఎంసీ లేఖపై అప్పీల్‌కు వెళ్లాలా? వద్దా? అన్న డైలమా
- ఎంబీబీఎస్ సీట్ల పెంపుపై తల్లిదండ్రుల నుంచి డిమాండ్

చంద్రబాబు సర్కారుపైనే ఆశలు



జగన్ సొంత గడ్డ ఇడుపులపాయలోనే పూర్తికాని భవనాలు

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు.. రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలకు శాపంగా మారాయి. నిర్మాణాలు పూర్తి కాకపోవడం, వైద్య, బోధన సిబ్బంది కొరత వెంటాడుతుండడంతో అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆయా కాలేజీల్లో ప్రవేశాలకు జాతీయ వైద్య మండలి నిరాకరించింది. దీంతో జగన్ ప్రభుత్వం తెచ్చామని చెప్పుకొన్న వైద్య కళాశాలల ఆర్భాటం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పైగా.. కాలేజీల నిర్మాణం ప్రస్తుత ప్రభుత్వానికి ఆర్థిక భారంగా కూడా మారింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను తామే తెచ్చామని చెప్పుకొన్న జగన్ సర్కారు.. వాటిని పట్టాలెక్కించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. దీంతో ఆయా కాలేజీల నిర్మాణం వెనుకబడిపోవడంతో వాటిలో ప్రవేశాలకు అనుమతి లభించని పరిస్థితి ఏర్పడింది. అసంపూర్తిగా ఉన్న కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయడానికి ఒక్కొక్క కళాశాలకు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరోవైపు వాటి నిర్వహణకు ఏటా రూ.130 కోట్లపైగా ప్రభుత్వంపై భారం పడుతుంది. గత ప్రభుత్వం 10 నూతన మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువచ్చింది. తొలిదశలో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లకు ఎన్ఎంసీ అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది మరో 5 కొత్త కాలేజీల్లో అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జనవరిలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేశారు. పాడేరు, మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందులలో నిర్మాణ దశలో ఉన్న కాలేజీల్లో అడ్మిషన్లు కోరుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా ఉన్నతాధికారులు లేఖలు రాశారు. మరోవైపు ఆ ఐదు కాలేజీల నిర్మాణాలు ఎన్ఎంసీ నిబంధనలకు

మిగతా 11వ పేజీలో...



'జర్మన్ వర్సిటీ' జంతర్‌మంతర్!

- లేని యూనివర్సిటీతో ఒప్పందం
- హేమచంద్రారెడ్డి అడ్డగోలు వైఖరి
- జగన్ ఏలుబడిలో వింత వ్యవహారం
- వెబ్‌సైట్‌ను వర్సిటీ అంటూ కార్యక్రమాలు
- దాని యజమాని గోదావరి జిల్లాల వ్యక్తి
- 'మధ్యవర్తి'గా ఆర్థిక ప్రయోజనాలు
- ఇప్పుడూ పాగా వేసేందుకు యత్నం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడం, బిల్లులు చెల్లించడం ఏ ప్రభుత్వంలోనైనా సాధారణ విషయమే. అసలు మనుగడలో లేని యూనివర్సిటీని ఉన్నట్టుగా చూపించి ఒప్పందాలు చేసుకోవడం ఎప్పుడైనా విన్నారా? ఇది.. గత జగన్ ప్రభుత్వంలోనే సాధ్యం! ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ఇలాంటి ఘనకార్యాలు అనేకం చేశారు. 'జర్మన్ వర్సిటీ' అనే వెబ్‌సైట్‌తో ఒప్పందం చేసుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. జర్మనీలోని యూనివర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులు

మిగతా 12వ పేజీలో...

బ్యూటీ పేరుతో లూటీ!

మునిసిపల్ శాఖలో మరో ఆక్టోపస్

రూ.కోట్లు ఖర్చయినా పట్టణాల్లో పచ్చదనం కరువు

- గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్‌లో ఎండీనే కాంట్రాక్టర్
- బినామీ కాంట్రాక్టర్లను పెట్టుకుని నిధులన్నీ స్వాహా
- సంస్థ ఉద్యోగుల పేరున చెక్కులు రాసి డబ్బులు డ్రా
- కార్పొరేషన్ సిబ్బందికి శిక్షణ పేరుతో లక్షలు జేబులోకి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్య ఆరోగ్యశాఖ నుంచి డిప్యుటేషన్‌పై గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు
- కొత్త ప్రభుత్వంలోనూ కొనసాగేందుకు పైరవీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో పచ్చదనం-సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఓ అధికారికి ఆదాయ వనరుగా మారింది. ఈ కార్పొరేషన్ వల్ల పట్టణాల్లో పార్కులు, లేక్‌ల వద్ద పచ్చదనం పరిస్థితి ఎలా ఉన్నా వైద్య ఆరోగ్యశాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన పంట పండింది. వైసీపీ హయాంలో ఈ కార్పొరేషన్‌కు ఎండీగా నియమితుడైన ఆయన దీన్ని జేబు సంస్థగా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొంత మనుషులను కొందరిని కాంట్రాక్టు ఉద్యోగులుగా

మిగతా 12వ పేజీలో...

'ఎడ్‌ఎక్స్' పేరిట రూ.50 కోట్ల దోపిడీ!

- టెండర్లు లేకుండా అడ్డగోలుగా ఒప్పందం
- 2 వేల విదేశీ వర్సిటీల కోర్సులని జగన్ ప్రచారం
- తీరా దేశంలో ఉన్న కోర్సులకే విదేశీ సర్టిఫికేషన్
- వీడియోలు చూసి విద్యార్థులు నేర్చుకోవాలట
- 4 లక్షల లైసెన్సుల్లో 69 వేల మిగులు
- వాటిని తీసుకోవాలని ఇప్పుడు విద్యార్థులపై ఒత్తిడి
- ఆన్‌లైన్ రిక్వెస్ట్ ఓకే చేయాలని మెయిల్స్
- అక్రమాలు బయటకు రాకుండా ఉన్నత విద్యామండలి యత్నం

3

1 అంబానీ ఇంట పెళ్లంటే ఆ మాత్రం ఉండాలి!

తోడుపెళ్లి కొడుకులకు గిఫ్ట్‌గా రూ.2 కోట్ల వాచీలు




- షారుక్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్ సహా పదిమందికి..
- మండపంలోకి వెళ్లడానికి క్యూఆర్‌కోడ్
- ఒక్కో జోన్‌లో ప్రవేశానికి ఒక్కో రంగు చేతి బ్యాండ్
- అత్యవసర చికిత్సకు ప్రత్యేక వైద్య బృందాలు
- అనంత్, రాధికల వివాహ విశేషాలు

2

తెరుచుకున్న రత్నభాండాగారం

- 12వ శతాబ్దానికి చెందిన పూరీ జగన్నాథుడి ఖజానాను 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- బయటి గదిలోని సంపదను ఆరు చెక్క పెట్టెల్లోకి చేర్చి సీలు
- బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోవి కూడా..
- స్వర్ణకారులు, నిపుణుల నియామకం తర్వాతే ఆభరణాల లెక్కింపు

8



డిసెంబరులోగా బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు!

- ఆగస్టు 1 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు
- నవంబరులో మండల, జిల్లా అధ్యక్షుల ఎన్నిక
- డిసెంబరులో రాష్ట్రాలకు నూతన సారథులు
- తెలంగాణలో పలువురు సీనియర్ నేతల పోటీ

2



ఆదివారం ముంబైలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో సమావేశమైన సీఎం చంద్రబాబు

మహారాష్ట్ర సీఎం షిండేతో చంద్రబాబు భేటీ

ముంబై 'వర్ష'లో అరగంట చర్చలు

12

డిసెంబరులోగా బీజేపీకి అధ్యక్షుడు!

» ఆగస్టు 1 నుంచి సంస్థాగత ఎన్నికలు షురూ

న్యూఢిల్లీ, జూలై 14: జేపీ నడ్డా స్థానంలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. డిసెంబరు నెలాఖరులోపు కొత్త సారథి ఎన్నిక పూర్తికానుంది. ఆయన పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. ఎన్నికల నేపథ్యంలో గత నెల వరకు పొడిగింపు లభించింది. అది కూడా ముగియడంతో కొత్త అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు ఆగస్టు 1న ప్రాథమిక సభ్యత్వ నమోదుతో శ్రీకారం చుడతారు. సెప్టెంబరు 15 వరకు ఇది కొనసాగుతుంది. సెప్టెంబరు 16 నుంచి 30 వరకు క్రియాశీల సభ్యత్వ ప్రక్రియ కొనసాగుతుంది. బీజేపీ నియమావళి ప్రకారం.. ప్రతి సభ్యుడు తొమ్మిదేళ్లకోసారి తప్పనిసరిగా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి. ఈ ఏడాది ప్రధాని మోదీ సహా పార్టీ నేతలంతా రెన్యువల్ చేసుకోవలసి ఉంటుంది. నవంబరు 1-15 వరకు పార్టీ మండల అధ్యక్షులు, 16-30 వరకు జిల్లా అధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది. ఆ సమయంలోనే రాష్ట్ర, జాతీయ కొత్త కార్యవర్గాలను ఎంపిక చేస్తారు. డిసెంబరు 1న రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక మొదలవుతుంది. సగం రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక నియామకం పూర్తికాగానే జాతీయ సారథి ఎన్నికల అధికారిక ప్రక్రియను ప్రకటిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మేజిక్ మార్కు (272) సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో బీజేపీకి సంస్థాగత ఎన్నికలు కీలకంగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నడ్డాను మోదీ కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవడమే గాక రాజ్యసభ నాయకుడిగానూ నియమించిన సంగతి తెలిసిందే.

బీజేపీలోకి మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ జడ్జి

భోపాల్, జూలై 14: మధ్యప్రదేశ్ హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ ఆర్య బీజేపీలో చేరారు. భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంచార్జి రాఘవేంద్ర శర్మ కాషాయ కండువా కప్పి జస్టిస్ రోహిత్ ఆర్యను పార్టీలోకి ఆహ్వానించారు. 2013 సెప్టెంబర్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 2015 మార్చిలో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల క్రితమే పదవీ విరమణ పొందారు. ఆయన తన పదవీ కాలంలో ఇచ్చిన పలు తీర్పులు వివాదాస్పదమయ్యాయి. 2021లో ఇండోర్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో చెలరేగిన మతపరమైన ఘర్షణల కేసును ఆయన విచారించారు. కొవిడ్ ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన హాస్యనటులు మునావర్ ఫరూఖీ, నలిన్ యాదవ్‌కు బెయిలు ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు. 2020లో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఆమెతో రాఖీ కట్టించి జీవితాంతం ఆమెకు రక్షణగా ఉంటాననే హామీ తీస్కొని అతనికి బెయిల్ మంజూరు చేశారు.

ఆగస్టు చివరికల్లా దేశవ్యాప్తంగా యూ-విన్

న్యూఢిల్లీ, జూలై 14: గర్భిణులు, పిల్లలకు ఇచ్చే టీకాల నమోదుకు సంబంధించిన యూ-విన్ పోర్టల్ వచ్చే ఆగస్టు చివరినాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. కొవిడ్-19 వ్యాక్సిన్ నిర్వహణ వ్యవస్థ కోసం తెచ్చిన కో-విన్ తరహాలోనే యూ-విన్‌ను రూపొందించారు. సాధారణ టీకాల పంపిణీని ఎలక్ట్రానిక్ రిజిస్ట్రీ రూపంలో నిర్వహించాలన్న లక్ష్యంతో తీసుకువస్తున్న యూ-విన్ ఇప్పటికే అన్ని రాష్ట్రాలు (పశ్చిమబెంగాల్ మినహా), కేంద్రపాలిత ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా నడుస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలై 9 నాటికి వ్యాక్సిన్ తీసుకున్న 5.33 కోట్ల మంది వివరాలను యూ-విన్‌లో నమోదు చేశారు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) కింద గర్భిణులు, పిల్లలకు ఇచ్చే ప్రతి వ్యాక్సినేషన్‌ను యూ-విన్ ప్లాట్‌ఫామ్‌లో పొందుపరచనున్నారు. వీరికి సకాలంలో టీకాలను ఇవ్వడానికి యూ-విన్ దోహదపడుతుంది. ప్రస్తుతం యూఐపీ కింద వ్యాక్సినేషన్ రికార్డులను మాన్యువల్‌గా నిర్వహిస్తున్నారు. యూ-విన్ ద్వారా వ్యాక్సినేషన్ స్థాయిని రియల్ టైమ్ ప్రాతిపదికన అప్‌డేట్ చేయనున్నారు.

ఓబీసీ కోటాలోనే పూజకు ఎంబీబీఎస్ సీటు!

పుణే, జూలై 14: వివాదాస్పద ఐఏఎస్ ప్రొబెషనరీ అధికారి పూజా ఖేద్కర్ ఇతర వెనుక బడిన వర్గం(ఓబీసీ) కోటా ద్వారానే ఎంబీబీఎస్ సీటును సంపాదించినట్లు తెలుస్తోంది. ఎంబీబీఎస్ ఎంట్రన్స్ టెస్టులో 146/200 పొందిన ఆమె పుణే కాశీబాయి నవాలే వైద్య కళాశాలలో 2007లో వంజారీ వర్గం కోటాలో సీటు సంపాదించారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే పూజా ఖేద్కర్ ఓబీసీ నాన్ క్రీమీ లేయర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందినప్పుడు ఆమె తండ్రి దిలీప్ ఖేద్కర్ మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు, ఇటీవల పుణేలో ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పుడు ఆమె వాడిన ఆడీ కారును పోలీసులు ఆదివారం జప్తు చేశారు. మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆమె కారుకు సైరన్, మహారాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నంబర్ ప్లేట్లను వాడడం, 21 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సిద్దరామయ్యపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయండి

» న్యాయవాదులకు కేంద్రమంత్రి కుమారస్వామి సూచన

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) పరిధిలో ఇళ్ల స్థలాల పంపిణీలో జరిగిన అవినీతిలో సీఎం సిద్దరామయ్య కుటుంబ భాగస్వామ్యం, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ గ్రాంట్లు బినామీ ఖాతాలకు మళ్లించడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి న్యాయవాదులకు సూచించారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై దేశమంతటా చర్చ సాగుతోందన్నారు. కోర్టులను ఆశ్రయించి వివాదంపై చట్టపరంగా పోరాటం చేయాలన్నారు. డీ నోటిఫికేషన్ విషయంలో అప్పటి సీఎం యడియూరప్పపై న్యాయ పోరాటానికి అడ్వకేట్లు గవర్నర్ అనుమతులు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కారణంతోనే యడియూరప్ప 2011లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతోపాటు జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. దేశంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే మార్చిలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ ఖాతాల నుంచి రూ.94 కోట్లు బినామీ ఖాతాలకు జమ చేశారని ఆరోపించారు.

జొమాటోకు రూ.60 వేల జరిమానా

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటోకు కర్ణాటక వినియోగదారుల ఫోరం రూ.60వేల జరిమానా విధించింది. ధారవాడకు చెందిన షీతల్ అనే మహిళ 2023 ఆగస్టు 31న ఆన్‌లైన్‌లో మోమోస్‌ను ఆర్డర్ చేశారు. రూ.133.25 మొత్తాన్ని గూగుల్ పే చేశారు. 15 నిమిషాల తర్వాత ఆర్డర్ డెలివరీ అయినట్టు సందేశం వచ్చింది. జొమాటో సంస్థ మాత్రం డెలివరీ చేయలేదు. దీంతో ఆమె తన ఆర్డర్ గురించి ప్రశ్నించగా డెలివరీ ఏజెంట్ ఆర్డర్ తీసుకున్నారని రెస్టారెంట్ నిర్వాహకులు బదులిచ్చారు. వెబ్‌సైట్ ద్వారా డెలివరీ ఏజెంట్‌ను అడిగేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీంతో జొమాటో సంస్థకు ఈ-మెయిల్ చేయగా.. 72 గంటలపాటు వేచి ఉండాలని బదులిచ్చారు. తర్వాత జొమాటో నుంచి తన డబ్బుల రీఫండ్ కోసం యత్నించగా సాధ్యం కాలేదు. దీంతో ఆమె.. 2023 సెప్టెంబరు 13న జొమాటో సంస్థకు లీగల్ నోటీసు ఇచ్చారు. సంస్థ సేవలు నాసిరకంగా ఉన్నాయని, మానసికంగా ఇబ్బంది కలిగించారని ధారవాడ జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. విచారణ జరిపిన ఫోరం బాధితురాలికి మానసిక ఇబ్బందికి కలిగించినందుకు రూ.50 వేలు, కోర్టు దావా ఖర్చులకు రూ.10 వేలు మొత్తం 60వేలు చెల్లించాలని జొమాటో సంస్థను ఆదేశిస్తూ ఈ నెల 3న తీర్పునిచ్చింది.

నేపాల్ నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి



కాఠ్మాండు, జూలై 14 : నేపాల్ నూతన ప్రధానమంత్రిగా కేపీ శర్మ ఓలి(72) ఆదివారం నియమితులయ్యారు. చైనా సానుభూతిపరుడిగా పేరొందిన ఓలి నేపాల్ ప్రధాని కావడం ఇది నాలుగో సారి. పుష్ప కమల్ దహల్ ప్రచండ నేతృత్వంలోని ప్రభుత్వంపై పార్లమెంట్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానం శుక్రవారం నెగ్గింది. 275 సీట్లున్న నేపాల్ పార్లమెంట్‌లో 194 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. కేవలం 66 మంది మాత్రమే ప్రచండ నాయకత్వానికి ఓటేశారు. దీంతో నూతన ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమైంది. ఈ క్రమంలోనే కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని సీపీఎన్-యూఎంఎల్, నేపాలీ కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కేపీ శర్మ ఓలి ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది. కాగా, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్ కేపీ శర్మ ఓలి గత వారమే ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం తర్వాత తొలి 18 నెలలు ఓలి ప్రధానిగా ఉంటారు. ఆ తర్వాత పార్లమెంట్ గడువు ముగిసే వరకు దేవ్‌బా ప్రధానిగా కొనసాగుతారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

రైఫిల్‌తో కాల్పులు జరిపిన యువకుడు.. వెంటనే స్పందించిన సీక్రెట్ ఏజెంట్లు

» దుండగుడి కాల్చివేత.. ట్రంప్ క్షేమం

» దాడిని ఖండించిన జో బైడెన్



పెన్సిల్వేనియా/వాషింగ్టన్, జూలై 14: గన్‌కల్చర్‌కు నెలవైన అమెరికాలో మరోమారు తుపాకీ గర్జించింది..! ఈసారి ఏకంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఓ యువకుడు కాల్పులకు తెగబడ్డాడు. 5-6 రౌండ్ల కాల్పులు జరపగా ఆ సమయానికి ట్రంప్ కాకతాళీయంగా ముఖాన్ని పక్కకు తిప్పడంతో ఆయన కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకుపోయింది. ట్రంప్‌ను నీడలా కాపాడుతున్న సీక్రెట్ ఏజెంట్లు క్షణాల్లో దుండుగుడిని మట్టుబెట్టారు. ఈ ఘటన శనివారం సాయంత్రం 6.10గంటల సమయంలో పెన్సిల్వేనియా ప్రావిన్స్‌లోని బట్లర్ పట్టణంలో చోటుచేసుకుంది. నవంబరు 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మరో రెండ్రోజుల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ప్రకటన జరగనుందనగా ట్రంప్ బట్లర్‌లో ప్రచార ర్యాలీలోపాల్గొన్నారు. భారీ ర్యాలీని ఉద్దేశించి ఆయన సరిహద్దుల్లో అక్రమ వలసలకు సంబంధించిన ఓ చార్ట్‌ను ప్రదర్శిస్తూ తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు. అంతలోనే తుపాకీ తూటాలు ట్రంప్‌వైపు దూసుకొచ్చాయి. వాటిలో ఒకటి ఆయన కుడి చెవి పైభాగం నుంచి దూసుకువెళ్లింది. ఆ వెంటనే ట్రంప్ రక్తమోడుతున్న తన చెవిని పట్టుకుని కిందకు జరిగిపోయారు. అదే సమయంలో ట్రంప్ వెనకున్న ఎత్తైన ప్రదేశంలో ఉన్న సీక్రెట్ ఏజెంట్ విభాగానికి చెందిన స్నైపర్లు దుండగుడిని కాల్చి చంపారు. తర్వాత సీక్రెట్ ఏజెంట్లు, సెక్యూరిటీ సిబ్బంది ట్రంప్ వద్దకు వచ్చి అతనికి వలయంగా నిలబడ్డారు. ట్రంప్‌ను ఆయన బుల్లెట్‌ప్రూఫ్ ఎస్‌యూవీ వద్దకు తీసుకెళ్తుండగా ఆయన తన కుడిచేతి పిడికిలిని పైకెత్తి చూపుతూ "పోరాడతా (ఫైట్)" అని నినదించారు. తర్వాత ట్రంప్‌ను చికిత్స నిమిత్తం బట్లర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని రిపబ్లిక్ పార్టీ ప్రతినిధులు తెలిపారు. కాగా దుండగుడి కాల్పుల్లో ర్యాలీలో పాల్గొన్న ఓ వ్యక్తి మరణించాడని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని తెలుస్తోంది.

దాడికి పక్కా స్కెచ్..!

దుండగుడు పక్కా వ్యూహంతోనే ట్రంప్‌పై దాడి జరిపినట్లు ఎఫ్‌బీఐ అధికారులు అనుమానిస్తున్నారు. దాన్ని బలపరుస్తూ ప్రత్యక్ష సాక్షులు వాంగ్మూలాలిచ్చారని తెలుస్తోంది. మీడియాతో మాట్లాడిన ఓ ప్రత్యక్ష సాక్షి.. తాను ముందుగానే భద్రత సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. "ట్రంప్ రావడానికి ముందే.. ఓ యువకుడు చేతిలో రైఫిల్ తీసుకుని ఓ ఇంటిపైకి చేరాడు. అతను వేదిక వైపు గురిపెట్టి ట్రంప్ రాక కోసం సిద్ధంగా ఉన్నాడు. నేను వెంటనే భద్రత సిబ్బందికి సమాచారం అందించా. అయినా వారు పట్టించుకోలేదు. ట్రంప్ వేదికపైకి వచ్చి, ప్రసంగించడాన్ని చూసిన నేను ఆందోళనచెందాను. అంతలోనే కాల్పులు జరిగాయి" అని అన్నారు.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో క్రమంగా డొనాల్డ్ ట్రంప్ విజయావకాశాలు పెరుగుతున్నాయి. శనివారం నాటి కాల్పుల ఘటనకు ముందు ఆయన విజయావకాశాలను పోల్‌స్టర్ 62శాతంగా అంచనా వేసింది. పెన్సిల్వేనియా కాల్పుల ఘటనతో ప్రజల మద్దతు మరో 8% పెరిగి విజయావకాశాలు 70శాతానికి చేరుకున్నట్లు ఆ సంస్థ అంచనా వేసింది.



మాథ్యూ క్రూక్స్

దుండగుడు 20ఏళ్ల యువకుడు

ట్రంప్‌పై కాల్పులు జరిపిన దుండగుడిని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు గుర్తించారు. పెన్సిల్వేనియాలోని బెతెల్‌పార్క్ ప్రాంతానికి చెందిన థామస్ మాథ్యూ క్రూక్స్ (20) ఈఘాతుకానికి పాల్పడ్డట్లు పేర్కొన్నారు. కాగా క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదవ్వడం గమనార్హం..! అయితే 2021లో ఆయన డెమోక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసివ్ టర్నవుట్ ప్రాజెక్టుకు 15డాలర్లను విరాళంగా ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. క్రూక్స్ ఈ ఘాతుకానికి పాల్పడడానికి ముందు సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. అందులో క్రూక్స్ తాను రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను ద్వేషిస్తున్నట్లు చెప్పారు. అతను అసాల్ట్ రైఫిల్‌తో 200అడుగుల దూరం నుంచి ట్రంప్‌పై కాల్పులు జరిపినట్లు అధికారులు నిర్ధారించారు.

చెవి పైభాగంలోంచి బుల్లెట్ దూసుకెళ్లింది: ట్రంప్

కాల్పుల ఘటనపై డొనాల్డ్ ట్రంప్ 'ట్రూత్' సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "కాల్పుల శబ్దం వినగానే.. ఏదో జరుగుతోందని అర్థమైంది. అంతలోనే నా కుడిచెవి పైభాగం నుంచి బుల్లెట్ దూసుకెళ్లింది. చెవి నుంచి రక్తస్రావమైంది. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది నా ప్రాణాలు కాపాడారు. వారికి ధన్యవాదాలు. ఈ ఘటనలో మరణించిన వ్యక్తి, తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. ఇలాంటి చర్య మన దేశంలో జరగడం నమ్మశక్యంగా లేదు. గాడ్ బ్లెస్ అమెరికా!" అని పోస్ట్ చేశారు. ట్రంప్ కుమార్తె ఇవాంక సోషల్ మీడియా వేదికగా తన తండ్రిని కాపాడిన సీక్రెట్ సర్వీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అమెరికాలో హింసకు తావు లేదు: బైడెన్

ట్రంప్‌పై కాల్పులు జరగడాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. అమెరికాలో హింసకు తావులేదని బైడెన్ వ్యాఖ్యానించినట్లు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. ట్రంప్‌తో బైడెన్ స్వయంగా మాట్లాడినట్లు.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసినట్లు వెల్లడించింది. కాగా వారాంతంలో భాగంగా డెలావెర్ బయలుదేరాల్సిన బైడెన్.. ఈ ఘటనతో తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు వివరించింది. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, మాజీ అధ్యక్షులు ఒబామా, బిల్ క్లింటన్, బుష్ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

లోకం తీరు

ప్రభుత్వ రంగ సంస్థల మరమ్మతు యోచనలో మోదీ?



ట్రంప్ త్వరగా కోలుకోవాలి

» హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన పలు దేశాల నేతలు



వాషింగ్టన్, షికాగో, జూలై 14: ట్రంప్‌పై హత్యాయత్నాన్ని ప్రపంచ దేశాల అధినేతలు తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని స్టార్మర్.. ట్రంప్‌పై జరిగిన కాల్పుల ఘటనపై స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్నారు. "నా మిత్రుడైన ట్రంప్‌పై హత్యాయత్నం తీవ్ర వేదన కలిగించింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయన త్వరగా కోలుకోవాలి" అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని రాహుల్‌గాంధీ, ఖర్గే ఆకాంక్షించారు. ట్రంప్‌పై హత్యాయత్నం అమెరికన్ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం అని భారతీయ అమెరికన్లు పేర్కొన్నారు. భారతీయ అమెరికన్ల నాయకుడు డాక్టర్ భరత్ బరయ్ మాట్లాడుతూ... ఈ ఘటన చాలా విచారకరమన్నారు. బైడెన్‌కు బలమైన మద్దతుదారు అయిన అజయ్ భుటోరియా మాట్లాడుతూ... ఈ హత్యాయత్నంపై అన్ని కోణాల్లో విచారించాలన్నారు.

బర్మింగ్‌హామ్‌లో కాల్పులు

» ఏడుగురి మృతి.. 9 మందికి గాయాలు

వాషింగ్టన్, జూలై 14: అమెరికాలోనే శనివారం అలబామా రాష్ట్రంలోని బర్మింగ్‌హామ్‌లో రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నాడు. శనివారం రాత్రి బర్మింగ్‌హామ్‌లోని నైట్‌క్లబ్‌పై ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. 9 మంది గాయపడ్డారు. అంతకుముందు బర్మింగ్‌హామ్ నగరంలోనే ఇండియన్ సమ్మర్ డ్రైవ్ ప్రాంతంలో ఓ ఇంటి ముందు కారులో బాలుడు, మహిళ సహా ముగ్గురు బుల్లెట్ గాయాలతో చనిపోయి కనిపించారు.

అమెరికాకు తుపాకీ కొత్తేమీ కాదు!

1865లోనే వెలుగులోకి కాల్పుల సంస్కృతి.. అధ్యక్షులు, మాజీలపై దాడులు పరిపాటి

(సెంట్రల్ డెస్క్)

మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నంతో అగ్రరాజ్యం అమెరికా ఉలిక్కిపడింది. ఈ రాజకీయ దాడి ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై ఇలాంటి దాడులు అమెరికాకు కొత్తేమీ కాదు. 1776లో అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇలాంటి అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2008లో ప్రచురితమైన కాంగ్రెస్ నివేదిక ప్రకారం 1865 నుంచి 2005 మధ్యకాలంలో అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై 15 ప్రత్యక్ష దాడులు జరిగాయి. చివరిసారిగా 2011లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా లక్ష్యంగా దాడి జరిగింది. అప్పుడు నేరుగా ఒబామాపై దాడి చేయలేదు కానీ, దుండగులు వైట్‌హౌస్‌పై కాల్పులు జరిపినట్లు అధికారులు గుర్తించారు. అలాగే 2018లో అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ కోసం పంపిన బాంబును భద్రతా సిబ్బంది ముందే పసిగట్టారు. ఇప్పుడు కూడా మరోసారి ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. ఈ నేపథ్యంలో గతంలో అమెరికా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై జరిగిన కొన్ని దాడుల్లో కొన్ని ఘటనలు ఇవి..

పదవిలో ఉండగా నలుగురి హత్య

అబ్రహాం లింకన్	: 1865 ఏప్రిల్ 14
జేమ్స్ గార్ఫీల్డ్	: 1881 జూలై 2
విలియం మెకిన్లీ	: 1901 సెప్టెంబరు 6
జాన్ ఎఫ్ కెన్నెడీ	: 1963 నవంబరు 22

జార్జి డబ్ల్యూ బుష్: 2005లో అప్పటి అధ్యక్షుడు జార్జి బుష్ జార్జియాలో నిర్వహించిన ఓ ర్యాలీలో అరుట్యునియన్ అనే వ్యక్తి గ్రెనేడ్ విసిరాడు. అది పేలకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ బాంబు బుష్‌కు కేవలం 61 అడుగుల దూరంలోనే పడింది. బుష్‌ను చంపాలనే గ్రెనేడ్ విసిరినట్టు ఆ వ్యక్తి అంగీకరించాడు.

రొనాల్డ్ రీగన్: అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 1981లో వాషింగ్టన్ డీసీలోని హిల్టన్ హోటల్ నుంచి బయటకు వస్తుండగా జాన్ హింక్లీ జూనియర్ అనే వ్యక్తి .22 క్యాలిబర్ రివాల్వర్‌తో ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ దాడిలో ఆయనకు గాయాలైనప్పటికీ ప్రాణాలతో బయటపడ్డారు.

జెరాల్డ్ ఫోర్డ్: అమెరికా దేశ చరిత్రలో రెండు హత్యాయత్నాల నుంచి బయటపడిన ఏకైక అధ్యక్షుడు జెరాల్డ్ ఫోర్డ్. 1975 సెప్టెంబరు 5న ఆయన లినెట్ ఆలిస్ ఫ్రోమ్ అనే వ్యక్తి జరిపిన తుపాకీ కాల్పుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ సంఘటన జరిగిన 17 రోజుల తర్వాత సారా జేన్ మూర్ అనే మహిళ కూడా ఫోర్డ్‌ను తుపాకీతో కాల్చి చంపాలని ప్రయత్నించింది. తొలి గన్ షాట్ గురితప్పింది. రెండో షాట్‌కు ప్రయత్నించగా ఓ వ్యక్తి తుపాకీ పట్టుకోవడంతో ఆమె ప్రయత్నం విఫలమైంది.



జార్జి సి వాలెస్: 1972 మే 15న మేరీల్యాండ్‌లో నిర్వహించిన ర్యాలీలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, అప్పటి అలబామా గవర్నర్ జార్జి సి వాలెస్‌పై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఐదు రౌండ్లు కాల్చగా బుల్లెట్ వాలెస్ నడుములోకి దూసుకెళ్లింది. దీంతో ఆయన పక్షవాతానికి గురయ్యారు.

రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ: 1968 జూన్ 5న కాలిఫోర్నియాలోని డెమోక్రటిక్ ప్రైమరీలో గెలిచిన అనంతరం.. అంబాసిడర్ హోటల్‌లో రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ నడుచుకుంటూ వెళ్తుండగా.. సిరాన్ అనే వ్యక్తి ఆయనను తుపాకీతో కాల్చాడు. తీవ్రంగా గాయపడిన కెన్నెడీ ఆ మరుసటి రోజు ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు.

హ్యారీ ట్రూమన్: 1950లో ఆస్కార్ కొలాజో, గ్రెసీలియో టొర్రెసోలా అనే వ్యక్తులు వైట్ హౌస్‌పై కాల్పులు జరిపారు. ఈ దాడిలో అప్పటి అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ ఒక పోలీస్ అధికారి మరణించారు.

ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్: ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మూడు వారాల ముందు జిసెప్పె జంగారా అనే వ్యక్తి రూజ్‌వెల్ట్ లక్ష్యంగా తుపాకీతో కాల్పులు జరిపాడు. గురితప్పిన బుల్లెట్లు.. పక్కనే ఉన్న చికాగో మేయర్ ఆంటోనీ సెర్మాక్‌కు తగలడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

థియోడోర్ రూజ్‌వెల్ట్: 1901 నుంచి 1909 వరకూ అధ్యక్షుడిగా పనిచేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ 1912 అక్టోబరు 14న డిన్నర్‌కు వెళ్తుండగా జాన్ ష్రాంక్ అనే వ్యక్తి తన .38 క్యాలిబర్ కోల్ట్ రివాల్వర్‌తో కాల్చాడు. ఈ దాడిలో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

తుపాకీ చట్టాలపై మళ్లీ చర్చ..!

అమెరికాలో అధ్యక్షుడు, మాజీ అధ్యక్షులకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అయినప్పటికీ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన వ్యక్తులు సైతం సురక్షితంగా లేరని చెప్పడానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. ఆసక్తికర విషయం ఏవిటంటే అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులపై జరిగిన దాడులన్నీ దాదాపు తుపాకీతో జరినవే. ఈ నేపథ్యంలో అమెరికాలో కఠినమైన తుపాకీ చట్టాలపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.

ప్రపంచాన్ని కుదిపేసిన కెనడీ హత్య



వాషింగ్టన్, జూలై 14: అమెరికా 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ 1963 నవంబరు 22న హత్యకు గురైన ఘటన నాడు అమెరికాతోపాటు యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. అధ్యక్ష పదవిలో ఉండగానే.. వరుసగా రెండోసారి డెమోక్రటిక్ అభ్యర్థిగా నిలిచిన ఆయనను ఎన్నికల ప్రచారంలోనే దుండగుడు కాల్చి చంపాడు. 1964 అధ్యక్ష ఎన్నికల కోసం ఆ రోజు టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్‌లో ఆయన ఓపెన్ టాప్ లైమోసెన్ కారులో కూర్చొని ప్రచారం నిర్వహించారు. భారీ వాహన శ్రేణితో నగర వీధుల గుండా వస్తుంటే, ఆయనను చూసేందుకు దారిపొడవునా జనం భారీగా నిల్చున్నారు. ఆయన పక్కనే భార్య జాక్వలైన్ కెనడీ కూడా ఉన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కాన్వాయ్ డీలే ప్లాజా వద్దకు చేరుకోగానే దుండగుడు కాల్పులు జరపగా.. కెనడీ వీపుపై ఒక తూటా, తలలో ఒక తూటా దిగబడ్డాయి. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్స్ వెంటనే కెనడీని పార్క్‌లాండ్ మెమోరియల్ ఆస్పత్రికి తరలించగా, మధ్యాహ్నం ఒంటిగంటకే ఆయన మరణించినట్టు ప్రకటించారు. అమెరికా నౌకాదళ మాజీ ఉద్యోగి ఓస్వాల్డ్(24)ను హంతకుడిగా గుర్తించారు. ఓస్వాల్డ్‌ను అరెస్టు చేసిన రెండు రోజులకే అతన్ని మరోవ్యక్తి కాల్చి చంపాడు. దీంతో, కెనడీ హత్య వెనుక కుట్ర ఉందని, అది బయటపడకుండా ఉండేందుకే ఓస్వాల్డ్‌ను హత్య చేశారని ప్రచారం జరిగింది.

అంబానీ పెళ్లంటే ఆ మాత్రం ఉండాలి!



తోడుపెళ్లి కొడుకులకు గిఫ్ట్‌గా రూ. 2 కోట్ల వాచీలు

» మండపంలోకి వెళ్లడానికి క్యూఆర్‌కోడ్



గిఫ్టు వాచీతో రణ్‌వీర్ సింగ్

ముంబై, జూలై 14: అత్యంత వైభవోపేతంగా, అట్టహాసంగా జరుగుతున్న అనంత్ అంబానీ పెళ్లి వేడుకల్లో.. కొత్త 'టాక్ ఆఫ్ ది టౌన్'.. తన గ్రూమ్స్‌మెన్‌కు అంబానీ ఇచ్చిన ఖరీదైన వాచీలు! 'గ్రూమ్స్‌మెన్' అంటే.. పెళ్లికొడుకు ఎంచుకునే అత్యంత ఆప్తమిత్రులు. అర్థమయ్యేలా చెప్పాలంటే.. మన తెలుగింటి పెళ్లి వేడుకల్లో తోడుపెళ్లికొడుకు లాగా అన్నమాట. కాకపోతే కొద్దిగా ఎక్కువ మంది ఉంటారు. వేడుక అంతా వాళ్లు పెళ్లికొడుకుతోనే ఉంటారు. అనంత్ అలా తన గ్రూమ్స్‌మెన్‌గా.. బాలీవుడ్ హీరోలు షారుక్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, శిఖర్ పహారియా(జాన్వీకపూర్ బాయ్‌ఫ్రెండ్), వీర్‌పహారియా సహా పదిమందిని ఎంచుకున్నాడు. వారందరికీ.. 'ఔడెమాజ్ పిగే' అనే స్విస్ కంపెనీ తయారుచేసిన 'రాయల్ ఓక్ పర్‌పెచ్యువల్ క్యాలెండర్' వాచీలను బహుమతిగా ఇచ్చాడు. అవి కూడా ప్రీమియర్ లిమిటెడ్ ఎడిషన్. అనంత్ అంబానీ ఇచ్చిన ఆర్డర్ మేరకు ప్రత్యేకంగా ఆ కంపెనీ 25 వాచీలు తయారుచేసి ఇచ్చింది. వాటివిలువ అక్షరాలా రూ.2,08,79,000. 41 మిల్లీమీటర్ల డయల్‌తో ఉండే ఈ వాచీలకు 18 క్యారెట్ల పింక్ గోల్డ్ కేస్‌లు, బ్రేస్‌లెట్లు ఉంటాయి. ఈ వాచీలు టైముతో పాటు వారం, తేదీ, నెల, లీప్ సంవత్సరం ఇలా చాలా వివరాలే చెప్పగలవు. 20 మీటర్లలోతు (అంటే దాదాపు 65 అడుగుల లోతు) నీటిలో పడ్డా ఈ వాచీలు బాగానే పనిచేస్తాయి. కాగా..మూడురోజులపాటు అత్యంత వైభవోపేతంగా జరిగిన ఈ పెళ్లి గురించి రకరకాల కొత్త విశేషాలు బయటికొస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సెలబ్రిటీలు, సినీ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు, ప్రధాని మోదీ సహా పలువురు రాజకీయ ప్రముఖులు పెళ్లికి వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సందట్లో సడేమియాలో ఎవరు పడితే వారు పందిట్లోకి దూరకుండా.. పెళ్లికి ఆహ్వానించినవారి మొబైల్ ఫోన్లకు ముహూర్తానికి ఆరు గంటల ముందు క్యూఆర్ కోడ్ మెసేజ్‌లు పంపించారు. అమితాబ్ బచ్చన్ అయినా.. షారుక్‌ఖాన్ అయినా.. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లోపలికి రావాల్సిందేనన్నమాట. అలాగే, పెళ్లి జరిగే చోట రకరకాల జోన్లు ఏర్పాటు చేశారు. అన్ని జోన్లలోకీ అందరికీ ప్రవేశం ఉండదు. అలా ప్రవేశించకుండా.. అతిథులకు, సెక్యూరిటీవారికి, రిలయన్స్ ఉద్యోగులకు ఒక్కో రంగు చేతి బ్యాండ్ వేశారు. వైద్యపరంగా అత్యవసరస్థితి ఏర్పడితే అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు.

కనకదుర్గమ్మకు బంగారు బోనం సమర్పణ



బంగారు బోనాన్ని ఇంద్రకీలాద్రిపైకి తీసుకెళ్తున్న కమిటీ సభ్యులు

విజయవాడ (వన్‌టౌన్), జూలై 14: హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు ఆదివారం బంగారు బోనం సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో జరిగే బంగారు బోనం ఉత్సవాలు ఈ ఏడాదితో 15 వసంతాలు పూర్తి చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఈ కమిటీ సభ్యులకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి వద్ద ఈవో రామారావు ఘనంగా స్వాగతం పలికారు. దాదాపు వెయ్యిమంది కళాకారులు, శివశక్తులు, పోతురాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్రాహ్మణవీధి మీదుగా సాగిన ఊరేగింపు దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో గంగ తెప్పకు పూజచేసి, అనంతరం కొండపైకి చేరుకుంది. పాడిపంటలు పుష్కలంగా పండాలని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటూ దుర్గమ్మకు బోనం సమర్పించారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలనేదే నా ఆకాంక్ష

▸▸ గంగానమ్మతల్లికి నారా లోకేశ్ దంపతుల పూజలు



తాడేపల్లి టౌన్, జూలై 14: సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని కోరుతూ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని గంగానమ్మ తల్లి ఆలయంలో మంత్రి నారా లోకేశ్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత లోకేశ్, బ్రాహ్మణికి ఆలయ కమిటీ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన సీనియర్ నేత దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఆరు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

▸▸ వైసీపీ పాలనలో భారీ స్కాంలు : బాలకృష్ణ



టిడ్కో ఇంట్లో ధ్వంసం చేసిన గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ బీకే పార్థసారథి

హిందూపురం, జూలై 14: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థల్లోనూ భారీ స్కాంలకు పాల్పడ్డారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆరోపించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో ఆయన ఆదివారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హిందూపురం మండలం కొటిపి గ్రామ సమీపాన అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీటీడీ మొదలుకుని ఇసుక, మద్యంతో పాటు అన్నింటిలోనూ గత వైసీపీ పాలకులు దోపిడీ చేశారన్నారు. తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల నాటికి టిడ్కో ఇళ్ల పనులు 80శాతం పూర్తయ్యాయని, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని పాడుబెట్టిందని తెలిపారు. ఆరు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జీపీఎస్ రద్దు కోసం నిరసనలు: ఏపీటీఎఫ్

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పెన్షన్ స్కీం పథకంపై పాత తేదీతో ఇచ్చిన గెజిట్ రద్దు కోసం 16, 17 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని ఏపీటీఎఫ్ కార్యవర్గం తీర్మానించింది. అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షతన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. బాలికలపై అత్యాచారాలను అరికట్టేలా పాఠ్యాంశాలు రూపొందించాలని, జీవో 117 రద్దు, ఏ మీడియంలో బోధన, పరీక్షలు ఉంటాయనే దానిపై ప్రభుత్వం స్పష్టత నివ్వాలని, 12వ పీఆర్సీ ప్రక్రియ ప్రారంభించాలని తీర్మానాలు చేసింది.

'ఎడ్‌ఎక్స్' పేరిట రూ.50 కోట్ల దోపిడీ!

- ▸▸ టెండర్లు లేకుండా అడ్డగోలుగా ఒప్పందం
- ▸▸ 2వేల విదేశీ వర్సిటీల కోర్సులని నాటి జగన్ సర్కారు ప్రచారం
- ▸▸ తీరా దేశంలో ఉన్న కోర్సులకే విదేశీ సర్టిఫికేషన్
- ▸▸ వీడియోలు చూసి విద్యార్థులు నేర్చుకోవాలట
- ▸▸ 4లక్షల లైసెన్సుల్లో 69వేల మిగులు
- ▸▸ వాటిని తీసుకోవాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్న వైసీపీ అనుకూల అధికారులు
- ▸▸ ఆన్‌లైన్ రిక్వెస్ట్ ఓకే చేయాలని మెయిల్స్
- ▸▸ అక్రమాలు బయటకు రాకుండా ఉన్నత విద్యామండలి యత్నం



అవిగో విదేశీ కోర్సులు, ఇవిగో అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లు కొల్లగొట్టింది. విదేశీ యూనివర్సిటీల్లోని కోర్సులు అంటే ఇక్కడ విద్యార్థులు ఎగబడతారని, హాట్‌కేకుల్లా వాటి లైసెన్సులు అయిపోతాయని అప్పట్లో ఊదరగొట్టగా.. ఇప్పుడు లైసెన్సులు మిగిలిపోయాయని, వాటిని తీసుకోవాలని ఉన్నత విద్యామండలిలోని వైసీపీ అనుకూల అధికారులు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. మేం కోర్సు ఇన్విటేషన్ మెయిల్ చేస్తాం... దానిని యాక్సెప్ట్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బతిమాలుకునే పరిస్థితికి దిగి రావడంతో ఆ కోర్సులకు ఎలాంటి డిమాండ్ లేదని ఉన్నత విద్యామండలి పరోక్షంగా అంగీకరించింది. విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత బాటలు అంటూ రూ.50కోట్లు ప్రైవేటు కంపెనీకి దోచిపెట్టగా, అందులో వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. ఇప్పుడు ఆ అక్రమాలు బయటకు రాకుండా కొందరు అధికారులు నూరుశాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు చూపించేందుకు నానా పాట్లు పడుతున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యలో కొన్ని సర్టిఫికేషన్ కోర్సులుంటాయి. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు అసలు కోర్సులతో పాటు అదనపు ప్రయోజనం కలిగించేలా ఈ తరహా సర్టిఫికేషన్ కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చారు. దేశంలోనే పలు కంపెనీలు అలాంటి అదనపు సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి. అయితే, గత ప్రభుత్వం మన విద్యార్థులకు విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీల్లోని కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. అందుకోసం ఆగమేఘాలపై ఎడ్‌ఎక్స్ అనే అమెరికన్ కంపెనీని నామినేషన్ పద్ధతిపై ఎంపిక చేసింది. ఆ కంపెనీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌గా ఉంటూ విదేశీ వర్సిటీల్లోని కోర్సులు ఇక్కడ విద్యార్థులు చదివేందుకు వారధిగా పనిచేస్తుంది. ఇందుకోసం ఆ కంపెనీతో గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒప్పందం చేసుకుంది. ఒప్పందం ప్రకారం ఒకేసారి రూ.49.9కోట్లు ఆ కంపెనీకి చెల్లించింది. అందుకుగాను ఆ కంపెనీ రాష్ట్రానికి 4లక్షల లైసెన్సులు ఇచ్చింది. వాటిని విద్యార్థులు వెంటనే ఉపయోగించుకుంటారని భావించగా 69వేల లైసెన్సులు ఖాళీగా మిగిలిపోయాయి. ఇది బయటపడితే ఈ ఒప్పందంలోని డొల్లతనం వెలుగులోకి వస్తుందని భావించిన ఉన్నత విద్యామండలిలోని వైసీపీ అనుకూల అధికారులు యూనివర్సిటీల ద్వారా గత కొద్దిరోజులుగా విద్యార్థులకు మెయిళ్లు పంపుతున్నారు. ఆ కోర్సులను తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు.

ఈ కోర్సులు ఇక్కడ లేవట

ఈ ఒప్పందం చేసుకున్న సమయంలో అప్పటి సీఎం జగన్ ప్రసంగించారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వెల్త్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులు ఈ ఒప్పందంతో విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇలాంటి కోర్సులు మన దేశంలో లేవని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ లాంటి కోర్సులు అనేక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాయి. కానీ అలాంటి కోర్సులు ఇక్కడ లేవని జగన్ ప్రకటించడం, వాటికి అధికారులు తలూపడం చకచకా జరిగిపోయాయి. అలాగే ఆ కోర్సులను ఆన్‌లైన్‌లో ప్రత్యక్షంగా అక్కడి వర్సిటీల్లోని అధ్యాపకులు బోధిస్తారని జగన్ చెప్పారు. తీరా చూస్తే అక్కడ రికార్డు చేసిన వీడియోలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. అలాంటి వీడియోలు యూట్యూబ్‌లో కోకొల్లలుగా ఉన్నాయి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా విద్యార్థులకు చదువుకునే వీలుంది. అలాంటి కోర్సులకు ప్రభుత్వం ఏకంగా రూ.50కోట్లు చెల్లించింది.

ఒక్క విద్యార్థి 32 కోర్సులు ఎలా?

విద్యార్థులు వారికి నచ్చిన కోర్సులను ఎంచుకుని నేర్చుకుంటారు. కొందరు ఒకటి కంటే ఎక్కువ ఆన్‌లైన్ కోర్సులు చదువుతారు. కానీ ఎడ్‌ఎక్స్ ద్వారా మదనపల్లెకు చెందిన ఒక విద్యార్థి ఏకంగా 32 కోర్సులు పూర్తి చేశారంటే ఎవరైనా నమ్మగలరా? జగన్ సొంత మీడియానే ఈ ప్రచారం చేసింది. డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఏఐలతో పాటు మరో 29 రకాల కోర్సులను ఆ విద్యార్థి పూర్తిచేసినట్లు రాసుకొచ్చింది. అసలు ఒక్క విద్యార్థి అన్ని కోర్సులు ఎలా నేర్చుకుంటారు? ఈ కోర్సులు విద్యార్థుల రెగ్యులర్ చదువుకు అదనం మాత్రమే. అలాంటి 32 అదనపు కోర్సులను రెగ్యులర్ కోర్సులతో కలిపి ఎలా నేర్చుకున్నారో జగన్ మీడియాకే తెలియాలి. అసలు ఒక్కో కోర్సుకు నెల రోజులు పట్టినా దాదాపు మూడేళ్ల కాలం ఆ కోర్సులతోనే సరిపోతుంది.

శ్రీవారి సేవలో సీఎస్ నీరబ్‌కుమార్



సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న టీటీడీ జేఈవో, తిరుమల ఆలయం ముందు జస్టిస్ రవీంద్రబాబు

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులు తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకున్న సీఎస్ దంపతులకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు కూడా శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు.

త్రిపురాంతకంలో జస్టిస్ జ్యోతిర్మయి పూజలు



బాలాత్రిపురసుందరీదేవికి కుంకుమార్చన చేస్తున్న జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

త్రిపురాంతకం, జూలై 14: ప్రకాశం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలో ఉన్న త్రిపురాంతకేశ్వరుడు, బాలాత్రిపుర సుందరీదేవిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు ఆలయ అర్చకులు శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

కాలినడకన తిరుమలకు అమరావతి రైతులు



కాలినడకన తిరుమలకు వస్తున్న అమరావతి రైతులు

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైతులు ఆదివారం అలిపిరి కాలినడక మార్గంలో పాదయాత్రగా తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఒకే రాజధాని, అది కూడా అమరావతే ఉండాలనే లక్ష్యంతో న్యాయస్థానం టూ దేవస్థానం పేరిట పాదయాత్ర చేశామని గుర్తుచేశారు. గత పాలకులు ఈ పాదయాత్రను అన్నిరకాలుగా అడ్డుకున్నారని, భోజనం కూడా రోడ్లపై చేసేలా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక ఇబ్బందుల నడుమ శ్రీవారిని దర్శించుకుని అమరావతిని రక్షించి.. ఏపీని పరిరక్షించే ప్రభుత్వం రావాలని కోరుకున్నట్లు చెప్పారు. దీనికి అనుగుణంగా స్వామి, ప్రజల ఆశీస్సులతో ఎన్డీయే కూటమి మంచి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తమ కోరిక తీరిన క్రమంలో జూన్ 24వ తేదీన వెంకటపాలెంలో కృతజ్ఞతా పాదయాత్రను ప్రారంభించి.. 433 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. జేఏసీ సభ్యురాలు అరుణ మాట్లాడుతూ.. 1,631 రోజుల పాటు రైతులందరూ ఉద్యమం చేసినప్పటికీ గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు ఆర్డీటీ సహకారం

▸▸ మంత్రి లోకేశ్‌కు హామీ ఇచ్చిన నిర్వాహకులు



మంత్రి లోకేశ్‌తో ఆర్డీటీ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు నిర్వాహకులు మాంఛో ఫెర్రర్ తెలిపారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కలిశారు. ప్రభుత్వానికి సమాంతరంగా తెలుగు రాష్ట్రాల్లో ఆసుపత్రులు, పక్కా ఇళ్ల నిర్మాణం, విద్య, చెక్‌డ్యామ్‌ల నిర్మాణ అంశాల్లో ఆర్డీటీ విశేష కృషి చేసిందని మంత్రి ప్రశంసించారు. యువగళం పాదయాత్రలో ఆర్డీటీ కార్యాలయాన్ని సందర్శించిన లోకేశ్ అధికారంలోకి వచ్చాక కలిసి పనిచేద్దామని ప్రతిపాదించారు. ఉపాధి కల్పన, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఫారిన్ లాంగ్వేజెస్‌పై శిక్షణ లాంటి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు. దానిపై స్పందించిన నిర్వాహకులు ఉమ్మడి ప్రణాళిక రూపొందించి గ్రామీణ ప్రాంతాల్లో కలిసి పనిచేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వానికి క్రిటికల్ కేర్ అంబులెన్స్


▸▸ సీఎం చేతుల మీదుగా అందజేసిన పర్వతనేని ఫౌండేషన్



పర్వతనేని ఫౌండేషన్ నిర్వాహకులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన అంబులెన్స్ వద్ద సీఎం చంద్రబాబు, ఫౌండేషన్ నిర్వాహకులు

తాడేపల్లి టౌన్, జూలై 14: రాష్ట్ర ప్రభుత్వానికి పర్వతనేని ఫౌండేషన్ క్రిటికల్ కేర్ అంబులెన్స్‌ను అందించింది. పర్వతనేని ఫౌండేషన్-లుగాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఉండవల్లిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అంబులెన్స్‌ను ఆదివారం ప్రభుత్వానికి అందజేశారు. కేంద్ర మాజీ మంత్రి పర్వతనేని ఉపేంద్ర 88వ జయంతి సందర్భంగా పర్వతనేని ఫౌండేషన్ నుంచి ఆయన తనయుడు పి.వివేక్ ఆనంద్ అంబులెన్స్‌ను అందించారు. ఫౌండేషన్ కార్యదర్శి వివేక్ ఆనంద్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. టీడీపీ ఆవిర్భావ సమయంలో జనరల్ సెక్రెటరీగా పనిచేసిన ఉపేంద్రతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉపేంద్ర కుటుంబ సభ్యులు, లుగాంగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆసరాగా మంత్రి సవిత




రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి సవిత సాయం చేసిన దృశ్యం, తీవ్రంగా గాయపడిన బాధితురాలికి స్వయంగా నీళ్లు తాగిస్తున్న మంత్రి

అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తెనాలి ఫ్లైఓవర్ వద్ద ఆటోను కారు ఢీకొనడంతో 15 నెలల చిన్నారి మరణించగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి మంత్రి సవిత మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ దారిలో వెళ్తున్న సవిత క్షతగాత్రులను ఓదార్చారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించే ఏర్పాటుచేశారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

మూడు రోజుల పసికందు అపహరణ

▸▸ నాలుగు గంటల్లోనే తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



పసికందును అపహరించి తీసుకెళ్తున్న తమ్మిరెడ్డి లక్ష్మి, తల్లి చెంతకు చేరిన పసికందు

మచిలీపట్నం టౌన్, జూలై 14: మచిలీపట్నంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజుల పసికందును అపహరించిన సంఘటన కలకలం రేపింది. శనివారం అర్ధరాత్రి 1.30 గంటలకు ఆసుపత్రిలో స్థానిక ఇంగ్లీషుపాలేనికి చెందిన తమ్మిశెట్టి లక్ష్మి అనే మహిళ నర్సు వేషంలో వచ్చి పసికందును అపహరించింది. ఘంటసాల మండలం శ్రీకాకుళానికి చెందిన స్వరూప మూడు రోజుల క్రితం మగబిడ్డను ప్రసవించింది. శనివారం అర్ధరాత్రి పసికందుకు పాలిచ్చి వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బాబు కనిపించలేదు. ఆసుపత్రి వైద్యుడికి విషయం చెప్పడంతో మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించగా, చిన్నారిని తీసుకువెళుతున్న లక్ష్మి కనిపించింది. పోలీసులు తీవ్రంగా గాలించి ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అపహరణకు బాధ్యులైన సెక్యూరిటీ గార్డుపై చర్యలు తీసుకోవడంతో పాటు ముగ్గురు స్టాఫ్ నర్సులకు, ఒక క్లాస్ ఫోర్ ఉద్యోగికి, ఒక ఎఫ్ఎన్‌వోకు సూపరింటెండెంట్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కోటి ఆశలతో కువైత్ వెళ్లి..

గుక్కెడు నీళ్లకూ దిక్కులేక..!

- ▸▸ అన్నమయ్య జిల్లా చింతపర్తి వాసి కష్టాలు
- ▸▸ ఆత్మహత్యే శరణ్యమంటూ బాధితుడి వీడియో
- ▸▸ సోషల్ మీడియాలో వైరల్.. స్పందించిన మంత్రి లోకేశ్
- ▸▸ అప్పులు చేసి పంపించామని భార్య ఆవేదన
- ▸▸ క్షేమంగా స్వదేశానికి తీసుకురావాలని వేడుకోలు



కువైత్ ఎడారిలో రోదిస్తున్న శివ



భార్య పిల్లలతో శివ (ఫైల్)

వాల్మీకిపురం, జూలై 14: కువైత్‌లో వేధింపులకు గురై ఓ కార్మికుడు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం చింతపర్తి బీసీ కాలనీకి చెందిన ఎ.శివ, శంకరమ్మ దంపతులు ఓ అద్దె ఇంట్లో కాపురం ఉంటూ రోజు కూలీ పనులకు వెళ్లేవారు. రోజూ పనికి వెళ్లకపోతే కానీ పూటగడవని పరిస్థితి. ఆ నిరుపేద దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పిల్లల భవిష్యత్తు కోసం గత నెల 9వ తేదీన రూ.లక్ష అప్పు చేసి రాయచోటికి చెందిన ఏజెంట్ ద్వారా శివ కువైత్‌కు వెళ్లాడు. తొలుత గొర్రెల కాపరి అని చెప్పి తీరా కువైత్‌కు వెళ్లిన తరువాత శివను తీసుకెళ్లి ఎడారి ప్రాంతంలో ఒంటరిగా వదిలేశారు. గత కొద్ది రోజులుగా తీవ్ర వేధింపులకు గురవుతుండటం, తన బాధను, కష్టాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్ కావడమే కాకుండా శివ పరిస్థితిని చూసి దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. కువైత్‌లోని ఎడారి ప్రాంతంలో కుక్కలు, బాతులు, మేకలు, గొర్రెలు, పావురాలకు కాపలాగా ఉండటమే కాకుండా.. రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే చెట్లకు నీళ్లు పట్టడం కష్టంగా ఉందని ఆ వీడియోలో శివ వాపోయాడు. అంతకు మించి రాత్రీపగలు ఒక్కడినే ఎడారిలో నరకయాతన అనుభవిస్తున్నానని విలపిస్తూ గోడు వెళ్లబోసుకున్నాడు. తనకు నీళ్లు ఇచ్చేవాళ్లు కూడా లేరని మరో రెండు రోజులు ఇలాగే ఉంటే బతకలేనని తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ పలువురికి వీడియోలు పంపి ఆవేదన చెందాడు. ఆ వీడియోలు వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై శంకరమ్మను పలకరించగా కూలికి వెళితే గాని జీవనం సాగని నిరుపేద కుటుంబం తమదని, అప్పులు చేసి కువైత్‌కు పంపితే అక్కడ తన భర్త పరిస్థితిని చూడలేకపోతున్నానని విలపించింది. తన భర్త శివను కువైత్‌కు పంపిన ఏజెంట్‌ను సంప్రదిస్తే మళ్లీ తిరిగి ఇండియాకు రావడానికి రూ.లక్ష ఖర్చు అవుతుందని చెప్పడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదని విలపిస్తోంది. ఇప్పటికే అప్పుల భారంతో బతుకుతున్న తమకు ఏమి చేయాలో పాలుపోవడం లేదని విచారం వ్యక్తం చేసింది. ఎలాగైనా తన భర్తను సురక్షితంగా ఇంటికి చేర్చాలని వేడుకుంటోంది. కాగా.. కువైత్‌లో ఇరుక్కుని వేధింపులకు గురవుతున్నానంటూ శివ పెట్టిన వీడియోలను సోషల్ మీడియాలో చూసిన మంత్రి నారా లోకేశ్ తక్షణం స్పందించారు. శివను స్వదేశానికి తీసుకురావాలని విదేశాంగ శాఖను కోరినట్లు తెలిసింది. దీంతో బాధిత కుటుంబం సంతోషం వ్యక్తంచేయడంతోపాటు, మంత్రి లోకేశ్ స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేసింది. స్థానిక సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, టీడీపీ నాయకులు శివ కష్టాలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని ఎలాగైనా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

తెల్లారితే కొత్తింట్లోకి..

ఈలోపే తెల్లారిన బతుకులు



మారెప్ప, లక్ష్మీదేవి

- ▸▸ వర్షానికి మట్టి మిద్దె కూలి దంపతుల మృతి
- ▸▸ మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- ▸▸ అనంతపురం జిల్లా హావళిగి గ్రామంలో విషాదం

విడపనకల్లు, జూలై 14: తెల్లారితే కొత్త ఇంట్లోకి వెళ్దామనుకున్న ఆ దంపతులు.. శిథిలావస్థకు చేరిన మట్టి మిద్దె కూలి తెల్లారకముందే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. అనంతపురం జిల్లా విడపకనల్లు మండలం హావళిగి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిందీ ఘటన. గ్రామానికి చెందిన కోనప్పగారి మారెప్ప(48) వ్యవసాయ కూలి. ఆయనకు భార్య లక్ష్మీదేవి(44), కుమార్తె మానస, ఇద్దరు కుమారులున్నారు. మానసకు పుట్టుకతోనే మాటలు రావు. పెద్ద కుమారుడు బేల్దారి పనికి వెళ్తుండగా, చిన్న కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వీరు నివసిస్తున్న మట్టి మిద్దె శిథిలావస్థకు చేరింది. దీంతో కొత్త ఇంటి నిర్మాణం చేపట్టారు. శనివారమే కొత్త ఇంటి స్లాబు కూడా వేశారు. పాత ఇల్లు కూలిపోతుందనే భయంతో వెంటనే కొత్త ఇంట్లోకి వెళ్లిపోదామనుకున్నారు. అయితే, స్లాబు వేసిన రోజే కొత్త ఇంట్లో నిద్రించకూడదని, శనివారం రాత్రికి అందరూ పాత ఇంట్లోనే నిద్రించారు. ఆదివారం ఉదయం కొత్త ఇంట్లోకి చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. లక్ష్మీదేవి తమ్ముడు రాము కూడా వీరితోపాటు అదే ఇంట్లో నిద్రించారు. శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి గాలి వానకు మట్టి మిద్దె తడిసిపోయి అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. ఇంటి మధ్యలో నిద్రిస్తున్న మారెప్ప, లక్ష్మీదేవి మట్టి కింద కూరుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. మానస, రామును గ్రామస్థులు కాపాడి 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. మారెప్ప కుమారులు అంజి, హనుమంతు ఇంటి వరండాలో నిద్రించడంతో క్షేమంగా బయటపడ్డారు.

వైసీపీ కార్యకర్తకు దక్కని జగనన్న ఇల్లు..

మారెప్ప పక్కా వైసీపీ కార్యకర్త. అయినా వీరికి వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇల్లు మంజూరుకాలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మారెప్ప పేరున ఇంటి బిల్లును కాంగ్రెస్ నాయకులు డ్రా చేసుకుని స్వాహా చేయడం వల్ల మారెప్పకు వైసీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కాలేదని తెలిసింది. ప్రమాద ఘటనపై రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదంపై జిల్లా అధికారులకు సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

వివిధ

బొమ్మలు: అక్బర్

మఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కార ప్రదాన సభ

మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం (2024) ప్రదాన సభ జూలై 16 ఉ.11 గంటలకు హైదరాబాద్ లోని ప్రభుత్వ సిటీ కాలేజ్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని అమ్మంగి వేణుగోపాల్ స్వీకరిస్తారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పి. బాల భాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో ముదిగంటి సుజాతా రెడ్డి, యాకూబ్, వాహెద్, రాయారావు సూర్య ప్రకాశరావు అతిథులుగా పాల్గొంటారు. అవార్డు కమిటి కన్వీనర్ విప్లవ్ దత్ శుక్ల, సభ్యులు ఏలూరి యాదయ్య, జె రత్న ప్రభాకర్.

కోయి కోటేశ్వర రావు

కరుణాకర్ స్మారకోపన్యాసం

కరుణాకర్ 3వ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం, సంస్మరణ సభ జూలై 21 ఉదయం 10గంటలకు ఎల్‌బిజి హాల్, రంగారాయుడి చెరువు దగ్గర, ఒంగోలులో జరుగుతుంది. అధ్యక్షత రమాసుందరి. 'నూతన విద్యా విధానం, సమాజంపై దాని ప్రభావం' అంశంపై వేణుగోపాల్, 'పర్యావరణ సంక్షోభం, రాజకీయ ఆర్థిక మూలాలు' అంశంపై వరలక్ష్మి మాట్లాడతారు.

అరసవిల్లి కృష్ణ

తంగిరాల కృష్ణప్రసాద్ రంగస్థల పురస్కారం

25వ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని సుఖమంచి కోటేశ్వరరావు స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం జూలై 21 సాయంత్రం 5 గంటలకు, ఠాగూర్ గ్రంథాలయం, విజయవాడలో జరుగుతుంది. ముఖ్య అతిథి వడ్డే శోభనాద్రీశ్వరరావు. 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుంది.

తంగిరాల చక్రవర్తి

కార్టూనిస్ట్ శేఖర్ పురస్కారం

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక పురస్కారం 2024 సంవత్సరానికి గాను తెలంగాణ టుడే కార్టూనిస్ట్ పి. నర్సిం ఎంపికయ్యారు. పురస్కార ప్రదానం జులై 21 ఉదయం 10.30 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. వివరాలకు: 9052116323

శేఖర్ కుటుంబ సభ్యులు

థాంక్స్ గివింగ్

ఎవడైనా సరే
రణరంగంలోనే పాఠాలు నేర్చుకోవాలి
శిబిరం నుంచే తొలి పోరాటం మొదలుపెట్టాలి
ఎవడి చరిత్రను వాడే రాసుకోవాలి

నేల సారవంతంగా ఉన్నా భయాపహాస్యాల గుప్పెట్లో చేతన పెరగక
దళితోద్యమం ఎడారిలో పెరుగుతున్న చెట్టు గనక
చదవేసిన కొంపల్లో ఆత్మగౌరవోద్యమం
ఎర్ర సూర్యాస్తమయంలా కనుమరుగయ్యే లోపల
విహంగ వీక్షణ యాత్ర ఇక్కడినుంచే మొదలుపెట్టాలి...
'మాదిగ కుక్కల్లారా!
మమ్మల్ని ఎదిరించినందుకు గుణపాఠం నేర్చుకున్నారా' అని
సవాలు చేసిన జాతి గ్రామాలకు
గుంటూరు నగరవీధుల్లో పట్టపగలు దివిటీలతో ఊరేగిన కవికోకిల
గుర్తుకొస్తే ఎవరికెవరు గుణపాఠాలు నేర్పారో తెలుస్తుంది
కుల ఘర్షణల కుండపోతల మధ్య
విచిత్ర దేశం దాక్కుని ఆత్మగౌరవాన్ని వాగ్దానం చేసినా
నమ్మని తాటాకుల ఇళ్ళలో విజయనగర్ కాలనీలు మొలుస్తాయి..
గంజికి గతిలేని పద్దెనిమిది పేద పేటల్లో
'పూటకో పేట' నినాదమై ఆకలి తీర్చిన రోజుల్నీ
అన్నం దొరకని రాత్రుళ్ళు కడుపు నింపిన స్వచ్ఛమైన వాగులా
తేనెలా తీపి చేసిన తెనాలి మంచి నీళ్ళనీ ఎలా మర్చిపోతాం

నాలుగు దశాబ్దాల ఉద్యమ పుట్టనెక్కి
తెలుగు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ తలదాచుకున్న
పొన్నూరు తెలుగు లుంబినీ వనానికి తీర్థయాత్ర చేసి
శాక్యముని కత్తిని పలకరించి 'కట్టెలమోపు'ను మొయ్యాలి
లుంబినీ వనమే గానీ దేదీప్యమానంగా వెలిగే పార్కులుండవు
స్వర్ణకుమారి నివాసమేగానీ, స్వర్ణ భస్మమే తప్ప,
లేశమాత్రం స్వర్ణం ముండదు.
రాజమాత మాయావతి భవనాలూ, బ్రాహ్మీలిపిలో శాసనాలూ..
రాతితో చెక్కిన తీవిగా కనబడే గొప్ప అశోక స్థంభం,
మౌర్యుల కాలం నాటి కలప నిర్మాణాల భవనాలు ఉండవు.
శ్రీనాథుడి హంస తూలికా తల్ప దృశ్యాలు చూడముగానీ



పాత మడత కుర్చీలో ఒక మూల కూర్చుని
కవిత్వమో కథో వ్యాసమో డిక్టేట్ చేస్తూ కనబడతాడుగానీ
కన్నమనీడై ఖడ్గాన్ని ధరించిన జ్ఞాపకాలింకా పచ్చిగానే ఉన్నాయి..

దుఃఖభాజనమైన నదులు చెలియలికట్టలు దాటుతాయి కాబోలు
వినడానికొక సింగిల్ విండో పథకమెప్పుడూ తెరిచే ఉంటుంది
అన్ని ట్రోల్ ఫ్రీ నంబర్లూ అక్కడ పనిచేస్తాయి

నవలల్లో తప్ప ఎవరూ ఊసెత్తని 'మాలపల్లి' చుండూరులో
కొన్ని బియ్యే ఎమ్మేలు మోటార్ సైకిళ్లకి చక్కర్లు కొడుతున్నాయని
అంటరాని వసంతం అక్కడంతా విరగబూస్తోందని
ద్విత్వాక్షర కులాలు కత్తులు దూసిన నెత్తుటి దార్లలో ఆతను

హంసగీతంను గుర్తుచేసిన ఊరిని చూసి రావాలని ఉంది
ఇంకా కులం లేదని బుకాయించేవాళ్ళని
మోదుకూరు బ్రిడ్జి కిందకూ ట్రెక్కింగ్ చేయించాలని ఉంది

అతని స్వరం ఉద్యమానికి బలమైన సాక్ష్యంలా.
సుద్ద కళాకారుడిలా పోరాట చిత్రాల్ని వీధుల్లో గీస్తూ...
గ్రీకు ఎరితోస్తెనేస్ నీడల్ని కనుగొన్నట్లు
తుంగభద్ర కాలువలో నిర్భాగ్య మృతదేహాల బయటకు తీస్తుంది
నిద్రపుచ్చిన కథలతో మనమంతా హాయిగా నిద్రపోతున్నప్పుడు
కళ్ళు తెరిచి పాలీ ప్రాకృత హిందీ తమిళ్ మళయాళ భాషల్లో
'న్యాయ' పదానికి చెబుతున్న అర్థం
తెలుగు మాగాణంలో ఎందుకు లేదో ఆలోచిస్తూ ఉంటుంది...


పదేళ్ల క్రితమే పదవీ విరమణ చేసినా
కనీసం లక్షరూపాయల పెన్షన్ పట్టుకెళ్ళే ఉద్యోగాన్ని ఒదిలేశాక
నిరాశ సంకెళ్ళతనికి ఎవరు వెయ్యగలరు!
ఇంటి ముందు పడ్డ ఉద్యమాల పరకల్ని మోకు పేనుకుంటూ
బాధల క్షేత్రాల్ని వెదుక్కుంటూ వెళ్ళిపోతాడతను...
ఇంత పోరాట వారసత్వం మిగిల్చాక
తనకు చావెక్కడిదని గలగలా నవ్వుతాడు...
అవును!
ఎంతిస్తే మాత్రం అతని రుణాన్ని ఈ జాతి తీర్చుకుంటుంది గనక
అతనికి బాకీపడ్డ రుణాన్ని ఎవరు మాఫీ చేస్తారు గనక...

(నాలుగు దశాబ్దాల దళితోద్యమంపై విహంగ వీక్షణం)

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్

95380 53030

గౌరిపెద్ది అవధాన పద్య కళాసౌరభం



ఆంధ్ర సారస్వతంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనా సాహిత్యం అనేక అనర్ఘ వాఙ్మయ రత్నాలకు గని. ఆ రత్నాలను త్రవ్వి తీసి, సానపట్టి కాంతి పుంజాలను తెలుగువారి హృదయ మందిరాలలో ఆరని జ్యోతులుగా ప్రకాశింప చేసినవారు పండిత ప్రకాండులు వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గార్లు. అంతటి విద్వాంసుల సరసన ఆసీనులై అన్నమయ్య కీర్తనల పరిష్కరణ ఘనతను సాధించినవారు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు (10.09.1922 - 21.01.1991).

మహాభారతాంధ్రీకరణలో సింహభాగం తిక్కనకు దక్కినట్లుగానే అన్నమయ్య కీర్తనల పరిష్కరణ తపస్సులో అధిక భాగం రామసుబ్బ శర్మ గారికి దక్కింది. అన్నమయ్య సంకీర్తనలతో 27 సంపుటాలను పరిష్కరించారు. 19 సంపుటాలకు విస్తృత పరిశోధనాత్మక పీఠికలు రచించారు. ఎన్నో పద్య కావ్యాలు రచించారు. అవధాన విద్యలో అగ్రగణ్యులు. శతాధిక అష్టావధాన, శతావధానాలు చేశారు.

అవధానంలోని అన్ని అంశాలలోనూ శర్మగారి ప్రతిభ నవనవోన్మేషంగా వికసించేది. సంస్కృతాంధ్ర భాషలు రెండింటిలోనూ రసవత్తరంగా సమస్యా పూరణలు సాగేవి. శతావధానులే వీరి అవధానాలలో పృచ్ఛకులుగా పాల్గొనేవారు. ఒకసాటి అష్టావధానంలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారికి పృచ్ఛకుడు ఇచ్చిన సమస్య- "వర్జ్యము కాదు మాంస మధుపానము బ్రాహ్మణ జాతికెయ్యెడన్" అనేది. సహజంగా ఇది వ్యవహార విరుద్ధం. ఈ విరుద్ధ భావాన్ని తొలగించి సమస్యను పరిష్కరించాలి. ఈ క్లిష్టతకు తోడు దీనిలో ప్రాసాక్షరం 'ర్జ్య' అనే దుష్కర ప్రాస. నిఘంటువులలో 'ర్జ్య' సంయుక్తాక్షరం రెండో అక్షరంగా కల పదాలు కనిపించవు. బ్రాహ్మణులకు మాంస మధుపానము వర్జింప (విడిచిపెట్ట) తగినవి కావు అనే సదాచార వ్యతిరిక్త భావాన్ని సానుకూలంగా మలచుకొని అవధానిగారు ఈ విధంగా పూరించారు.

"భర్జ్యములౌచు నంజుడులు పాకమునన్ రుచినించ వచ్చుపో
వర్జ్యము లేక వానినొక వర్గము వారు భుజింపవచ్చుపో
మార్జ్యత గల్గు చోట అనుమానము లేక భుజింప వచ్చు ఆ
వర్జ్యము కాదు మాంస మధుపానము బ్రాహ్మణజాతి కెయ్యెడన్."

- ఇలా 'వర్జ్యము' అనే పదానికి 'ఆ' అనే అక్షరాన్ని ముందు చేర్చి స్వీకరింప దగినవి కావు అనే సముచితార్థాన్ని సాధించారు. సంస్కృత ధాతువులకు ముందు చేరే కొన్ని ప్రత్యయాలు (ప్రాదులు) ధాతువు అర్థాన్ని మార్చి వేస్తాయి. 'గమనం - ఆగమనం' అనేది ప్రసిద్ధమైన ఉదాహరణ. పై పూరణ పద్యంలోని 'భర్జ్యము, మార్జ్యత' పదాలు పాణిని అష్టాధ్యాయి వ్యాకరణ శాస్త్రంలోని ఉణాది సూత్రాల ఆధారంగా రూపొందింపబడిన పదాలు. ఇది గౌరిపెద్ది వారి పాండిత్య ప్రకర్షకు, వ్యాకరణ శాస్త్ర అధికారానికి ప్రబల నిదర్శనం.

సంస్కృత భాషలోసైతం గౌరిపెద్ది అవధాన చాతుర్యం పలు సందర్భాల్లో ప్రస్ఫుటం అయింది. ఒక పర్యాయం కర్నూలులో చేసిన అవధానంలోని వర్ణనాంశంలో వర్షర్తువు, ఒక కన్య అనే రెండర్థాలతో కూడిన శ్లేషాలంకారంతో సంస్కృత శ్లోకం చెప్పవలసినదిగా పృచ్ఛకుడు అడిగినప్పుడు శర్మగారు-

"తటిల్లతాచారు పయోదరోజ్జ్వలా
నవాంబుధారా రశనోజ్జ్వలత్కటీ
సుబర్హిణోపాత్త మనోహర స్వరా
నికామయా నృత్యతి వర్ష కన్యా" అని వర్ణించారు.

మెరుపు తీగ వంటి శరీర కాంతి, మనోహరమైన వక్షస్థలమూ కలిగి నూత్నమేఘం వలె సౌందర్యవతియై మొలనూలి కాంతిచే శోభాయమానంగా కదులుతూ నెమలి కంఠ ధ్వని వంటి మనోహర కంఠ ధ్వని కలిగినదై వర్ష సమయంలో ఒక కన్య నృత్యం చేస్తున్నదని స్త్రీ పరమైన అర్థం. మెరుపు తీగలు, అందమైన మేఘాలచే ప్రకాశిస్తూ నూతన జలధారలు కలిగి రశనా కాంతి వలె ప్రకాశమానమై మయూర రావ మనోహరమై స్వేచ్ఛగా వర్ష కన్య నృత్యం చేస్తున్నదని వర్షపరమైన అర్థం. గౌరిపెద్దివారి సంస్కృత పాండితీ గరిమకు ఇది ఒక ఉదాహరణ.

అవధానం తెలుగు భాషకు సహజసిద్ధమైన ఆభరణం. తమ అవధానాల ద్వారా తెలుగు భాష విశిష్టతను చాటిచెప్పిన ఖ్యాతిని ఆర్జించిన వారు గౌరిపెద్ది. సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞతతో, శ్లేషాది అలంకార సౌభాగ్యంతో, పద ప్రయోగ చమత్కారాలతో, మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలతో, పౌరాణిక నేపథ్యంతో, జనజీవన సరళితో గౌరిపెద్ది వెలువరించిన అవధాన పద్యాలు తెలుగువారి హృదయాలలో అమందానందానుభూతిని పండించేవి.

సాధారణంగా పదాలను సందర్భోచితంగా విభజించటం వలన వినూత్నమైన అర్థాలు గోచరించి సన్నివేశానికి సొగసును చేకూర్చుతాయి. అటువంటి స్వారస్యయుతమైన సమస్యా పూరణను గౌరిపెద్ది అవధానాలలో ప్రేక్షకులు ఆస్వాదించి రసానుభూతి నందిన సందర్భాలు కోకొల్లలు. ఒక పృచ్ఛకుడు ఇచ్చిన "మంచాలన్ బిగియించె గూటములకమ్మా బిందియన్ దేగదే" అనే సమస్యను ఈ విధంగా పూరించారు:

"సంచారంబులు మాని ధేనువులు నిశ్శంకంబుగా దొడ్లలో
చంచద్వత్సతరావళీ కలితదుస్సంబాధలై తోచు నా
పంచన్ పెత్తనమేల దూడలవిగో పాలెన్ వడిన్ పిండ ని
మ్మంచాలన్ బిగియించె గూటముల కమ్మా బిందియన్ దేగదే"

- ఇక్కడ అచ్చమైన పల్లె జీవితం నేపథ్యంగా ఈ సమస్య పూరింపబడింది. గోధూళివేళ ధేనువులు సంచారాలు మాని, లేగదూడలు అటూయిటూ గంతులు వేస్తూ ఇరుకు స్థలంలో బాధపడుతున్నాయి. పంచలో పెత్తనం విడిచిపెట్టి పాలు పిండటానికి వెంటనే బిందె తీసుకొనిరా. ఆవులు గూటాలకు బిగించి కట్టివేయబడినాయి అని ఒక తల్లి తన కుమార్తెతో అంటున్న సన్నివేశాన్ని అవధాని దృశ్యీకరించారు ఈ పద్యంలో. 'పిండనిమ్ము + అంచు + ఆలన్' అనే పద విభాగంతో సమస్య తొలగిపోయింది. 'అనుచు' అనే క్రియాపదంలో నడుమ 'ను' వర్ణం స్థానంలో బిందువు వచ్చి 'అంచు' అవుతుంది. 'ఆవు + లు' - 'లు' బహువచనం పరమైనప్పుడు ఏకవచన ప్రత్యయం 'వు' లోపించి 'ఆలు' - అవుతుంది.

అవధానాలలో ఆశువు ఒక అంశం. గౌరిపెద్దివారి ఒక అవధానంలో పార్వతీ పరమేశ్వరుల సమాగమాన్ని సీస పద్యంలో ఆశువుగా వర్ణించమని పృచ్ఛకుడు అడిగినప్పుడు ఆలంకారిక శైలిలో చక్కని సీస పద్యం వారి ముఖతః వెలువడింది. గౌరిపెద్దివారికి శ్రీనాథుని కవిత్వంపైనా, శ్రీనాథుని సీసపద్య రచన పట్లా అపారమైన ప్రీతి. ఆనాటి అవధానంలో శ్రీనాథుని సీస పద్య శైలిని తలపించే రీతిలో సుకుమార భావ సౌందర్యంతో వారు అల్లిన సీసం పండితుల తలలూపింపచేసింది.

"బంధూక కుసుమ ప్రభాహారి కౌశేయ
వీచికా బంధంబు వెలుగులుమీయ
శింజాన మంజీర మంజుల ధ్వనిపాద
విన్యాస తాళంబు విధము దోప
శివుచూడ నడసాగు చిన్నారి చూపులే
దారి చూపెడి ప్రతీహారిగాగ
గిరిరాజసుత వచ్చె తరలిపొండను లీల
మొలనూలిడెల్ బరాబరులు సేయ
మేనికలపంబు వాసన మిడిసి పడగ
సుమకరందము వల చేత సొగసు కూర్ప
మరుని యూపిరి తన్గని మసలు కొనగ
అభవు కొలువంగ వచ్చు మాయమ్మ దలతు"

కైలాస గిరిపై తపోదీక్షలో ఉన్న పరమేశ్వరుని సేవకై నడచి వస్తున్న పార్వతి రమణీయ రూపాన్ని దర్శింపచేశారు. శైలీ మనోహరత్వం, రచనలో పొంకమూ, పదప్రయోగంలో నాజూకుతనమూ, గౌరి నడకలో విలాసమూ గౌరిపెద్దివారి సీసంలో చిందులు వేశాయి.

అవధానం తెలుగు భాషకు సహజసిద్ధమైన ఆభరణం. తమ అవధానాల ద్వారా తెలుగు భాష విశిష్టతను చాటిచెప్పిన ఖ్యాతిని ఆర్జించినవారు గౌరిపెద్ది. సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞతతో, శ్లేషాది అలంకార సౌభాగ్యంతో, పద ప్రయోగ చమత్కారాలతో, మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలతో, పౌరాణిక నేపథ్యంతో, జనజీవన సరళితో గౌరిపెద్ది వెలువరించిన అవధాన పద్యాలు తెలుగువారి హృదయాల్లో అమందానందానుభూతిని పండించేవి.

వెలువోలు నాగరాజ్యలక్ష్మి

93941 13848

సువర్ణముఖి ఒడ్డున ఇసక బొమ్మల గూడు



ఆధునిక తెలుగు సాహిత్యం చాలావరకు మిడిల్ క్లాస్ వ్యవహారం లానే నడిచింది. పంతొమ్మిదొందల ఎనభైలూ తొంభైల దాకా కూడా అది మిడిల్ క్లాస్ చేత, మిడిల్ క్లాస్ కోసం, మిడిల్ క్లాస్ థీమ్స్‌తో రాయబడిందే. దాన్ని బేరీజు వేసింది కూడా అదే క్లాసు. పేద వర్గాల నుంచి ప్రతిభావంతులైన రచయితలు రావడం మొదలైంది ఎనభైలూ తొంభైల తర్వాతే (అప్పటిదాకా కులం, దాన్నంటుకునే ఉన్న పేదరికం వాళ్ళని చదువుల దాకా రానివ్వక). నాగప్పగారి సుందర్రాజు లాంటి రచయితల తర్వాత తెలుగు సాహిత్యపు సెంటర్ మిడిల్ క్లాస్ నుంచి పక్కకు జరుగుతూ వచ్చింది. ఇక్కడ మిడిల్ క్లాస్ అంటే జేబు తాహతు మాత్రమే కాదు, అదొక మనస్తత్వం కూడా.

ఇప్పటికీ ఎనభైల ముందే తెలుగులో గొప్ప సాహిత్యం అంతా వచ్చేసిందీ, ఇక ఆ తర్వాతంతా వేస్ట్‌లాండ్సే అన్న అభిప్రాయంతో చాలామంది ఉన్నారు. సాహిత్యాన్ని బేరీజు చేసే వ్యవస్థను ఇంకా మిడిల్ క్లాస్ మనస్తత్వమే ఆక్రమించుకుని ఉండటం దీనికి ముఖ్య కారణమనుకోవాలి. ఈ మెంటాల్టీ ఉన్నవాళ్ళు ఇప్పుడు అనేక అస్తిత్వాల నుంచి, వర్గాల నుంచి విరివిగా వస్తున్న సాహిత్యాన్ని నొస్టాల్జియా సాహిత్యం కేటగిరీలోకో, లేదంటే ఊళ్ళ పేర్లు పెట్టుకుని రాసే కతలు అనో పక్కకు తోసేస్తారు. అదీకాదంటే ఉదారంగా అధోజగత్ సహోదరుల కథలు అని దీవిస్తారు. వీళ్ళ ఉద్దేశంలో 'అధోజగత్' అంటే వీళ్ళకి కింద ఉన్న ప్రపంచం, మరి వీళ్ళెక్కడయ్యా అంటే- మిడిల్ క్లాస్! ఒకవేళ వీళ్ళు ఈ సాహిత్యాన్ని ఒప్పుకున్నా ఆ లెక్కలు వేరే ఉంటాయి. ఆయా సామాజిక వర్గాల అస్తిత్వాలకు సంబంధించిన సోషల్ డాక్యుమెంట్లలాగ మాత్రమే ఈ సాహిత్యానికి విలువ ఇస్తారు. దీనికి తగ్గట్టే కొంతమంది రచయితలు ఊరిలో బాల్య జీవితాల్నీ పేదరికాన్నీ మిడిల్ క్లాస్ టేస్ట్‌కు నప్పేట్టు, వాళ్ళకు నొప్పెట్టనంత సున్నితంగానూ కంఫర్టబుల్‌గానూ, మ్యూజియంలో అద్దాల వెనక ప్రదర్శనల్లాగా చేసి చూపించేవాళ్ళూ ఉన్నారు. ఇలాంటి ప్రదర్శనాభిలాష లేకుండా, "మా జీవితాలు మీ లివింగ్ రూముల్లోకి వచ్చి మీ సోఫాల్లో కూర్చోవు, చూడదల్చుకుంటే మీరే అంబేద్కర్ బొమ్మ దాటి మా వాడల్లోకి వచ్చి ఇక్కడ నిలబడి చూడండి!" అని ఎసెర్టివ్‌గా రాసే వాళ్ళు అరుదు. అలాంటి అరుదైన రచయితల వరసకు గొప్ప చేర్పు సొలోమోన్ విజయ్ కుమార్. రచయితగా ఆయన వయసు రెండు పుస్తకాలు. మొదటిది 'మునికాంతపల్లి కతలు' కథా సంపుటి, రెండోది 'సన్ ఆఫ్ జోజప్ప' నవల.

'మునికాంతపల్లి మనుసుల్ని సొర్ణముకి యేటి ఇస్కతో జేసినట్టుండారు. పాడిసక ఎంత తేలిగ్గా యాళ్ల సందల్నుంచి జారిపోతాదో తడిసక అంత బొరువు' అంటాడు రచయిత. ఆ బరువైన తడి ఇసకతో చేసిన బొమ్మల చుట్టూ మెత్తిన ఇసక గూడు ఈ కథల పుస్తకం.



మునికాంతపల్లి అనే ఊరు ఎక్కడా లేదు. అది సొలోమోన్ విజయ్ కుమార్ సువర్ణముఖి నది ఒడ్డున తనకు తెలిసిన మనుషుల్నీ, కథల్నీ సాహిత్యం చేసేందుకు కల్పించుకున్న ఊరు. విజయ్ కుమార్ తనకు జరిగిన అనుభవాల్ని, తనకు తెలిసిన మనుషుల్నే కథలుగా చెప్తున్నానంటారు. ఆయన శైలి ఆ కథల్ని ఆపకుండా చదివిస్తుంది. కథ మొదలు పెట్టడమే ఒక సంఘటనతో మొదలుపెట్టి రెండు మూడు వాక్యాల్లోనే పాఠకుడ్ని కథ మధ్యలోకి తెచ్చి పడేస్తారు. తేరుకునే లోగానే రెండు మూడు పేజీల్లో ముగించేస్తారు. తన కవిత్వ నేపథ్యం తనను ఇలాంటి క్లుప్తతవైపు నడిపించిందని ఆయన చెప్తారు. కథేం లేదూ అనుకున్న చోట కథ పుట్టించడంలో సొలోమోన్ విజయ్ కుమార్‌ది ప్రత్యేక ప్రతిభ. ఈ కథలు చదివితే మనం మన చుట్టూ ఉన్న ఇన్ని కథల్ని చూడనే లేకుండా మిస్ అవుతున్నామా అనిపిస్తుంది.

ఊళ్ళో అన్ని సందులూ, అందరు మనుషులూ తెలిసినవాడొకడు ఫ్రెండ్ లాగా మన భుజం మీద చేయేసి ఆ ఊరి వీధులమ్మటా మనల్ని నడిపిస్తూ దార్లో కనపడిన ప్రతి మనిషినీ చూపించి 'యీడి గురించి నీకోటి చెప్పాలిరా' అనో 'ఈమె భలే మనిషిరా' అనో వాళ్ళ కథలు చెప్తూ తీసుకెళ్తున్నట్టు ఉంటుంది. విజయ్ కుమార్‌కి సృష్టిలో మనుషులకంటే, వాళ్ళ కథలకంటే ముఖ్యమైందేదీ లేదు. ఒక కథలో దేశదిమ్మరి కాశయ్య ఎక్కడెక్కడో తిరిగొచ్చి ఓ రోజు ఊళ్ళో చెట్టు కింద తన పక్కనే కూలబడి, 'అడవుల్లోని సల్లదనవూ, బచ్చదనవూ, కొండల కాడ గాలీ..' అంటా ఉంటే, అదంతా వద్దు కథకుడికి. కాశయ్య ఎప్పుడో యవ్వనంలో పెళ్ళి చేస్కుని వదిలేసినామె కథే కావాలి. 'మల్లమ్మని జేసుకున్నానంటివే, యేమైనాదావే?' అంటాడు. ఆ ఊళ్ళో ఉన్న ప్రతి మనిషి కథ పట్లా ఈ 'ఇళ్ల బుచ్చోడి'కి ఉన్న కుతూహలమే, తరగని దాహమే ఇందులోని ప్రతి కథనీ చేయిపట్టి నడిపిస్తుంది! 'సిన్నప్పుడు వాకిటికొక కతా, మనిషికొక కళా గెవణిస్తా తిరిగినాను కాబట్టే ఇన్ని సంవొచ్చరాలు గడిసినాక ఈ పిడికెడు సిట్టిపొట్టి కతల్ని రాయగలిగానని అనుకుంటుండాను' అని చివరిమాటలో చెప్తాడు. 'మునికాంతపల్లి మనుసుల్ని సొర్ణముకి యేటి ఇస్కతో జేసినట్టుండారు. పాడిసక ఎంత తేలిగ్గా యాళ్ల సందల్నుంచి జారిపోతాదో తడిసక అంత బొరువు' అంటాడు. ఆ బరువైన తడి ఇసకతో చేసిన బొమ్మల చుట్టూ మెత్తిన ఇసక గూడు ఈ కథల పుస్తకం. చదువుతుంటే కరిగి నీరైపోయే మన మనసు లోనే ఆ బొమ్మలన్నీ కరిగి కలిసిపోతాయి.

ఈ కథలు చెప్పటానికి విజయ్ కుమార్ అచ్చంగా 'చెప్పే' శైలినే ఎంచుకున్నాడు. అంటే పుస్తకంలో అక్షరాల రూపంలో కనిపిస్తున్నప్పటికీ ఇవి 'రాయబడిన' కథలు కావు. పాత్రల సంభాషణల్ని వేరు చేస్తూ కొటేషన్ గుర్తులు కూడా లేకపోవటం ఇందుకు ఒక రుజువనుకోవచ్చు. చెప్పటంలో ఏ విషయాన్ని ఎలా దాచి ఎక్కడ చెప్తే ఆ కథ రక్తి కడుతుందో ఆ శిల్పం విజయ్ కుమార్‌కి తెలుసు. దేవగన్నిక సిత్ర ఆడా మగా కానివాడని ఎక్కడ చెప్పాలో, చివరకి చెరువులో తేలే ఎంగిలోడికి కుష్టురోగముందని ఎక్కడ చెప్పాలో అక్కడే చెప్తాడు. ఈ కథల్లో బూతుల్ని ఎక్కువ వాడతాడు, కానీ ఏ మాటా రచయిత తెచ్చి ఆ పాత్రల నోట పెట్టినట్టు ఉండదు. పాత్రలే వచ్చి రచయిత చెవిలో కూర్చుని చెప్పి రాయించుకున్నట్టు ఉంటాయి.

రచయిత రెండో పుస్తకం 'సన్ ఆఫ్ జోజప్ప'కి వచ్చేసరికి, ముందొచ్చిన కతల పుస్తకం కేవలం నెట్ ప్రాక్టీస్ లాగా అనిపిస్తుంది. కథలకీ, నవలకీ పోలిక తేలేం నిజమేగానీ ఇంతకుముందు కథల్లో అక్కడక్కడా కన్పించిన మొదలుపెట్టాకా ఎటుపోవాలో తెలీనితనం, రెండు మూడు థీమ్స్ మధ్య తన్నకలాడటం లాంటివి ఈ నవల్లో లేవు. ఒకే థీమ్‌ని పట్టుకుని చాలా అందంగా, ధైర్యంగా చెప్పిన నవల ఇది. ఒకానొక హోమోసెక్సువల్ 'పిల్లాడి' కథ (ఆ కేరెక్టర్ పేరు పిల్లోడే). వాడి బాల్యం నుంచి మొదలుకొని, వాడు తన సెక్సువాలిటీ ఇదీ అని అర్థం చేసుకునే క్షణాల మీదుగా, ఆ తర్వాత వాడు దారీతెన్నూ తెలియక తొక్కే చీకటి దారుల గూండా, చివరికి వాడు ఎక్కడకొచ్చి తేలాడో, అదెలాంటి ఒంటరితనమో మనకి అనుభవానికి తెస్తాడు రచయిత. హోమో సెక్సువల్ అంటే అదేదో వేరే జీవి అన్నట్టూ, అలాంటి అనుభవాలు వేరే జీవితం అన్నట్టూ కాకుండా, మన అందరికీ ఉన్న కామమే కాస్త అటు దిశ మార్చుకుంటే, దాన్ని ఒప్పుకునే సమాజం చుట్టూ లేనప్పుడు, అది ఎంత కష్టమైన జీవితం కాగలదో, మనకి అర్థమయ్యేలా చూపిస్తాడు. అలాంటి మనుషుల పట్ల వెక్కిరింతే ఉన్న ప్రపంచంలో మనల్ని ఆ మనిషి మనసు లోకి తీసుకెళ్తాడు, వాడ్ని మనం మన గుండె లోకి తీసుకునేలాగ చేస్తాడు. ఒకరకంగా ఇది భయానక అనుభవాల సంపుటి. చాలా బాధపెట్టే కథ. రాసేవాడు తన తాతగారి వంశపారంపర్య పడక్కుర్చీలో ఒద్దిగ్గా కూర్చుని రాస్తున్నాడా, తడి బారిన గోడల మధ్య వెలుతురు రాని గదిలో చింకి చాప మీద పడుకుని రాస్తున్నాడా అన్న దాంతో సంబంధం లేకుండా, వాడు రాసే రాతలో ఏం పణంగా పెడుతున్నాడూ, ఏ చీకటి మూలల్ని పందెం ఒడ్డుతున్నాడూ అన్నది కూడా లెక్కలోకి వస్తుందంటే- రచయిత ఇక్కడ చాలా పెద్ద పందెం ఒడ్డి ఈ నవల రాశాడు. ధైర్యాన్ని కూడా సాహిత్యానికి ఒక గుణం అని చెప్పగలిగితే ఇది తెలుగులో అత్యంత ధైర్యం గల పుస్తకమని చెప్పొచ్చు. తెలుగు సాహిత్యం మొహమాటం మొహమాటంగా దాటుకుపోయిన ఇతివృత్తాన్ని, ఏదో తెగించి అందర్నీ అఫెండ్ చేయటానికి రాస్తున్నా అన్నట్టు కాకుండా, అలాంటి జీవితాల్ని అత్యంత కరుణతో చదివినవారికి అర్థం చేయించేలాగ ఈ కథ చెప్పారు సోలోమోన్ విజయ్ కుమార్.

ఈ రెండు పుస్తకాలూ తెలుగు సాహిత్యం ఎల్లల్ని మరింత విశాలం చేసే పుస్తకాలు. మిడిల్ క్లాస్ మెంటాల్టీ పక్కనపెట్టి చూస్తే, తెలుగు సాహిత్యానికి ఇప్పుడు నడుస్తున్నవీ, ఇక ముందు రానున్నవీ ఎంతో మంచి రోజులే అనిపించేట్టు చేసే పుస్తకాలు.

ఎమ్. ఈశ్వర్ ప్రసాద్

పింగళి జగన్నాథరావు పురస్కారం

సాహితీ కిరణం 15వ వార్షికోత్సవం సందర్భంగా పింగళి జగన్నాథ రావు స్మారక సాహిత్య పురస్కారాన్ని మరుమాముల దత్తాత్రేయ శర్మ, సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని రమణ వెలమకన్ని, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని శైలజామిత్ర, గట్టుపల్లి చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారాన్ని బండారుపల్లి రామచంద్రరావు స్వీకరిస్తారు. ఈ సభ జూలై 19న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ గుండవరపు హనుమంతరావు కళావేదిక నందు జరుగుతుంది. ముఖ్య అతిథి కె.వి. రమణ, సభాధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి.

పొత్తూరి సుబ్బారావు

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఇంటర్నేషనల్ - సాహితీ కిరణం మాసపత్రిక సంయుక్తంగా నిర్వహిస్తున్న సింగిల్ పేజీ కథలకు సామాజిక స్పృహ గల కథలను పంపాలి. ఉత్తమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. డిటిపిలో ఒక పేజీకి (ఫాంట్ 16, ఎ4సైజు) మించని, సామాజిక స్పృహ కలిగిన కథలను, జూలై 31లోగా చిరునామా: సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ - 500102, ఫోన్: 9490751681కు పంపాలి.

సాహితీ కిరణం



దేశం లోపల యుద్ధం

ఇప్పటికిప్పుడు
యుద్ధమేదీ లేనట్టే వుంటుంది
నీ వద్దా నా వద్దా
యుద్ధబీభత్స వాతావరణం
వ్యాపిస్తున్నట్టే కనిపించదు
ఒట్టిగానే నిరాలంకార ముఖాలతో
ఎవరి పుట్టల్లో వాళ్లు
తలలు దాచుకొని బతకడమే
వైచిత్రి-

* * *

ఇప్పటికిప్పుడు ఇక్కడ
మాటల్లో చేతల్లో
నిజాన్నే ప్రకటించే పిల్లలున్నారు
అబద్ధపు ప్రచారాలూ
డాంబిక ప్రదర్శనలూ
పిల్లల ముందు వృథా

దేశంలోపల
యుద్ధముందో లేదో
చెప్పే సాక్ష్యం
పిల్లలు-

* * *

దేశంలోపల
రగులుతున్న అరణ్యంలో
యుద్ధముంది

మూకుమ్మడిగా
పులులు వేటాడితే
చెదిరిన జింకల్లా ఆదివాసీలు
రగులుతున్న అరణ్యంలో
జింకలు విల్లమ్ములను ధరించి
ఎర్రటి నిప్పులను
వెదజల్లడమే చరిత్ర
ఎర్రటినిప్పుల పూలవనంలో
కర్కసబూటు ముద్రలు వేయాలనుకునే
నీ కల ఒట్టి కల మాత్రమే
ఒట్టి కల మాత్రమే-

* * *

దేశంలోపల యుద్ధముంది
సముద్రకల్లోలముంది
యుద్ధకల్లోల సందర్భంలో
లేతచూపులను వేకువలుగా పూయించే
పిల్లలున్నారు

ఏమీ తెలియనట్టే వుంటారు
అన్నీ తెలియజేస్తారు పిల్లలు
ఏదీ మాట్లాడనట్టే వుంటారు
అన్నీ మాట్లాడుతారు పిల్లలు

వీరులతో పాటూ పిల్లలూ
దేశంలోపల యుద్ధాన్ని
చిరునవ్వుతో ఓడించే ధీరులే-

మంగ్లు



కనకదుర్గమ్మకు బోనం

హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆదివారం బంగారు బోనం సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఈ ఏడాదితో 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల వివిధ రకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. జోగిని నిషాక్రాంతి అమ్మవారి హావభావాలు ముఖంలో పలికించారు.

వెలంపల్లీ... ఇదేం లొల్లి!

వెలంపల్లి సోదరుడిపై కేసు పునర్విచారణ

2021లో భవానీపురంలో చీటింగ్ కేసు నమోదు

- ఇసుక రీచ్‌ల సబ్‌లీజుల పేరుతో పలువురికి టోకరా
- సబ్ లీజు కావాలంటూ వెళ్లిన జేపీ వెంచర్స్ ప్రతినిధి
- రూ.40 కోట్లు ఇస్తే సబ్ లీజుకు ఇస్తామని బేరం
- నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టిన జేపీ వెంచర్స్ ప్రతినిధి
- వెలంపల్లి సోదరుడితోపాటు పలువురు బడాబాబుల పేరుతో ఎఫ్ఐఆర్
- అప్పటి సీఎం పేషీ నుంచి ఒత్తిళ్లతో పక్కదారి పట్టిన కేసు
- అమాయకుడిని ఇరికించేసి బడాబాబులను తప్పించేశారు
- తాజాగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన బాధితుడు

కేసును తిరగదోడుతున్న పోలీసులు

వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు దొరికినంత ఇసుక దోచుకున్నారు. ఇష్టారీతిన అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇది ప్రత్యక్షంగా కనిపించిన దోపిడీ. ఇసుక క్వారీల సబ్ లీజు పేరుతో పరోక్షంగానూ భారీ దోపిడీకి తెగబడ్డారు. జైప్రకాశ్ వెంచర్స్ నుంచి తాము ఇసుక తవ్వకాలను సబ్ లీజుకు తీసుకున్నామంటూ కొందరు వ్యక్తులు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వసూలు చేశారు. వారిలో అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ సోదరుడు వెలంపల్లి రఘు నరసింహరాజు కూడా ఉన్నారు. అప్పట్లో ఆయనపై భవానీపురంలో ఎఫ్ఐఆర్ నంబరు 295/2021తో నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదైంది. పోలీసులు కేసును పక్కదారి పట్టించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కేసులో బాధితుడిగా ఉన్న కె.చంద్రశేఖర్ సీఎం చంద్రబాబును కలిసి కేసును పునర్విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కేసును తిరగదోడి అసలు దోషులు ఎవరో నిగ్గు తేల్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త ఇసుక పాలసీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలను గంపగుత్తగా జైప్రకాశ్ వెంచర్స్‌కు కట్టబెట్టేసింది. కొత్త ఇసుక పాలసీ వచ్చే సమయానికి తీవ్రమైన ఇసుక కొరత నెలకొని భవన నిర్మాణ రంగం కుప్పకూలిపోయింది. ఈ నేపథ్యంలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు రకరకాల ఎత్తుగడలతో రంగంలోకి దిగారు. జేపీ వెంచర్స్ నుంచి ఇసుక క్వారీలను సబ్ లీజుకు తీసుకున్నామని ఆసక్తి కల వ్యక్తులు ముందుకొస్తే వారికి క్వారీలను సబ్ లీజుకు ఇస్తామని గత ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఇసుక వ్యాపారులను ఆకర్షించి వారి నుంచి డబ్బు వసూలు చేయడం మొదలుపెట్టారు. ఈ విషయం అప్పటికే ఇసుక కాంట్రాక్ట్ దక్కించుకున్న జైప్రకాశ్ వెంచర్స్‌కు తెలియడంతో వారి ప్రతినిధి ఒకరు రంగంలోకి దిగారు. 2021 జూన్ 3న జేపీ వెంచర్స్ ఫైనాన్స్ మేనేజర్ విశ్వనాథన్ సతీశ్ విజయవాడ సమీపానున్న గొల్లపూడిలోని ఓ రియల్ ఎస్టేట్ ఆఫీసులో కొందరు వ్యక్తులతో సమావేశమయ్యారు. తనను తాను ఇసుక వ్యాపారిగా పరిచయం చేసుకున్నారు. తనకు కృష్ణాజిల్లాలో ఇసుక రీచ్‌లు సబ్ లీజుకు కావాలని వారిని అడిగారు. దానికి ఆ వ్యక్తులు తమకు రూ.40 కోట్లు ఇస్తే ఇస్తామన్నారు.

వ్యాపారమంతా మాదే..

జేపీ వెంచర్స్ బినామీ కంపెనీ అని ఇసుక వ్యాపారం అంతా తన అన్న వెలంపల్లి శ్రీనివాస్, సీఎం జగన్ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నడుస్తుందని అక్కడే ఉన్న వెలంపల్లి సోదరుడు రఘు సదరు ప్రతినిధికి తెలిపారు. ఇదంతా బోగస్ బాగోతమని అర్థమైన విశ్వనాథన్ సతీశ్ డబ్బులు తీసుకొస్తానని బయటకు వచ్చి నేరుగా భవానీపురం పోలీసుస్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై 2021 జూన్ 4న వెలంపల్లి శ్రీనివాస్ సోదరుడు రఘుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వెలంపల్లి రఘుతోపాటు విశాఖపట్నంకు చెందిన వ్యాపారి కొప్పురావూరి ప్రవీణ్ కుమార్, గుంటూరుకు చెందిన వ్యాపారి మల్లంపాటి శ్రీనివాసరావు, విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగి ముక్కోల్లు నాగమల్లేశ్వరరావు, కర్రి సురేంద్రనాథ్ రెడ్డి ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా ఉన్నారు. వీరిలో ప్రవీణ్, శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు వెలంపల్లి శ్రీనివాసరావుకు సన్నిహితులు. వీరిపై 120(బి), 420, 467, 468, 471 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. అయితే 24 గంటలు గడవకముందే సీను మారిపోయింది. ఈ కేసులో ఉన్నవారంతా వైసీపీ నేతలకు సన్నిహితులు కావడంతో ఆ ఎఫ్ఐఆర్‌ను పోలీసులు పక్కన పెట్టేశారు. మూడు సంవత్సరాలు గడిచినా ఆ ఎఫ్ఐఆర్‌పై చార్జిషీట్ దాఖలు చేయలేదు. పైగా కేసును పక్కదారి పట్టించేందుకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె.చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తిపై 2021 జూన్ 8న 495/2021 నంబరుతో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు మొత్తాన్ని అతనిపైకి నెట్టేశారు.

చంద్రబాబుకు మొరపెట్టుకున్న బాధితుడు

ఈ మొత్తం ఎపిసోడ్‌లో బాధితుడిగా ఉన్న చంద్రశేఖర్ ఇటీవల సీఎం చంద్రబాబును కలిశారు. వెలంపల్లి సోదరుడు రఘు ఆధ్వర్యంలో జరిగిన ఇసుక చీటింగ్ వ్యవహారాన్ని ఆయనకు వివరించి తనకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ఈ కేసును పునర్విచారించేందుకు విజయవాడ పోలీసులు సిద్ధమవుతున్నారు.

మంచం పట్టిన ఏ. కొండూరు

15 రోజుల్లో విష జ్వరాలకు ముగ్గురు బలి

- ఇప్పటికీ జ్వరాల బారిన గ్రామస్థులు
- పారిశుధ్య చర్యలు, వైద్య శిబిరాలు అవసరం

ఏ.కొండూరు, జూలై 14 : విష జ్వరాలతో మండల కేంద్రం ఎ.కొండూరు మంచం పట్టింది. పారిశుధ్యం సరిలేక గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటి బారినపడి 15 రోజుల వ్యవధిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా 40 ఏళ్ల వయసున్నవారే. దీంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. ఎ.కొండూరులోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన సిద్ధం భారతి (32) కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స పొందేవారు. ఒక్కసారిగా జ్వర తీవ్రత పెరడం, కొద్దిగా కామెర్లు లక్షణాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు చిన్నఅవుటుపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భర్త గతంలో క్వారీ పనులు చేస్తుండగా, చేతివేళ్లు తెగిపోయాయి. కుటుంబానికి భారతి సంపదనే ఆధారం. ఆమె మరణంతో కుటుంబం దిక్కులేనిదయింది.

- ఈనెల 10న ఇదే కాలనీకి చెందిన ఆశా కార్యకర్త తోట రాధ మృతిచెందారు.
- 10 రోజుల క్రితం పాత కొండూరు హరిజనవాడకు చెందిన వేంపాటి లక్ష్మణరావు విష జ్వరానికి బలయ్యారు. మృతులు అందరు ఎస్సీ కాలనీకి చెందినవారే. వైద్య సేవలు, పారిశుధ్య చర్యలు సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో, ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ఇప్పటికీ గ్రామాల్లో అనేక మంది జ్వరాలతో బాధపడుతూనే ఉన్నారు. తక్షణం జిల్లా వైద్యాధికారుల బృందం వైద్య శిబిరాలు నిర్వహించాలని, పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుడివాడలో పెట్రోలు బంకు సీజ్

కల్తీ పెట్రోలు అమ్మకాలు చేసిన గులాబ్‌చంద్ బంకు సీజ్



గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడలో కల్తీ పెట్రోలు విక్రయిస్తున్న 'షా గులాబ్‌చంద్ జీవావత్ అండ్ కో పెట్రోల్ బంకును అధికారులు ఆదివారం సీజ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో నిన్నటి వరకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని 'షా కీర్తికుమార్ జీవావత్, అతని పార్టనర్ ఆనంద్ సాగించిన పెట్రో కల్తీ వ్యాపారానికి అధికారుల బృందం చెక్ పెట్టింది. తూనికలు, కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ, హెచ్‌పీసీఎల్ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. 5 లీటర్ల కొలతతో 4 పర్యాయాలు పరీక్ష నిర్వహించారు. నాణ్యాతా ప్రమాణాలు పాటించడంలోనూ, స్టాక్‌లోనూ అమ్మకాల్లోనూ తేడాలున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. బంకులోని అండర్ గ్రౌండ్ ట్యాంకుల్లో పెట్రోల్‌ను బయటకు తీశారు. నాలుగు పెద్ద డ్రమ్ముల్లో నీళ్లతో కూడిన ఇథనాల్ బయటపడింది. పెట్రో నిబంధనల ప్రకారం బంకు నిర్వహించ డం లేదని తేల్చారు. పెట్రోల్ రసాయనాలు పరిమాణం కంటే అధికంగా ఉన్నాయని, నీళ్ల శాతం కూడా ఎక్కువగా ఉందని నిర్ధారించారు. ఫిల్టర్ పేపర్ టెస్ట్‌లో కల్తీ ఉన్నట్లు తేలింది. శనివారం రాత్రి హెచ్‌పీసీఎల్ సేల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సదరు పెట్రో పంపు నుంచి అమ్మకాలను పూర్తిగా నిలిపివేశారు.

ఎడతెరపిలేని వర్షం

రెండు రోజులుగా చిరుజల్లులు

- జిల్లాలో 17.54 మి.మీ వర్షపాతం
- ఎగువ వర్షాలతో పొంగుతున్న వాగులు



కృష్ణలంక వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మండలం	వర్షపాతం (మి.మీ)
ఏ.కొండూరు	54.4
విస్సన్నపేట	45.4
తిరువూరు	40.6
గంపలగూడెం	36.0
వత్సవాయి	24.6
రెడ్డిగూడెం	16.4
పెనుగంచిప్రోలు	15.8
కంచికచర్ల	14.8
వీరులపాడు	13.2
జి.కొండూరు	11.8
జగ్గయ్యపేట	11.2
చందర్లపాడు	9.2
నందిగామ	8.6
మైలవరం	8.6
విజయవాడ సెంట్రల్	7.2
విజయవాడ పశ్చిమ	7.2
విజయవాడ తూర్పు	7.0
విజయవాడ రూరల్	6.8
విజయవాడ ఉత్తరం	6.8
ఇబ్రహీంపట్నం	5.2

విజయవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడుతున్నాయి. తెల్లవారుజామున వర్షం జోరుగా కురుస్తోంది. ఆ తర్వాత నుంచి దఫదఫాలుగా జల్లులు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 17.54 మిల్లీ మీటర్ల సరాసరి వర్షం కురిసింది. ఎ.కొండూరు మండలంలో అత్యధికంగా 54.4, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోపక్క ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తుండడంతో వాగుల నుంచి వరద ముందుకొస్తోంది. మెట్ట ప్రాంతంలో ఉన్న కట్టలేరు వాగు నుంచి వరద దిగువకు వస్తోంది. ఈ వరద నీరు కృష్ణా నదిలోకి చేరుతోంది. జిల్లాను ముసురు వాతావరణం కమ్మేసింది. ఈ వర్షాల కారణంగా విజయవాడలో ఎక్కడికక్కడ నీరు నిలచిపోయింది. బెంజ్‌సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కబేళా, లోబ్రిడ్జి, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, విద్యాధరపురం, సితార సెంటర్, వాగు సెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌లకు పక్కన నిలిచిపోయిన నీటిని మున్సిపల్ సిబ్బంది హైడ్రాలిక్ యంత్రం ద్వారా తోడేశారు.

రైతుల్లో హర్షాతిరేకాలు

ఈ వర్షాలకు నగర ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మిరప, టమాట, వినుము, పెసరతోపాటు ఉద్యానవన పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా ప్రకాశం బ్యారేజీకి ఇంకా ఆ నీరు చేరడం లేదు. ప్రస్తుతం పట్టిసీమ ద్వారా రోజుకు 6081 క్యూసెక్కుల గోదావరి నీరు వస్తోంది. ఈ నీటిని అటు పశ్చిమ, ఇటు తూర్పు డెల్టాకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్‌లో రెండు టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. దీని పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. తెలంగాణలో వర్షాలు విస్తారంగా కురిస్తే వాగులు వంకలు పొంగే అవకాశం ఉంటుంది. ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరిన తర్వాత బ్యారేజీ గేట్లను వచ్చే వరదను బట్టి ఎత్తే అవకాశం ఉంది.







భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో కోలాహలంగా తెస్తున్న బంగారు బోనం

కోలాహలంగా..

దుర్గమ్మకు బంగారు బోనం సమర్పణ

వన్‌టౌన్, జూలై 14: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బంగారు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి బంగారుబోనంతో 1050 మంది వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.





కిటకిటలాడుతున్న క్యూలైన్లు

దుర్గమ్మకు లక్ష్మీకాసుల బంగారు హారం

దుర్గమ్మ అలంకరణ నిమిత్తం గుంటూరుకు చెందిన ఎస్.హనుమాన్, ఎస్‌వీఆర్ఎల్ జ్యోతి, కుటుంబ సభ్యులు ఆదివారం 71 గ్రాముల లక్ష్మీ కాసుల బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. ఈవో రామారావును కలిసి హారాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.



ఈవో రామారావుకు హారాన్ని అందజేస్తున్న ఎస్.హనుమాన్, ఎస్‌వీఆర్ఎల్ జ్యోతి

దుర్గమ్మను దర్శించుకున్న 52 వేల మంది

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను 52 వేల మందికి పైగా భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. 4350 మందికి పైగా భక్తులు ఆషాఢ సారెలు సమర్పించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆదివారం, అష్టమి తిథి సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. ధర్మపథం వేదికపై హైదరాబాద్‌కు చెందిన వారాహి డ్యాన్స్ అకాడమీ శంకరమంచి ఆదిలక్ష్మి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది.

నేటితో వారాహి నవరాత్రులు ముగింపు

ఈనెల 6వతేదీ నుంచి దుర్గగుడిలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రులు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

దుర్గగుడికి రూ.51.16లక్షల ఆదాయం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు విశేషంగా విచ్చేశారు. దేవస్థానానికి సాయంత్రం 7 గంటల వరకు వివిధ టికెట్ల ద్వారా సమకూరిన ఆదాయాన్ని ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.500 దర్శనం టికెట్ల టికెట్ల ద్వారా రూ.15,31,500, రూ.300 టికెట్ల ద్వారా రూ.4,79,100, రూ.100 టికెట్ల ద్వారా రూ.6,05,300 ఆదాయం సమకూరింది. కేశఖండన శాలలో 2611 మంది తల నీలాలు సమర్పించారు. విరాళాల ద్వారా రూ.9,32,753 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ కమిషనర్

కనకదుర్గమ్మను దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో ఆయనకు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

- మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముస్లింల అభ్యున్నతికి కృషి



చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. మొహర్రం సందర్భంగా బిస్మిల్లాఖాన్ షాదీఖానాలో 123 ఆస్థానాల ముజావర్లకు రూ.5వేల చొప్పున చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంపీ బాలశౌరితో కలిసి ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. హైదరాబాద్ తర్వాత మచిలీపట్నంలోనే భారీగా మొహర్రంను పాటిస్తారని మంత్రి అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది మసీదులకు మరింతగా నగదు పెంచి ఇస్తామన్నారు. "ముస్లింలను ప్రభు త్వం ద్వారా అన్నివిధాల ఆదుకుంటాం. రెండు, మూడేళ్లలో మచిలీపట్నంలో ముస్లింల కోసం రూ.1.10 కోట్లతో కమ్యూనిటీహాల్‌ను నిర్మిస్తాం. ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలను కేటాయిస్తా." అని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి షమీఉన్నీసా, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, బండి రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కృష్ణలంక, జూలై 14: కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జిసృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏపీ ఎన్జీవో సంఘం పోరాటాలు ప్రశంసనీయం: మంత్రి కొలుసు

విజయవాడ లీగల్, జూలై 14: ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులు అనుభవించిన మానసిక వేదనకు ముగింపు పలికిన వర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్రని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శిగా 3 దశాబ్దాల పాటు పదవీ బాధ్యతలు నిర్వహించిన వ్యవసాయ శాఖ సూపరింటెండెంట్‌గా రిటైర్మెంట్ తీసుకొన్న ఎండీ ఇక్బాల్ పదవీ విరమణ జిల్లా సంఘం నేత విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని శేషసాయి కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ఎంతో అమూల్యమైన సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన ఉందని గుర్తు చేశారు. అతి త్వరలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘ నేతలతో సమావేశం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లా ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ఎండీ ఇక్బాల్ చాలా కార్యదక్షత కలిగిన నాయకుడన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు త్వరలో శుభవార్త చెప్తారన్నారు. అనంతరం అతిథులు ఇక్బాల్ దంపతులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఏపీ ఎన్జీవో సంఘం మాజీ నేత, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, సభ్యులు దస్తగిరిరెడ్డి, డీవీ రమణ, షరీఫ్, ఘంటసాల శ్రీనివాసరావు, శరత్, పెంచలరావు, రామ్మోహన్, ఎ.సాంబశివరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్లను ప్రక్షాళన చేయాలి

- 22 క్రీడా సంఘాల సమావేశం.. పలు తీర్మానాల ఆమోదం
- త్వరలో సీఎం, డిప్యూటీ సీఎంలను కలుస్తామని వెల్లడి

విజయవాడ స్పోర్ట్సు, జూలై 14 : ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ల ప్రక్షాళనకు ప్రభుత్వం, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) నడుం బిగించి క్రీడారంగాన్ని బతికించాలని పలు క్రీడా సంఘాలు కోరాయి. 22 క్రీడలకు సంబంధించిన సంఘాలు ఆదివారం విజయవాడలో సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ ఏపీలో ఒలింపిక్ సంఘాల్లో వివాదాల కారణంగా జాతీయ క్రీడల కేటాయింపు మనకు జరగట్లేదని, క్రీడాకారులు కూడా నష్టపోతున్నారని, అన్ని సంఘాలు ఒక తాటిపైకి వచ్చి పలు తీర్మానాలను ఆమోదించామన్నారు. 175/1961గా రిజిస్టరైన ఒలింపిక్ సంఘం సెక్రటరీగా కేపీ రావు రూ.18.50 లక్షలు, ఏపీవోఏ అధ్యక్షుడిగా ఉన్న ఆర్కే పురుషోత్తమ్ రూ.30 లక్షల నిధులను గోల్‌మాల్ చేశారని, వాటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఏ క్రీడా సంఘాల్లోనూ వీరికి గుర్తింపు లేదని, వారు ఆయా పదవుల్లో కొనసాగడానికి అర్హులు కారని, వీరికి స్పోర్ట్సు కోడ్ వర్తించదా అని ప్రశ్నించారు. పురుషోత్తం చెన్నైవాసి అని, ఆధారు కార్డులో అడ్రస్ చిత్తూరు చూపించారని ఆరోపించారు. రాష్ట్ర జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్ మాట్లాడుతూ, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌కు గుర్తింపు ఉన్న క్రీడా సంఘాలతో శాప్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్లు చొరవ తీసుకుని.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలను జరిపించాలని కోరారు. ఏపీవోఏ ప్రక్షాళన కోరుతూ త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కలుస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఏపీవోఏ గుర్తింపు ఎన్నికలను చట్టబద్ధంగా జరిపించాలన్నారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ ఆకుల రాఘవేంద్రరావు, వివిధ సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, గణేశ సుబ్బారావు పాల్గొన్నారు.

ల్యాండ్ మాఫియా చిత్ర ఆడియో రిలీజ్

మొగల్రాజపురం, జూలై 14: సినిమా బాగుంటే చిన్న సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారని ఎన్నోసార్లు ప్రేక్షకులు రుజువు చేశారని అందుకే సినిమా ప్రేమికులైన నగర ప్రజల మధ్య తమ సినిమా ఆడియోను విడుదల చేస్తున్నామని ల్యాండ్ మాఫియా చిత్ర నిర్మాత, హీరో ప్రణయనాథ చెప్పారు. ల్యాండ్ మాఫియా చిత్ర ఆడియో విడుదల ఆదివారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించారు.

నగరం కేంద్రంగా సోషల్‌మీడియాలో రీల్స్ షార్ట్స్ ద్వారా బాగా పాపులర్ అయిన వారే ముఖ్య అతిథులుగా వారి చేతుల మీదుగా పాటలు, ట్రైలర్ విడుదల చేశారు. చిత్ర నిర్మాత, హీరో ప్రణయనాథ హీరోయిన్ లక్ష్మిమధుబాల, దర్శకులు బాబు వీఎస్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ వెంకట్, ఇతర నటులు, పాటల రచయితలు పాల్గొన్నారు. తన చానల్ ద్వారా పాటలకు రికార్డు వ్యూస్ సాధించిన వరంగల్ మహాలక్ష్మికి రూ.10వేలను బహుమతిగా చిత్ర నిర్మాత, హీరో ప్రణయనాథ అందించారు. తొలుత నగరానికి చెందిన యువగాయనీ గాయకులు పద్మశ్రీ, కృష్ణశ్రీ, వీరంజినాయక్ పాటలు పాడి అలరించారు. మస్తాన్, ధను,శిరీష, ప్రదీప్‌చౌదరి, కేవీ రావు, మోహన్, చిన్నారావు, సీతారామరాజు వంటి సోషల్ మీడియా స్టార్స్ ఉన్నారు. యూట్యూబ్‌లో ఫేమస్ అయిన చిన్నారులు సైరాబీ, గౌతమీ తమ నృత్యాలతో అదరగొట్టారు. రోహిణీ యాంకర్‌గా వ్యవహరించారు.



ఆడియో విడుదల చేస్తున్న హీరో కం నిర్మాత ప్రణయ్‌నాథ్, హీరోయిన్ లక్ష్మి మధుబాల, డైరెక్టర్ బాబు విఎస్, సోషల్ మీడియా స్టార్స్

గుండెపోటుతో టీడీపీ నేత అన్నే రామకృష్ణ మృతి

- నేడు గొల్లపూడిలో అంత్యక్రియలు



గొల్లపూడి, జూలై 14: గొల్లపూడికి చెందిన టీడీపీ నేత అన్నే రామకృష్ణ(రాము)(54) గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. శనివారం సాయంత్రం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన అర్ధరాత్రి తుదిశ్వాస విడిశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం గొల్లపూడిలో ఆయన నివాసంలో ఉదయం 11 గంటలకు అంత్య క్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చంద్రబాబు, లోకేశ్ సంతాపం

అన్నే రామకృష్ణ అకాల మరణంపై సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టీడీపీలో కీలకమైన ఓటర్ వెరిఫికేషన్ విభాగంలో సమర్థవంతంగా పనిచేసిన రామకృష్ణను ఓటర్ రామకృష్ణ అని పిలిచేవారని చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. రామకృష్ణ కుటుం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామకృష్ణ మృతి తనను కలచి వేసిందని, టీడీపీ కోసం రామకృష్ణ అహర్నిశలు కష్టపడే వారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామకృష్ణ మరణం బాధాకరం: దేవినేని ఉమా



గొల్లపూడిలో అన్నే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవినేని ఉమా

అన్నే రామకృష్ణ అకాలమరణం బాధాకరమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలోని పార్టీ కార్యాలయంలో రామకృష్ణ చిత్రపటానికి ఉమా పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాజశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ డిపార్టుమెంట్‌లో రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించాలి

- స్టేట్ ఆడిట్ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీధర్

గన్నవరం, జూలై 14: పదేళ్ల నుంచి స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్‌లో రెగ్యులర్ డైరెక్టర్ లేకుండా ఇన్‌చార్జిలతోనే కాలం గడుపుతున్నారని దీని వలన ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావటం లేదని స్టేట్ ఆడిట్ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీధర్ అన్నారు. గన్నవరంలోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించిన స్టేట్ ఆడిట్ ఎన్జీవో సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో కార్యాలయాలు లేకపోవటం, జిల్లాలో ఒకే కార్యాలయం ఉండడంతో జిల్లాలో పనిచేసే ఆడిట్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆడిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 23ఏళ్ల నుంచి సీనియర్ ఆడిటర్లకు ప్రమోషన్లు లేవన్నారు. అదనపు పోస్టులు మంజూరు చేస్తే ఆడిట్‌లో వెరిఫికేషన్ మెరుగుపడుతుందన్నారు. పోస్టులు వస్తే ప్రమోషన్లు వస్తాయన్నారు. బదిలీల్లో ఆన్‌లైన్, కౌన్సెలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఫ్రీ ఆడిట్ విధానాలు రావటంతో ల్యాప్‌ట్యాప్‌లు ఇవ్వాలన్నారు. టీఏ నగదు సకాలంలో రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడిట్ డిపార్టుమెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యక్షుడు సీహెచ్ రామలింగేశ్వరరావు, కార్యదర్శి ఎస్.రాఘవేంద్ర, పి.శ్రీనివాసరావు, సి.అంజయ్యనాయుడు పి.హరికృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి: ఈశ్వరయ్య

ధర్నాచౌక్, జూలై 14: ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రతి విద్యార్థికి రూ.15 వేలివ్వాలని, జీవో 29ని రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర బేరర్స్ సమావేశం స్థానిక దాసరిభవన్‌లో ఆదివారం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఆఫీస్ బేరర్స్ యుగంధర్, కత్తి రవి, వై.బాబీ, ఎంవీ.సుబ్బారావు, జి.నాగరాముడు పాల్గొన్నారు.

బ్రైట్ కెరీర్ గ్రూప్ సీఈవో, మేనేజర్లను అరెస్టు చేయాలి

- బాధితులకు న్యాయం చేయాలి: ఏఐవైఎఫ్

వన్‌టౌన్, జూలై 14: హనుమాన్‌పేటలోని బ్రైట్ కెరీర్ గ్రూప్ సంస్థ సీఈవో విష్ణుచౌదరి, మేనేజర్లు విజయేంద్రసింగ్, ఆకాష్ సింగ్‌లను అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంక గోవిందరాజులు డిమాండ్ చేశారు. హనుమాన్‌పేటలోని దాసరిభవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉద్యోగాలిప్పిస్తాననడంతో నమ్మి డబ్బు చెల్లించి మోసపోయిన బాధితుల వాయిస్‌కాల్‌ను విలేకరుల సమావేశంలో ఆయన వినిపించారు. యూఏఈ, కాంగో, సౌదీ, ఖతర్, వెస్ట్‌ఆఫ్రికాతో పాటు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఒడిస్సా, భువనేశ్వర్, నాగపూర్, పూణే, ముంబాయిలోని బాధితులు కూడా మాట్లాడారు. విష్ణుచౌదరి, విజయేంద్రసింగ్, ఆకాష్‌సింగ్‌లు నెదర్లాండ్‌లోని ఆర్నో ఇంజనీరింగ్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలిప్పిస్తామని నెలకు రూ.2,89,000(3వేల యూరోలు) చొప్పున జీతం ఇప్పిస్తామని చెప్పి 120 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారి నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి మరో 500 మంది వద్ద నుంచి రూ.75వేల చొప్పున వసూలు చేశారన్నారు. ఆరోగ్య పరీక్షలు, దేహ ధారుఢ్య పరీక్షలు పూర్తి చేసుకుని ఉద్యోగాల నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో సంస్థ యాజమాన్యం ఫోన్ స్విచ్చాఫ్ చేసిందని, కార్యాలయాన్ని మూసివేసి నిరుద్యోగులను నట్టేట ముంచిందని ఆరోపించారు. సంస్థ చేసిన మోసం కారణంగా నష్టపోయిన బాధితులకు న్యాయం జరిగేంత వరకు తాము పోరాడతామని, రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తామనని హెచ్చరించారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న సంస్థలపై జిల్లా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం సరికాదన్నారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, డీజీపీలను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. సింగంశెట్టి మోహనప్రసాద్, గాడి అజయ్, హరీష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత ఏమినేని కుటుంబంలో తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో మనవడి దుర్మరణం
- మూడో కుమారుడు, కోడలికి తీవ్రగాయాలు

తోట్లవల్లూరు, జూలై 14: వల్లూరుపాలెం టీడీపీ నేత ఏమినేని వెంకటేశ్వరరావు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం మంగళగిరి బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 16 నెలల ఆయన మనవడు వెంకట్‌సాత్విక్ దుర్మరణం చెందాడు. వెంకటేశ్వరరావు మూడో కుమారుడు గణేష్ ఆదివారం గుంటూరులోని అత్తవారింటికి భార్య శ్రీలక్ష్మి, కుమారుడు వెంకట్‌సాత్విక్‌తో కలిసి సొంత ఆటోలో బయలుదేరాడు. సర్వీస్ రోడ్డు నుంచి ఓ కారు మంగళగిరి బైపాస్ రోడ్డుపైకి వస్తుందని ఆటోను స్లో చేశారు. దీంతో వెనుక నుంచి మరో కారు ఆటోని ఢీకొట్టింది. దీంతో ఆటో సర్వీస్ రోడ్డు నుంచి బైపాస్ రోడ్డుపైకి వచ్చిన కారుపైకి దూసుకెళ్లింది. ఆటోలో తల్లి శ్రీలక్ష్మి ఒడిలో ఉన్న బాలుడు వెంకట్ సాత్విక్ ఎగిరి రోడ్డుపై పడి ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలైన గణేష్, శ్రీలక్ష్మిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటసాత్విక్ మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మృతిచెందిన 16 నెలల బాలుడు వెంకట్ సాత్విక్(ఫైల్)

గన్నవరం-ముంబై విమానం రద్దు

- ప్రయాణికుల ఆందోళన

గన్నవరం, జూలై 14: గన్నవరం నుంచి ముంబై వెళ్లవలసిన ఎయిర్‌ఇండియా విమానం నిలిచిపోయింది. రోజూ ముంబై నుంచి గన్నవరం విమానాశ్రయానికి సాయంత్రం 5.40 గంటలకు వచ్చి రాత్రి 7.20 గంటలకు వెళుతుంది. ఆదివారం ముంబై నుంచి వచ్చిన విమానం తిరిగి వెళ్లే సమయంలో సాంకేతిక సమస్య వచ్చినట్టు పైలెట్ గుర్తించాడు. దీంతో విమానం రద్దుచేసినట్టు అధికారులు తెలిపారు. ముంబైకి 171 మంది ప్రయాణికులు వెళ్లాల్సి ఉండగా వారిలో చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఉన్నారు. విమానం రద్దు కావడంపై ప్రయాణికులు ఆందోళన చేశారు. తాము ముంబై నుంచి వివిధ దేశాలకు వెళ్లాల్సి ఉందని, మా పరిస్థితి ఏంటని ఎయిర్ ఇండియా సిబ్బందిని నిలదీశారు. కొద్దిసేపు విమానాశ్రయంలో గందరగోళం నెలకొంది. కొందరు కార్లలో హైద రాబాద్ వెళ్లి అక్కడ నుంచి ప్రత్యామ్నాయ విమానంలో ముంబై వెళ్లేందుకు బయలుదేరారు. ముంబై విమానం రద్దుకావడంతో ప్రయాణికులు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వచ్చింది.



సీపీ రాజశేఖర్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

సీపీకి శుభాకాంక్షలు

కృష్ణలంక, జూలై 14: నూతన పోలీసు కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్.వి.రాజశేఖర్ బాబును ఆదివారం ఆయన కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనరేట్‌లో సీపీ తనిఖీలు

విజయవాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్వీ రాజశేఖర్‌బాబు కమిషనరేట్‌లోని వివిధ విభాగాలను ఆదివారం పరిశీలించారు. స్పెషల్‌బ్రాంచ్, పాస్‌పోర్ట్ వింగ్, సిటీ క్రైమ్ రికార్డుబ్యూరో, సైబర్ సెల్, ఐటీ కోర్ వింగ్, ఫింగర్ ప్రింట్ యూనిట్‌తోపాటు పరిపాలనా విభాగాన్ని పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అయన వెంట డీసీపీ చక్రవర్తి, ఏసీపీలు ప్రసాద్, పార్థసారథి ఉన్నారు.

కమిషనరేట్‌కు కృష్ణలంక ఇన్‌స్పెక్టర్

కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఆకుల మురళీకృష్ణను కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశించారు. ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీటీఎన్ఎస్‌ను ఓపెన్ చేయలేకపోవడం, ఎస్‌హెచ్‌వో రోల్ గురించి ఇన్‌స్పెక్టర్ చెప్పలేకపోయారు. ఇన్వెస్టిగేషన్‌లో ట్రాకర్‌లో మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన వివరాలు, సీసీ కెమెరాల వివరాలు చెప్పలేకపోవడంతో కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని సీపీ ఆదేశించారు.

ఇంపికాప్ ఆధ్వర్యంలో ఆయుర్వేదంపై వర్క్‌షాప్

ధర్నాచౌక్, జూలై 14: దేశంలోని ప్రసిద్ధ క్వాలిఫైడ్ ఆయుర్వేద వైద్యులు తమ ప్రాక్టీస్‌లో అనుభవాలు, ఆయుర్వేద చికిత్సల విశేషాలను ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులతో పంచుకునేందుకు 'ఆయుర్వేద సద్వైద్య సంభాష పరిషద్‌ను నిర్వహిస్తున్నతిట్లు ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ (ఇంపికాప్స్) డైరెక్టర్ వేముల భాను ప్రకాష్ తెలిపారు. నగరంలోని ఇంపికాప్స్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య పరిజ్ఞానాన్ని నవీకరించడం, ఆధునాతన జ్ఞానం, నైపుణ్యం పొందడం, చికిత్సలో కలిగే సందేహాలను నివృత్తి చేయాలనే ఉద్దేశంతో ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పమ్మి సత్యనారాయణ శాస్త్రి ఆయుర్వేద చికిత్స విధానాలను వివరించారు. డాక్టర్ పమ్మి సూర్య కుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ జాబిల్లీ, ప్రముఖ బొటనిస్ట్ వేణుగోపాల్, స్నిగ్ధ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కేఎస్.ఆర్.గోపాలన్, డాక్టర్ చైతన్య, రాష్ట్ర వ్యాప్తంగా ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

ఘనంగా ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

భవానీపురం, జూలై 14: ఊర్మిళానగర్ గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్లు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఆదివారం తెల్లవారుజామున ముత్తైదువులు, యువతులు మంగళవాయిద్యాల నడుమ కృష్ణానది జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరి పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి, ప్రధాన అర్చకులు గంటి సన్యాసిరావులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో విద్యుత్ అలంకరణల నడుమ ఊరేగించి ఆలయంలో ప్రవేశపెట్టారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేశ్

వన్‌టౌన్, జూలై 14: నగరంలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన చెత్తాచెదారాల తొలగింపు, వర్షపు నీరు సజావుగా పారేందుకు తీసుకుంటున్న చర్యలపై వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ మహేష్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్-3 పరిధిలోని 16వ డివిజన్‌లో పోలీస్ కాలనీ రిటైనింగ్ వాల్ ఏరియా, సర్కిల్-2 పరిధిలోని 33వ డివిజన్ సత్యనారాయణపురం, సర్కిల్-1 పరిధిలోని నైజాంగేట్, వన్‌టౌన్ ఏరియా, కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ఏరియా, పంజాసెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్ సమీపంలో నిల్వ ఉన్న వర్షపునీటిని తక్షణమే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలిచ్చారు. సత్యనారాయణపురం, ఆంధ్రరత్న మునిసిపల్ పార్క్ వద్ద పారిశుధ్య పనులు సరిగ్గా లేకపోవడంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని మందలించారు. తక్షణమే శుభ్రపరచాలని ఆదేశించారు. 33వ డివిజన్‌లో వర్షం ఎప్పుడూ పడినా సరే సమాచారం సేకరించి చర్యలు తీసుకోవాలని, అలాగే సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్-1 పరిధిలో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పలు చోట్ల డంపర్‌బిన్లలో వ్యర్థాలు నిండిపోవడాన్ని చూసి అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లను ఫీల్డ్ స్టాఫ్‌ను వెంటనే అప్రమత్తం చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండకూడదని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ మహేశ్

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి: కార్పొరేటర్

వర్షాల కారణంగా కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయ సత్యబాబు అన్నారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కొండ ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న రిటైనింగ్ వాల్, ఇబ్బందికరంగా ఉన్న చెట్లు, లూజుగా ఉన్న కొండ రాళ్ల వంటివి ప్రజల నివాసాలకు ఇబ్బందికరంగా మారాయని మునిసిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆలేటి వారి వీధి కొండ ప్రాంతంలో విద్యుత్ తీగలపై చెట్లు పడిన సంగతి స్థానికుల నుంచి తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే సంబంధిత విద్యుత్ ఏఈకి ఫోన్‌చేసి విషయం తెలిపారు. వెంటనే విద్యుత్ సరఫరాను బంద్ చేసి తీగలను సవరించారు.


కొండ ప్రాంతాలను పరిశీలిస్తున్న సత్యబాబు





వాణీ స్కూల్, రాకేశ్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గవర్నర్‌పేట, జూలై 14: కార్మికపురం వాణీ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రాంగణంలో ఆదివారం స్కూల్ పూర్వ విద్యార్థుల (2003-2004) సమ్మేళనం జరిగింది. ఉద్యోగ, వ్యాపారం నిమిత్తం దేశ, విదేశాల్లో స్థిరపడిన స్కూల్ పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి తమ హోదాలను మరిచి ఆప్యాయంగా ఒకరినొకరు పేర్లతో పిలుచుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. స్కూల్ డేస్‌ను గుర్తు చేసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఏ శేషుబాబును ఘనంగా సత్కరించారు.

రాకేశ్ స్కూల్‌లో ..

వన్‌టౌన్: కేఎల్ రావు నగర్‌లోని రాకేశ్ స్కూల్‌లో ఆదివారం 1999-2000 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సాగింది. వీరంతా వివిధ ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంతోషాలను పంచుకున్నారు. స్కూల్ నిర్వాహకులు ఎన్‌వీ రావు దంపతులను సముచిత రీతిలో సత్కరించారు.

ఏసీ మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి ఒకరి మృతి

కృష్ణలంక/వన్‌టౌన్, జూలై 14: కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమినగర్ 4వ రోడ్డులోని ఓ ఇంట అనుకోని విషాదం చోటు చేసుకుంది. ఏసీ రిపేర్ ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. 4వ లైన్‌లో నివాసం ఉంటున్న మాదంశెట్టి శివకుమార్ (58) తన ఇంట్లో ఏసీ రిపేర్ రావడంతో మెకానిక్ ఎండీ బేగ్ అతడి సన్నిహితులైన యాకోబు, వెంకట శ్రీనివాసరావు, ముని అతడి ఇంటికి చేరుకున్నారు. ఏసీని పరిశీలించి నీరు దిగుతుండడంతో రూఫ్ టాప్‌లో నీరు నిలువ ఉందని గమనించి పైకి వెళ్లారు. ఈ సమయంలో అందరూ కలిసి మరమ్మతు పనులు చేస్తుండగా అల్యూమినియం నిచ్చెనను శివకుమార్ లాగుతున్న సమయంలో ఇంటి ముందున్న కరెంట్ లైన్లకు నిచ్చెన తగిలింది. దీంతో శివకుమార్‌కు కరెంట్ షాక్ తగిలి రెండు అరచేతులకు గాయాలయ్యాయి. మునికి కూడా గాయాలుగా చుట్టుపక్కలవారు 108 అంబులెన్స్‌ను పిలిపించారు. వారు వచ్చి శివకుమార్‌ను పరీక్షించి చనిపోయినట్టు తెలిపారు. శివకుమార్ మేనల్లుడు కొక్కిల కిరణ్‌కుమార్‌కు తెలియపరచగా ఆయన వచ్చి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన శివ కుమార్

డాక్టర్లు సమ్మె విరమించుకోవాలి
● డీఎంఈ డాక్టర్ నరసింహం

వన్‌టౌన్: జీజీహెచ్ డాక్టర్లు సమ్మె విరమించుకోవాలని వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ నరసింహం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జీజీహెచ్‌లో ఒక రోగి చనిపోవడంతో చికిత్స పొందుతున్నపుడు అతడి సహాయకులుగా వచ్చిన కొందరు జూనియర్ డాక్టర్లపై దాడికి దిగారు. దీంతో ఆగ్రహించిన జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలను మినహాయించి మిగతా సేవలను బంద్ చేసి సమ్మెకు దిగారు. దీనిపై స్పందించిన డీఎంఈ వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. జూనియర్ డాక్టర్ల ప్రతినిధులతో మాట్లాడారు. వారి డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. సెక్యూరిటీ పటిష్టత గురించి స్పష్టమైన హామీ ఇచ్చారు. డ్యూటీ రూమ్‌లో అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ఈక్రమంలో దాడికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించాలని కోరారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

వన్‌టౌన్: సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్మైహోమ్ అపార్ట్‌మెంట్‌లో భారీగా నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్టు బాధితులు ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి విచారణ జరిపారు. అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ఒక ఫ్లాట్‌లో భార్యాభర్తలు, కుమార్తె, కుమారుడితో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. ఇంట్లో సుమారు 27 కాసులు బంగారం, నగదు చోరీకి గురైనట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ దుర్గారావు ఆదేశాలతో సిబ్బంది సంఘటన జరిగిన అపార్ట్‌మెంట్‌కు వెళ్లి సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచారు. ఈ విషయమై సీఐని ఫోన్‌లో సంప్రదించగా దొంగతనం జరగలేదని, కావాలని కొంతమంది ప్రచారం చేస్తున్నారన్నారు. అపార్ట్‌మెంట్ వాసులు మాత్రం దొంగతనం జరిగిందంటున్నారు. 6 నెలలుగా ఇక్కడే 3 బైకులు చోరీకి గురయ్యాయని చెబుతున్నారు.

21న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సత్యనారాయణపురం: అమరావతి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.వి.గురునాథ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఆదివారం సత్యనారాయణపురం సీతారామకల్యాణమండపంలో బ్రాహ్మణ వివాహపరిచయ వేదిక నిర్వహిస్తున్నామని వివాహం కానివారు, పునర్వివాహం చేసుకొనేవారు 18 లోపు కన్వీనర్ యడ్లపాటి శిరీషను కానీ 8374852222, 8886216226 నంబర్లలో కానీ సంప్రదించాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పటమట: ఇండియన్ ఎడ్వర్టైజింగ్ సర్వీసెస్ కంపెనీ పేదలకు సేవా కార్యక్రమాలను చేయడం ముదావహమని టీడీపీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ బాషా అన్నారు. ఊర్మిళానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సంస్థ సభ్యుల సమావేశంలో భాగంగా 50 మంది పేదలకు దుప్పట్లను ఆయన పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖాదర్ మాట్లాడుతూ నిరుద్యోగులు, ఉపాధి కోసం ఎదురు చూసే యువతకు ఐఏఎస్ సంస్థలో మంచి ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. సంస్థ ప్రతినిధులు కరుబోతు సూరి, కరుబోతు అప్పల చిన్న, కాళ్ల అప్పల నర్సి కాళ్ల వీరబాబు పాల్గొన్నారు.


నాగరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే గద్దె

కార్యకర్తల కుటుంబాలకు
అండగా ఉంటాం: ఎమ్మెల్యే గద్దె

గుణదల, జూలై 14: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషిచేసిన ప్రతి కార్యకర్తను తాము వదులుకోమని వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గుణదల హరిజనవాడలో నివాసముంటున్న టీడీపీ కార్యకర్త తుళ్లూరి నాగరాజు పెద్ద కర్మ ఆదివారం గుణదల్లోని వారి ఇంటి వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి గద్దె రామ్మోహన్ హాజరై నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించి పార్టీ తరపున అండగా నిలుస్తానని, నాగరాజు ఇద్దరి పిల్లల్ని మంచి స్కూల్లో చేర్పించి చదివించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ముస్లిం ఐక్యవేదిక నేతలు

ముస్లిం విద్యకు, సంక్షేమానికి
ప్రభుత్వం అండగా ఉండాలి
● ఐక్యవేదిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ ఆలీ

భవానీపురం, జూలై 14: ముస్లిం సమాజం గడిచిన 70ఏళ్ల నుంచి వెనుకబాటుతనంలో ఉందని, అందుకు తమ సమాజం సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ముస్లింల విద్య, సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ ఆలీ, అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర సమన్వయకర్త అహ్మద్ చందన్ కోరారు. త్వరలో తమ సమస్యలపై చంద్రబాబును కలవాలని, ఇతర అంశాలపై చర్చించామన్నారు. భవానీపురంలోని ఐరన్‌యార్డు సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా జాఫర్ ఆలీ మాట్లాడుతూ ముస్లిం సమస్యల పరిష్కారం కోసం తమ ఐక్యవేదిక అండగా ఉంటుందన్నారు. ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ నూర్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, నగరాధ్యక్షుడు రహీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

చెస్ ఫిడే రేటింగ్ విజేత కేశవన్

విజయవాడ స్పోర్ట్స్, జూలై 14: కానూరులో 3 రోజులుగా జరుగుతున్న 4 దేశాల అంతర్జాతీయ రెండో ఫిడే రేటింగ్ చెస్ విజేతగా తమిళనాడుకు ప్లేయర్ కేశవన్ నిలిచాడు. 9రౌండ్ల పోరులో 8.5 పాయింట్లతో రూ.లక్ష నగదు, ట్రోఫీని అందుకున్నాడు. రెండో స్థానంలో లుకేష్, మూడోస్థానంలో దివిత్‌రెడ్డి నిలిచారు. తొలి 6 రౌండ్లలో 6 పాయింట్లతో ముందంజలో ఉన్న నిశ్చల్ (విజయవాడ) 4వ స్థానంలో నిలిచాడు. విజేతల బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఎస్కే ఖాసీమ్, విశిష్ట అతిథిగా రాజేంద్రప్రసాద్ హాజరై అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.5లక్షల ప్రైజ్‌మనీతో నగరంలో భారీటోర్నీ నిర్వహించిన టోర్నీ డైరెక్టర్, స్పార్క్ చెస్ అకాడమీ తాళ్ల నరేష్ అభినందించారు. ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ సహకారం మరువలేనని నరేష్ తెలిపారు. టోర్నీ చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.


ఉపేంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లలిత, కిషోర్

నిబద్ధతగల రాజకీయ నేత ఉపేంద్ర
● కార్పొరేటర్ వీరమాచినేని లలిత

సత్యనారాయణపురం, జూలై 14: దివంగత మాజీ కేంద్రమంత్రి పర్వతనేని ఉపేంద్ర నిబద్ధత కలిగిన రాజకీయనేత అని 28వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ వీరమాచినేనలి లలిత అన్నారు. వీరమాచినేని కిషోర్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్‌రోడ్డు ఫుడ్ జంక్షన్‌లో ఉన్న ఉపేంద్ర విగ్రహం వద్ద ఆయన 88వ జయంతి వేడుకలు ఆదివారం జరిగాయి. ఉపేంద్ర కుమారులు వివేక్, కుమార్తె లగడపాటి లలిత, కార్పొరేటర్ వీరమాచినేని లలిత పాల్గొని ఉపేంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీరమాచినేని లలిత మాట్లాడుతూ ఉపేంద్ర స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. చివరివరకూ పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. వీరమానేని కిషోర్, ద్వారక, ముక్తియార్, శివగంగ పాల్గొన్నారు.


కొండపైకి ఏర్పాటు చేసిన ఉచిత బస్సులలో భక్తుల ప్రయాణం

ఘాట్‌రోడ్డులో వాహనాల నియంత్రణ

వన్‌టౌన్, జూలై 14: జోరుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఘాట్ రోడ్డులోని కొండచరియలు విరిగిపడే అవకాశం ఉండడంతో దేవస్థానం అధికారులు వాహనాలను నియంత్రించారు. రెండ్రోజులుగా ఘాట్‌రోడ్డు పైకి వాహనాలను అనుమతించకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే అనుమతించడంతో భక్తజనం కొండపైకి వెళ్లేందుకు ఇబ్బందులు పడిన తీరును గమనించి అధికారులు ఆదివారం 6 బస్సులను ఉచితంగా నడిపారు. దుర్గాఘాట్ వద్ద 2 బస్సులు, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద దేవస్థానం పార్కింగ్ నుంచి 2 బస్సులు, పున్నమిఘాట్ నుంచి మరో 2 బస్సులను ఉచితంగా నడిపారు. ఈ బస్సుల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రయాణించి కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.


ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న అభ్యర్థులు

మెయిన్స్‌కైనా అనుమతించండి

వన్‌టౌన్, జూలై 14: డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల పోస్టుల ఎంపికకు ప్రిలిమ్స్ పరీక్ష రాసిన టీచర్లు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు ఆదివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేయించాలని కోరారు. తమందరిని మెయిన్స్‌కు అనుమతించాలని లేదంటే కటాఫ్ మార్కులను 25కు తగ్గించాలని కోరారు. లక్ష్మణరావును కలిసిన వారిలో జే సుధానంద్, ఈ లక్ష్మణుడు, బి.కృష్ణ, ఎస్కే జానీ, డి.అనురాధ, షకీల, సదారత్ ఉన్నారు.

5వ ఆర్థిక సంఘాన్ని ప్రక్షాళన చేయండి
● సీఎం చంద్రబాబునాయుడుకు జాస్తి వీరాంజనేయులు వినతి


చంద్రబాబుకు రుద్రాక్షలు, ప్రసాదం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

వన్‌టౌన్, జూలై 14: రాష్ట్రంలో సరిగా పని చేయని 5వ ఆర్థిక సంఘాన్ని ప్రక్షాళన చేయాలని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబును కలిసి అఖిలభారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు విన్నవించారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు పరిషత్తు ఉపాధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రితో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపి నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయం నుంచి తెచ్చిన రుద్రాక్షలు, ప్రసాదాన్ని అందచేశారు. అనంతరం ఆయన 15వ ఆర్థిక సంఘాన్ని ప్రక్షాళన చేయకపోతే కేంద్రం నుంచి వచ్చే నిధులు వచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు.

ఆదివాసీలపై ప్రభుత్వ చర్యలు గర్హనీయం

ధర్నాచౌక్: ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేయడం లేదా చంపడం ద్వారా దేశంలోని ఆటవీ ఖనిజ సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టే ప్రభుత్వ చర్యలు గర్హనీయమని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక పేర్కొంది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ఆదివాసీ హక్కుల పరిరక్షణ సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో చత్తీస్‌ఘడ్, ఒడిశా ఆదివాసీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఏపీలో ఆదివాసీల పరిరక్షణకు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదికను ఏర్పాటు చేశారు. ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను కోస్తాజిల్లాల్లోని మేథావి వర్గం, సామాన్య ప్రజలకు వివరించాలని సమావేశంలో తీర్మానించారు. వేదిక కన్వీనర్ చిలక చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగర్‌ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు భరద్వాజ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తమ మద్దతును తెలిపారు. ఏపీసీఎల్సీ నేత చిట్టిబాబు, న్యాయవాది అంజనేయులు, కాంతి, కొండారెడ్డి పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతవైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాదారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్' (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన


- 'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),
- 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),
- 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూత న చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ



భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023

జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

దిశలు - దూరాలు

● రీజనింగ్

పార్ట్-2

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం


ముఖ్యరేఖాచిత్రం

1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమర సి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.





డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచినప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరోసారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్కం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్కం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మాంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



తెరుచుకున్న జగన్నాథుడి రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్క పెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్క పెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గదిలోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ ఛైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, అర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి

తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.

నవ్య

కుటుంబ కదంబం

సాధికారత



అందరిలానే ఎన్నో కలలు కన్నారు... డాక్టర్ కావాలని! ప్రయత్నం ఫలించలేదు. కానీ నిరాశతో కుంగిపోలేదు. భర్తతో కలిసి సొంత కంపెనీ బాధ్యతలు పంచుకున్నారు. లక్ష రూపాయలతో మొదలైన సంస్థను 28 కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లి... కంపెనీకి ఆమే ఒక 'వర'మయ్యారు. 'గ్రీన్‌టెక్ ఇండియా లిమిటెడ్' డైరెక్టర్ **వరలక్ష్మి గన్నారపు**... తన పాతికేళ్ల పారిశ్రామిక ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

ఆమే ఒక 'వర'ం

"పెళ్లి తరువాత చాలామంది అమ్మాయిల కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పడిపోతుంది. కానీ పారిశ్రామికవేత్తగా నా జీవితం మొదలైంది పెళ్లి తరువాతే. అందుకు ప్రధాన కారణం... మావారు సత్యకిరణ్ గన్నారపు, ఇతర కుటుంబ సభ్యుల ప్రోత్సాహం. 1995లో మావారు 'గ్రీన్‌టెక్' సౌర విద్యుత్ ఉపకరణాల సంస్థను ప్రారంభించారు. అంతకముందు ఆయన సోలార్ వాటర్ హీటర్లు విక్రయించేవారు. ఈ రంగంలో ఆయనకు ఆసక్తి ఎక్కువ. అందుకే మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన ఆయన ఇటువైపు వచ్చారు. 1999లో మా పెళ్లయింది. మూడు నాలుగేళ్ల తరువాత నేను కూడా కంపెనీ కార్యకలాపాల్లో భాగస్వామినయ్యాను. నేను వెళ్లింది మావారికి కాస్త సాయంగా ఉందామని. కానీ నాటి నుంచి పాతికేళ్లుగా కంపెనీతో మమేకమైపోయాను. నేను పుట్టి పెరిగిందంతా కామారెడ్డిలో. అత్తవారిది హైదరాబాద్.

గృహిణిగానే ఉండాలనుకోలేదు...

చిన్నప్పటి నుంచి నా లక్ష్యం డాక్టర్ కావాలని. మా సోదరుడు ఒకాయన డాక్టర్. ఆయన స్ఫూర్తితో మెడిసిన్ చదవాలనుకున్నా. అందుకే ఇంటర్‌లో సైన్స్ గ్రూప్ తీసుకున్నా. మెడిసిన్‌లో సీటు కోసం కష్టపడ్డాను. రాలేదు. అలాగని కుంగిపోలేదు. 1997లో బీజడ్‌సీ పూర్తయ్యాక డిప్లమా ఇన్ ఫార్మసీ చదివాను. రెండేళ్లు మెడికల్ ట్రాన్‌స్క్రిప్షన్ ప్రయత్నించాను. ఒక గృహిణిగా మిగిలిపోవాలని ఎన్నడూ అనుకోలేదు. నాకంటూ ఒక కెరీర్‌ను నిర్మించుకోవాలని అనుకున్నా. పెళ్లి తరువాత మా కంపెనీ బాధ్యతలు చేపట్టినా... మధ్యలో ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కూడా చేశాను.

మార్కెటింగ్ నేనే...

లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభమైన మా కంపెనీ 2007లో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారింది. ఆరంభంలో బెంగళూరు నుంచి వాటర్ హీటర్లు తెచ్చి విక్రయించేవాళ్లం. క్రమంగా వాటి తయారీ మొదలుపెట్టాం. ఒక్కో ఉత్పత్తి పెంచుకొంటూ పోయాం. ప్రస్తుతం సోలార్ ప్యానల్స్‌తో పాటు ఇతర ఉపకరణాలు కూడా తయారు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఇళ్లు, కంపెనీలు, కమర్షియల్ బిల్డింగ్స్‌కు సోలార్ పవర్ ప్రాజెక్ట్స్ చేపడుతున్నాం. చిన్న యూనిట్‌గా ఆరంభమైన మా కంపెనీకి ఇప్పుడు ఢిల్లీ, పుణే, చెన్నైల్లో బ్రాంచీలు ఉన్నాయి. ప్రొడక్షన్, ఎరక్షన్, కమిషనింగ్... ఇదీ మా పని. మా ఫ్యాక్టరీ తూప్రాన్‌లో ఉంది. కంపెనీలోకి వచ్చాక మొదట్లో అడ్మినిస్ట్రేషన్ చూసుకొనేదాన్ని. కొన్నేళ్ల నుంచి మార్కెటింగ్ బాధ్యతలు తీసుకున్నాను.

టాప్-50లో చూడాలి...

దేశంలోని సౌర విద్యుత్ రంగంలో కనీసం 20 శాతం మార్కెట్ షేర్ సాధించాలనేది నా లక్ష్యం. భారత్‌లోని టాప్-50 కంపెనీల్లో మా 'గ్రీన్‌టెక్'ను చూడాలి. ఒక విజయవంతమైన మహిళగా నా పేరు అందరికీ పరిచయం కావాలి. నన్ను చూసి మరికొంతమంది మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలి. బిజినెస్‌లోకి రావాలనుకొనే అమ్మాయిలకు నేను చెప్పేది ఒక్కటే... ఎంచుకున్న రంగంపై ఆసక్తి, కొత్తగా ప్రయత్నించాలన్న కుతూహలం, చేయగలనన్న నమ్మకం ఉండాలి. ఒకవేళ అనుకున్నది చేయలేకపోతే ఎందుకు చేయలేకపోయానని బేరీజు వేసుకోగలగాలి. కామారెడ్డి నుంచి నగరానికి వచ్చినప్పుడు నాకు తెలుగు తప్ప మరేదీ రాదు. డిగ్రీ కూడా తెలుగు మీడియంలోనే చదివా. వ్యాపారంలోకి వెళ్లాక కూడా చెక్, ఇన్వాయిస్, క్రెడిట్, డెబిట్ పర్చేజ్ లాంటివి ఏవీ తెలియదు. నేర్చుకోవాలన్న తపన, సాధించాలన్న పట్టుదల, సడలని ఆత్మవిశ్వాసమే నన్ను నడిపిస్తున్నాయి.

అంత సులువు కాదు...

ప్రస్తుతం 'గ్రీన్‌టెక్'లో వంద మందికి పైగా పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ మొదలు ఇంజనీరింగ్, మార్కెటింగ్ వరకు అన్నిచోట్లా మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మా అందరి సమష్టి కృషితో మొన్న ఏప్రిల్‌కు మా కంపెనీ టర్నోవర్ 28 కోట్లు దాటింది. దీనికి బ్యాకప్‌గా వేరే కంపెనీలు కూడా పెట్టాం. వాటి కార్యకలాపాలు కూడా నేనే చూసుకొంటున్నాను. సోలార్ పవర్ ఉత్పత్తులకు సంబంధించి మార్కెటింగ్ అంత సులువు కాదు. ఇది ఒక భిన్నమైన రంగం. దానిపై ముందు కస్టమర్లకు అవగాహన కల్పించాలి. ఆపై మా ఉత్పత్తులు, సేవల పట్ల నమ్మకం కలిగించాలి. మార్కెట్‌లో పోటీని తట్టుకోగలిగితేనే నిలబడగలం.

అదే పెద్ద సవాలు...

ఒక మహిళా పారిశ్రామికవేత్తగా నిత్యం ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఇంటి పనులు, పిల్లలు, అత్తమామలు... ఇలా రకరకాల బాధ్యతలు. అన్నిటినీ చక్కబెట్టి, బయటకు వెళ్లి కంపెనీ వ్యవహారాలు చూసుకోవాలి. ఒక్కోసారి బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో వేడుకలు జరుగుతుంటాయి. అదే సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు దేనికి ప్రాధాన్యం ఇవ్వాలనేది నిర్ణయించుకోవడం చాలా కష్టం. అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగడం పెద్ద సవాలు. అయితే దేన్నయినా సరే సవాలుగా తీసుకొని పని చేయడం నాకు ఇష్టం. కష్టపడే తత్వంతో పాటు మా కుటుంబం, ఆ భగవంతుడి కృపవల్ల అన్నిటినీ సమన్వయం చేసుకోగలుగుతున్నా. ఎప్పుడైనా నిరుత్సాహానికి లోనైనప్పుడు మా గురువు ప్రేమ్‌రావత్ బోధనలు వింటాను. వెంటనే మనసు కుదుట పడుతుంది.

ఇవే నా బలం...

కుటుంబం, ఆరోగ్యం... ఇవే నా బలం. 48 ఏళ్ల వయసులోనూ ఇంత చలాకీగా ఉన్నానంటే అందుకు క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలే కారణం. మాకు ఒక అబ్బాయి. ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పుడు నన్ను చూసి మా అన్నయ్యలు, వదినలు 'వరలక్ష్మి... నువ్వు ఎంతో సాధించావు' అంటూ గర్వపడుతున్నారు. నేను కోరుకున్నది ఇలాంటి విజయాన్నే."

● హనుమా

కళతో వికాసం

"కళకు వివక్ష ఉండకూడదు. కులం, మతం, ప్రాంతం లాంటివే కాదు... వైకల్యాలు ఉన్నవారికీ కళా శిక్షణ ద్వారా వికాసాన్ని పొందే అవకాశం అందించాలి" అంటారు విశాఖ వర్మ. దుబాయ్‌లో డ్యాన్స్ అకాడమీ ఏర్పాటు చేసి... పదిహేడేళ్లుగా ఆటిజంలాంటి సమస్యలున్న వందలమంది పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఇతర దేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి... వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు.



"నేను పుట్టింది, పెరిగింది ఢిల్లీలో. అమ్మ స్కూల్ టీచర్ నాన్న నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి)లో పని చేసేవారు. మా అమ్మకు డ్యాన్స్ అంటే ఆసక్తి. నన్ను మంచి డ్యాన్సర్‌గా తీర్చిదిద్దాలనుకుంది. నాకూ ఇష్టమే కాబట్టి... ఏడేళ్ళ వయసు నుంచి కథక్ నేర్చుకోవడం ప్రారంభించాను. ఆ తరువాత కొన్ని ప్రదర్శనలు కూడా ఇచ్చాను. తీరిక సమయాల్లో కొందరు పిల్లలకు డ్యాన్స్ నేర్పాను. డ్యాన్సర్‌గా కెరీర్ ఎంచుకోవాలనేది నా కోరిక. కానీ కళలనేవి హాబీగా మాత్రమే ఉండాలనేది మా వాళ్ళ అభిప్రాయం. దాంతో నా కోరికను వదులుకొని, సివిల్ ఇంజనీరింగ్ చేశాను. ఆ తరువాత ఉద్యోగంలో చేరాను. కొన్నాళ్ళకు... వివాహమయ్యాక... నా భర్త ఉద్యోగరీత్యా దుబాయ్ వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ జరిగిన ఒక సంఘటన మళ్ళీ నన్ను నృత్య ప్రపంచంవైపు తీసుకువచ్చింది.

'ఏం ప్రయోజనం' అన్నారు...

నాకు పరిచయం ఉన్న ఒక మహిళ దుబాయ్‌లోని ఒక పాఠశాలలో ఒక కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారు. అక్కడ.. సెరెబ్రల్ పాల్సీ, ఆటిజం లాంటి సమస్యలున్న పిల్లలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కానీ వారు నేపథ్యంలో వస్తున్న సంగీతాన్ని వింటున్నట్టు కానీ, సరిగ్గా స్పందిస్తున్నట్టు కానీ నాకు కనిపించలేదు. శరీరాన్ని కదిలించడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. 'ఆ పిల్లలకు సరైన రీతిలో నాట్యం ఎందుకు నేర్పకూడదు?' అనిపించింది. అదే విషయం నన్ను ఆహ్వానించిన వ్యక్తిని అడిగాను. వాళ్ళకు ఉన్న సమస్యలను ఆమె వివరిస్తూ... "వారిలో బెరుకు పోయి, నలుగురి ముందుకూ రావాలనే ఆలోచనతోనే వారిని స్టేజి మీదకు తీసుకువచ్చాం. అంతేతప్ప వాళ్ళ ప్రతిభను ప్రదర్శించడానికి కాదు.



వాళ్ళకు నాట్యం ఎందుకు నేర్పకూడదని మీరంటున్నారు. మీరు ఉచితంగా నేర్పుతారా?" అని అడిగారు. "నేర్పుతాను" అని వెంటనే చెప్పాను. నా భర్త కూడా నా ఆలోచనకు మద్దతు ఇచ్చారు. ముందుగా.. ఆటిజం లాంటి సమస్యలున్న పిల్లల గురించి నిపుణులు, పుస్తకాల ద్వారా తెలుసుకున్నాను. డ్యాన్స్ మూవ్‌మెంట్ థెరపీలో రెండేళ్ళ శిక్షణ తీసుకున్నాను. మానసిక వైద్యులతో మాట్లాడాను. 2007లో... దుబాయ్‌లో 'విశాఖ డ్యాన్స్ అకాడమీ'ని ప్రారంభించాను. అయితే తల్లితండ్రుల్ని ఒప్పించడం కష్టమయింది. "వాళ్ళ పరిస్థితి చూశారు కదా! ఇంకా కష్టపెట్టడం ఎందుకు? డ్యాన్స్ వల్ల ఏం ప్రయోజనం?" అని ప్రశ్నించారు. "నృత్యమంటే మాటలు లేకుండా భావాన్ని వ్యక్తీకరించే ఒక విధానం. ఈ పిల్లలు మాట్లాడలేరు. కానీ, నేను నేర్పాలనుకొనేది వాళ్ళు అర్థం చేసుకోగలరు" అని చెప్పాను. మొదట ఒక తొమ్మిదేళ్ళ అమ్మాయి చేరింది. తనను చూసి మరికొందరు... అలా విద్యార్థుల సంఖ్య పెరిగింది.

ఎడిహెచ్‌డి, ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, రెట్ సిండ్రోమ్... ఇలా పలు సమస్యలున్న పిల్లలను చేర్చుకున్నాను. అయితే మా అకాడమీని వారికే పరిమితం చెయ్యలేదు. సాధారణ పిల్లలకు కూడా శిక్షణ ఇస్తున్నా.

వారే నా గురువులు...

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నృత్యం నేర్పడం ఒక సవాల్ అయితే... వారికి మనం చేరువకావడం, వారికోసం మనం ఉన్నామనే నమ్మకం కలిగించడం మరో సవాల్. డ్యాన్స్ థెరపీ అంటే మానసిక స్పందనలకు శారీరకమైన కదలికలను అనుసంధానించడం. పిల్లల్లో శారీరకమైన లాఘవాన్ని పెంచడానికి దోహదపడుతుంది. వారిలో ఆత్రుతను, ఒత్తిడిని తగ్గిస్తుంది. వివిధ వైకల్యాలున్న 300మందికి పైగా పిల్లలకు ఇప్పటివరకూ శిక్షణ ఇచ్చాను. పలు దేశాల్లో ప్రదర్శనలు ఇప్పించాను. వారి నైపుణ్యం, భావవ్యక్తీకరణ సామర్థ్యంలో పెరుగుదల, ఆత్మవిశ్వాసం... చూసి నాకు ఎంతో గర్వంగా అనిపిస్తోంది. నేను చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిన భారత ప్రభుత్వం... 2021లో 'గ్లోబల్ డిజేబిలిటీ ఎంపవర్‌మెంట్ అవార్డు'తో నన్ను సత్కరించింది. ఇక మా పిల్లలతో నేను చేసిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొంది, మాకు ఎంతో పేరు తెస్తున్నాయి. కళలకు ఎలాంటి వివక్షా ఉండకూడదనేది నా తపన. వైకల్యాలున్న పిల్లల్లో డ్యాన్స్ థెరపీ అద్భుతాలు చేస్తుందనేది ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోంది. నా దగ్గర శిక్షణ పొందిన పిల్లల్లో సానుకూలమైన మార్పు ఎంతో సంతోషం కలిగిస్తోంది. వారిని నేను గురువులుగా భావిస్తాను. ఎందుకంటే... సహనంగా, ప్రశాంతంగా ఉండడం, బేషరతుగా ప్రేమ అందించడం... ఎన్నో విషయాలు వారి నుంచి నేర్చుకున్నాను. నా కృషిని కొనసాగించడానికి ప్రేరణ వారి నుంచే నాకు లభిస్తోంది."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. దేఖా తేను (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. చలేయా (జవాన్)
6. ఓ మాహీ (డంకీ)
7. అపనా బనాలే (భేడియా)
8. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
9. నాదానియా (నాదానియా)
10. పెహలే భీ మై (యానిమల్)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

నవ్య | చిత్రజ్యోతి

మండీలో రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్ కోసమే న్యాయపోరాటం చేస్తున్నానని.. అవసరమైతే నిరాహార దీక్షకు కూడా వెనుకాడనని ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ఆదివారం తెలిపారు. శనివారం లావణ్య స్టేట్‌మెంట్‌ను పోలీసులు



రికార్డు చేశారు. తన దగ్గరున్న ఆధారాలను లావణ్య పోలీసులకు అప్పగించింది. దీంతో రాజ్‌తరుణ్‌కు పోలీసులు నోటీసులిచ్చి విచారణకు పిలవనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు విచారణను తప్పించుకునేందుకు రాజ్‌తరుణ్ హిమాచల్‌ప్రదేశ్‌లోని మాల్వీ మల్హోత్రా సొంతూరైన మండీలో తలదాచుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయంలో తనకు న్యాయం జరిగే వరకు పోరాడతానని తెలిపారు. మరిన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తానని తెలిపారు.

అంచనాలకు మించేలా



అభిషేక్ పచ్చిపాల, నజియా ఖాన్, వినీశా జ్ఞానేశ్వర్ తెరకెక్కిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. యశ్వంత్ దర్శకత్వంలో తన్వీర్, ప్రకాశ్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. శనివారం మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత తన్వీర్ మాట్లాడుతూ "ప్రేక్షకులు సినిమా చూసి మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. హీరో అభిషేక్ పచ్చిపాల మాట్లాడుతూ "ఈ సినిమా మొత్తం చాలా వినోదాత్మకంగా ఉంటుంది" అని చెప్పారు. దర్శకుడు యశ్వంత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: దుర్గ నరసింహ, సినిమాటోగ్రాఫర్: ఆమిర్, సంగీతం: ఎస్.కె.బాజీ.

సీఎం రేవంత్‌రెడ్డిని కలసిన సాయి దుర్గాతేజ్



హీరో సాయిదుర్గాతేజ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఇటీవల సోషల్ మీడియాలో పిల్లలపై జరుగుతున్న అసభ్యకరమైన కామెంట్లను ఖండిస్తూ.. దుర్గాతేజ్ ఎక్స్‌లో ప్రణీత్ హనుమంతు అనే యూట్యూబర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి స్పందించగా, ప్రణీత్‌తో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ముఖ్యమంత్రితో పాటు తెలంగాణ ప్రభుత్వం సకాలంలో తన అభ్యర్థనకు స్పందించిన తీరుకు కృతజ్ఞతగా సాయి దుర్గతేజ్ ముఖ్యమంత్రిని కలిసి తన అభినందనలు తెలియజేశారు. "ఈ భేటీలో పిల్లలపై అసభ్యరంగా కామెంట్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరాను. ఆయన సానుకూలంగా స్పందించారు" అని ఎక్స్‌లో సాయిదుర్గాతేజ్ పోస్ట్ చేశారు.

మ్యూజిక్ సిట్టింగ్స్‌లో



రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చిబాబు సనాతో 'ఆర్‌సి16' వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దాదాపు 200 కోట్ల భారీ బడ్జెట్‌తో క్రీడా నేపథ్యంలో ఈ సినిమాను వెంకట సతీశ్‌కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన సంగతిని డైరెక్టర్ బుచ్చిబాబు సనా అభిమానులతో పంచుకున్నారు. "ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ ప్రస్తుతం ఫుల్ జోష్‌తో సాగుతోంది. దుబాయ్‌లోని ఫిర్‌దౌస్ స్టూడియోలో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్, దర్శకుడు బుచ్చిబాబు కలసి దిగిన ఫొటోను యూనిట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

ఎనర్జిటిక్ డాన్స్ డ్యూయెట్



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్‌ను జరుపుకొంటున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావచ్చిందని కేవలం రెండు పాటలు.. ఒక కీలక సన్నివేశం మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. అయితే ఈ సినిమాలోని ఓ పాటను హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్స్‌లో రేపటి నుంచి చిత్రీకరించనున్నారని తెలిసింది. ఎన్టీఆర్, జాన్వీకపూర్ మధ్య సాగే ఈ డాన్స్ డ్యూయెట్ పాట.. చాలా ఎనర్జిటిక్‌గా ఉండి.. చిత్రానికే స్పెషల్ అట్రాక్షన్‌గా ఉండనుందట.

హారర్ కామెడీగా 'యజ్ఞ'



ప్రదీప్ రెడ్డి, శివ నాయుడు, గోవా జ్యోతి ప్రధానపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యజ్ఞ'. సుమన్ శెట్టి, జబర్దస్త్ అప్పారావు, చిట్టిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రజల్లు ప్రసాద్‌యజ్ఞ దర్శకత్వంలో చిలుకోటి రఘురామ్, చీలపల్లి విఠల్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్రజల్లు ప్రసాద్ యజ్ఞ మాట్లాడుతూ "ఈ సినిమాను యజ్ఞంలా భావించి చేశాం. హారర్ కామెడీగా తెరకెక్కిన ఈ మూవీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని అన్నారు. "కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను గెలుస్తుంది" అని నిర్మాత విఠల్‌గౌడ్ చెప్పారు. "ఈ మూవీ సినిమా ప్రేక్షకులకు ఫుల్ మీల్స్‌లా ఉంటుంది" అని హీరో శివనాయుడు అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జి.కృష్ణ నాయుడు, సుధాకర్ నాయుడు.కె. సంగీతం: లక్ష్మణసాయి

సవాల్‌గా అనిపించింది



దాదాపు మూడేళ్ల గ్యాప్ తరువాత 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ'(ఉపశీర్షిక) చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించనున్నారు నభా నటేశ్. అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియదర్శి కథానాయకుడిగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా నభా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథను డైరెక్టర్ చెప్పగానే ఒప్పేసుకున్నాను. ఇందులో నా పాత్రకు స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉంటుంది. విభిన్న షేడ్స్ ఉన్న ఈ పాత్ర ఎంతో చాలెంజింగ్‌గా అనిపించింది. నేను ఇప్పటివరకూ ఇలాంటి రోల్ చేయలేదు. ఇదొక పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఈ సినిమాలో లవ్, కామెడీ, డ్రామా, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది. ప్రియదర్శి కామెడీ టైమింగ్ చిత్రానికే హైలైట్‌గా ఉంటుంది. దర్శకుడు కథను చెప్పినదానికంటే మరింత బాగా తెరకెక్కించారు" అని చెప్పారు.

ప్రైవేట్ సాంగ్స్‌కు సై

మ్యూజిక్ వీడియో, ఆల్బమ్స్, ప్రైవేట్ సాంగ్స్... పేరేదైనా వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. శ్రోతల నుంచి భారీ స్పందన లభించడంతో ప్రైవేట్ సాంగ్స్ యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్నాయి. అద్భుతమైన విజువల్స్‌కు తోడు మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కుతుండడంతో మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి. అందుకే కొంతకాలంగా కథానాయికలు ప్రైవేట్ సాంగ్స్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బాలీవుడ్‌లో ఇలాంటి వీడియోలకు స్పెషల్ క్రేజ్ ఉంది. ఇప్పుడిప్పుడే సౌత్‌లోనూ ఈ ట్రెండ్ పుంజుకుంటోంది. మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్‌లు సైతం మ్యూజిక్ ఆల్బమ్స్‌తో అభిమానులను అలరిస్తున్నారు. యూట్యూబ్‌లో ఈ మ్యూజిక్ ఆల్బమ్స్‌కు మంచి ఆదరణ దక్కుతోంది.



హీరోయిన్‌గా అరంగేట్రం చేయకముందే గాయనిగా, సంగీత దర్శకురాలిగా చక్కని గుర్తింపు పొందారు శ్రుతీహాసన్. తనతండ్రి కమల్ హాసన్ నటించిన 'ఈనాడు' చిత్రానికి సంగీతం అందించారు. కరోనా టైమ్‌లో 'ఎడ్జ్' పేరుతో ఆమె వీడియోసాంగ్‌ను రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేయగా అభిమానులను ఆకట్టుకుంది. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో కలసి 'ఇనిమేల్' పేరుతో ఓ స్పెషల్ సాంగ్ చేశారు. ఈ గీతానికి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. శ్రుతీ సంగీతం సమకూర్చారు. కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మించింది. ప్రేమికుల మధ్య ఉండే అనుబంధాన్ని ఈ పాటలో ఆవిష్కరించిన తీరు అభిమానులను అలరించింది.



● ప్రస్తుతం రాజ్‌తరుణ్ కేసులో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు మాల్వీ మల్హోత్రా. తాజాగా ఆమె నటించిన ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ 'షహబానో' విడుదలైంది. ఈ సాంగ్‌కు యశ్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. హిమాలయాల్లోని మంచు పర్వతాల్లో ఈ పాటను అద్భుతంగా చిత్రీకరించారు. ఈ పాటకు రెండో పార్ట్ కూడా ఉందని ప్రకటించారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి విడుదల చేశారు.

● తమిళంలో రజనీకాంత్, ధనుష్, విజయ్ లాంటి స్టార్స్ చిత్రాల్లో కథానాయికగా నటించి మెప్పించారు మాళవికా మోహనన్. ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న 'రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్‌కు కథానాయికగా ఆమె పరిచయమవుతున్నారు. ఓ వైపు సినిమాలతో బిజీగా ఉన్నా ఓ ప్రైవేట్ సాంగ్‌లో మెరిశారు మాళవిక. బాలీవుడ్‌లో ఈ అమ్మడు చేసిన 'తౌబా' సాంగ్ సన్సేషన్ సృష్టించింది. 60 మిలియన్లకు పైగా వ్యూస్‌ను ఈ పాట సొంతం చేసుకొంది.

● 'కలియుగంలో పట్టణం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన గుజరాతీ భామ ఆయుషి పటేల్. 'చూసుకో నీలోకి' అంటూ సాగే ఓ ప్రైవేట్ సాంగ్‌లో ఆమె మెరిశారు. హీరో త్రిగుణ్ ఈ గీతంలో ఆయుషికి జోడీగా కనిపించారు. కేరళలోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించిన గీతం యూట్యూబ్‌లో చక్కటి ఆదరణ పొందుతోంది.



● రవితేజ హీరోగా వచ్చిన 'నేల టికెట్' చిత్రంతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమయ్యారు మాళవిక శర్మ. ఆ తర్వాత రామ్ సరసన 'రెడ్' చిత్రంలో కనిపించారు. రెండేళ్ల క్రితమే 'బారీషోంమే' అంటూ సాగే ఓ ప్రైవేట్ సాంగ్‌ను చేశారు. వర్షం నేపథ్యంలో ప్రేమికుల భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ పాట మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

● కొన్నేళ్ల పాటు టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన గోవా బ్యూటి ఇలియానా గతేడాది ఓ ప్రైవేట్ సాంగ్‌లో మెరిశారు. ఆల్బంసాంగ్స్ చేసే మంజిత్‌సింగ్, సుఖ్‌జిత్‌సింగ్‌తో కలసి 'సబ్ గజబ్' అనే సాంగ్ చేశారు ఇలియానా. ఇది యూట్యూబ్‌లో మంచి వ్యూయర్‌షిప్‌ను సొంతం చేసుకుంది.

రిటైల్ డిజిటల్ చెల్లింపుల జోరు..

2030 నాటికి రూ.600 లక్షల కోట్లకు చేరే చాన్స్.. ప్రస్తుతం రూ.300 లక్షల కోట్ల స్థాయిలో

కెర్నీ-అమెజాన్ పే నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: జేబులో సరిపడా చిల్లర లేదా? అయినా ఇబ్బంది లేదు. మీ మొబైల్ ఫోన్‌లో ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే ఉంటే చాలు. జేబులో పైసా లేకపోయినా.. కావలసిన వస్తువులు కొని డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. అది ఆన్‌లైన్ కావచ్చు. ఆఫ్‌లైన్ కావచ్చు. దేనికైనా సరే అవసరమైన వస్తువులు కొని నింపాదిగా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఇప్పుడు తోపుడు బండ్ల మీద కూరగాయలు, పండ్లు, పూలు అమ్మే వీధి వ్యాపారులు కూడా డిజిటల్ చెల్లింపులకు మారిపోయారు. దీంతో 2018లో మన దేశంలో 30,000 కోట్ల డాలర్లుగా ఉన్న రిటైల్ డిజిటల్ చెల్లింపులు గత ఏడాది 3.6 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.300 లక్షల కోట్లు) చేరాయి. మరో ఆరేళ్లలో అంటే 2030 నాటికి ఈ చెల్లింపులు 7 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరతాయని కెర్నీ-అమెజాన్ పే సంస్థలు 'హౌ అర్బన్ ఇండియా పేస్' పేరుతో రూపొందించిన నివేదికలో తెలిపాయి. ప్రస్తుత డాలర్-రూపాయి మారక రేటు ప్రకారం ఇది దాదాపు రూ.600 లక్షల కోట్లకు సమానం.

ఆన్‌లైన్ కొనుగోళ్లే ఊతం: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సైట్ల ద్వారా చేసే కొనుగోళ్ల రిటైల్ డిజిటల్ చెల్లింపులకు బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం ఈ కొనుగోళ్లకు చేసే చెల్లింపుల్లో 90 శాతం డిజిటల్ చెల్లింపులే. సంపన్న వినియోగదారులైతే తమ ఆన్‌లైన్ కొనుగోళ్లకు నగదు కంటే డిజిటల్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నట్టు నివేదిక తెలిపింది. ఇక ఆఫ్‌లైన్ చెల్లింపుల్లోనూ డిజిటల్ చెల్లింపులదే హవా. పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లోనూ ఇప్పుడు డిజిటల్ చెల్లింపులను అనుమతిస్తున్నారు. మిలీనియల్స్, జెనరేషన్ ఎక్స్, స్త్రీలు-పురుషులనే తేడా లేకుండా ప్రస్తుతం అందరూ డిజిటల్ చెలింపులకే మొగ్గు చూపుతున్నట్టు కెర్నీ-అమెజాన్ పే తెలిపింది.

యూపీఐతో మరింత జోరు: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో డిజిటల్ చెల్లింపులు మరింత జోరందుకున్నాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలో యూపీఐ చెల్లింపులు 138 శాతం పెరిగాయి. ప్రస్తుతం కార్డులు, డిజిటల్ వాలెట్ల చెల్లింపులు కూడా క్రమంగా ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో వీటి వాటా ప్రస్తుతం 10 శాతం వరకు ఉంటుందని నివేదిక తెలిపింది.

ప్రపంచంలో 46 శాతం వాటా

ప్రస్తుతం ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో భారత్‌దే హవా. 2022లో ప్రపంచంలో జరిగిన డిజిటల్ చెల్లింపుల్లో 46 శాతం మన దేశంలోనే జరిగాయి. దీన్నిబట్టి మన దేశంలో డిజిటల్ చెల్లింపులు ఎంత ప్రాచుర్యం పొందాయో ఊహించుకోవచ్చు. చిన్నచిన్న పట్టణాల్లో 65 శాతం, పెద్దపెద్ద నగరాల్లో జరిగే చెల్లింపుల్లో 75 శాతం డిజిటల్ చెల్లింపులని కెర్నీ-అమెజాన్ పే నివేదిక తెలిపింది. అయితే బ్యాండ్‌విడ్త్ చాలినంత లేకపోవడం, పెరిగిపోతున్న సైబర్ మోసాలు రిటైల్ డిజిటల్ చెల్లింపులకు పెద్ద సవాల్‌గా మారాయి.

బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు !

బీమా కంపెనీల నుంచి ఇతర ఫైనాన్షియల్ ఉత్పత్తులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 1938 నాటి బీమా చట్టాన్ని సమూలంగా మార్చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. బీమా కంపెనీలకు కాంపొజిట్ లైసెన్సులు జారీ చేయడం, కంపెనీలను బట్టి మూలధన వర్గీకరణ, సాల్వెన్సీ నిబంధనల సడలింపు, క్యాప్టివ్ లైసెన్స్, పెట్టుబడి నిబంధనల మార్పు, ఇంటర్మీడియరీస్ అందరికీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్, బీమా కంపెనీలు ఇతర ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌నీ మార్కెట్ చేసే స్వేచ్ఛకు సంబంధించి ఈ సవరణలు ఉంటాయని సమాచారం. 2047 నాటికి అందరికీ బీమా అనే లక్ష్యం సాకారం కావాలంటే ఈ సవరణలు తప్పవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

బ్యాంకుల్లానే బీమా కంపెనీలు

ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో యూనివర్సల్ బ్యాంక్, స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్, పేమెంట్‌బ్యాంక్ పేరుతో మూడు రకాల బ్యాంకులు ఉన్నాయి. బీమా రంగంలోనూ మూలధనాన్ని బట్టి ప్రత్యేక బీమా కంపెనీలను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంపోజిట్ లైసెన్స్ ద్వారా జీవిత బీమా కంపెనీలు జీవిత బీమా పాలసీలతో పాటు ఆరోగ్య బీమా పాలసీలు, మోటార్, ఫైర్ వంటి జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలను మార్కెట్ చేసేందుకు అనుమతించాలని యోచిస్తోంది. దీంతో మరిన్ని కంపెనీలు బీమాలోకి వస్తాయని భావిస్తోంది.

గెయిల్ మాజీ చైర్మన్ ప్రసాద్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని గెయిల్ (ఇండియా) మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) డాక్టర్ సీఆర్ ప్రసాద్ (83) మరిక లేరు. ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఆయన శనివారం రాత్రి కన్నుమూశారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేసిన ఆయన నాగర్జునసాగర్ డ్యామ్ నిర్మాణంలో ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తర్వాత కొంతకాలం నెల్లూరు థర్మల్ పవర్ స్టేషన్‌లోనూ పని చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి మారి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో గెయిల్ ఏర్పాటు చేసిన కొత్తలో ఆ సంస్థ మార్కెటింగ్ అండ్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్‌గా చేరారు. తర్వాత 1996 సెప్టెంబరులో గెయిల్ (ఇండియా) సీఎండీగా బాధ్యతలు చేపట్టి 2001 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఇంధన రంగంలో అపార అనుభవం ఉన్న ప్రసాద్.. ఇంద్రప్రస్థ గ్యాస్, మహానగర్ గ్యాస్ కంపెనీల ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. కార్పొరేట్ రంగంలో సీఆర్‌పీగా సుపరిచితులైన ఆయన ప్రభుత్వ రంగంలోని పలు ఇంధన సంస్థల ప్రముఖులకు గురుతుల్యులు.

24,750 పైన బుల్లిష్

అస్ట్రో ట్రెండ్

(జూలై 15-19 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,194-24,592 పాయింట్ల మధ్యన కదలాడి 178 పాయింట్ల లాభంతో 24,502 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,374, 24,333, 24,209, 23,815 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,800 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,100
నిరోధ స్థాయిలు: 24,600, 24,700, 24,800 (24,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,300, 24,200, 24,100 (24,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	122
కర్నూలు	110	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	115
గోదావరి	115		

ఆర్థిక ఫలితాలతోనే దిశ!

ఈ వారం స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సాధారణంగా బడ్జెట్‌కు ముందు మార్కెట్లో దిద్దుబాటు జరుగుతుంది. ఈసారి కూడా అదే సరళి కొనసాగొచ్చు. మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, గ్లోబల్ ట్రెండ్స్ కూడా మార్కెట్ల గమనాన్ని నిర్దేశించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,450 వద్ద మద్దతు, 24,600 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఆర్థిక ఫలితాల సీజన్ మొదలు కావటంతో ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం బెటర్. ఈ వారం ఐటీ షేర్లు జోరును ప్రదర్శించే వీలుంది. బుధవారం మొహర్రం సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు. దీంతో ఈ వారం మార్కెట్లు నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐఆర్‌సీటీసీ: గత వారం రైల్వే షేర్లు పరుగులు పెట్టాయి. ఇదే రంగానికి చెందిన ఈ షేరు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. రూ.1,050 వద్ద నిరోధాన్ని అధిగమిస్తే మరింత పైకి వెళ్లడం ఖాయం. కన్సాలిడేషన్ ఆఖరి దశకు చేరుకుంది. గత శుక్రవారం ఈ షేరు 1.33 శాతం లాభంతో రూ.1,043 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,020/1,040 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,075/1,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.999 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

జీఎంటర్‌టైన్‌మెంట్: ఈ కౌంటర్‌లో కొంత మూమెంటమ్ కనిపిస్తోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్న ఈ షేరులో మంచి బేస్ ఏర్పడుతోంది. టర్న్ అరౌండ్ జరిగే అవకాశాలున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 5.65 శాతం లాభంతో రూ.155 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.155/153 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.165/180 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.150 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ బ్యాంక్ డిపాజిట్లు, రుణాల్లో వృద్ధి కనిపిస్తోంది. ఆర్థిక ఫలితాల అనంతరం ఈ షేరు ధర పుంజుకోవచ్చు. కొన్ని నెలలుగా ఈ కౌంటర్ సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ప్రస్తుతం ఈ షేరు ప్రధాన మద్దతు స్థాయి రూ.1,425ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 5.75 శాతం లాభంతో రూ.1,435.50 వద్ద క్లోజైంది. స్వింగ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.1,420/1,400 స్థాయిల్లో ఎంటరై రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.అయితే రూ.1,380 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టెక్ మహీంద్రా: ఈ స్టాక్‌కు చాలా సానుకూలతలు ఉన్నాయి. మరోవైపు ఐటీ సూచీ సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరింది. మళ్లీ ఐటీ కంపెనీలకు ఆర్డర్లు పెరుగుతున్నాయి. మార్కెట్ అంచనాలను మించి ఫలితాలు విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ షేరు ఇప్పటికే 52 వారాల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 3 శాతం లాభంతో రూ.1,505 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,490/ 1,500 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,565/1,620 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రైట్స్: ఈ స్టాక్ ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో చలిస్తోంది. బ్రేకౌట్‌కు రెడీ అవుతోంది. చివరి వారం ట్రేడింగ్ వాల్యూమ్ బాగా పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 6.85 శాతం లాభంతో రూ.771 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.770/760 శ్రేణిలో ఎంటరై రూ.790/840 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.745 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 24,600

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,500 వరకు వెళ్లి రియాక్షన్‌కు గురయింది. కరెక్షన్ తర్వాత కూడా ఇండెక్స్ 24,150 వద్ద రికవరీ సాధించి వారం మొత్తం మీద 180 పాయింట్ల లాభంతో చివరికి 24,500 స్థాయికి చేరువలో క్లోజయింది. వరుసగా తొమ్మిది వారాలుగా ర్యాలీలో పరుగెడుతున్న నిఫ్టీ జూన్ నాలుగో తేదీ నాటి మహాపతనంలో ఏర్పడిన ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 21,300 నుంచి 3,300 పాయింట్ల మేరకు లాభపడింది. అక్కడక్కడా మైనర్ రియాక్షన్లు ఏర్పడుతున్నప్పటికీ ప్రతి మద్దతు స్థాయిలోనూ రికవరీ కొనసాగిస్తోంది. మిడ్‌క్యాప్-100 సూచీ 60 పాయింట్ల స్వల్ప నష్టంతో క్లోజ్ కాగా స్మాల్‌క్యాప్-100 సూచీ స్వల్పంగా 7 పాయింట్ల మేరకు లాభపడింది. నిఫ్టీ ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు నమోదు చేస్తూ పరుగులు తీస్తున్న కారణంగా కరెక్షన్ ఏర్పడవలసి ఉంది. గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. గత శుక్రవారం 24,600 వద్ద నిరోధం ఏర్పడినందు వల్ల ఈ వారంలో ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుందా, లేదా వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ 24,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన సరికొత్త గరిష్ఠ స్థాయిల్లో ప్రవేశిస్తుంది. మానసిక అవధులు 24,800, 25,000.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 24,400 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 24,200, 24,000.

బ్యాంక్ నిఫ్టీ: గత మూడు వారాలుగా 53,000 స్థాయిలో నిరోధం ఎదుర్కొంటున్న ఈ సూచీ గత వారం 52,280 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 52,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 53,100. బలహీనత ప్రదర్శించి ప్రధాన మద్దతు స్థాయి 52,000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ 24,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే బలహీనత మరింతగా కొనసాగవచ్చు. గత శుక్రవారంనాడు బుధవారం నాటి టాప్ వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,600, 24,655
మద్దతు	24,460, 24,400

ఘనంగా ముగించారు

- 4-1తో సిరీస్ నెగ్గిన భారత్
- పేసర్ ముకేశ్‌కు నాలుగు వికెట్లు
- ఐదో టీ20లోనూ జింబాబ్వే చిత్తు





సంజూ (58)

హరారే: సిరీస్ చివరి మ్యాచ్‌లోనూ యువ భారత్ నుంచి అదే జోరు. సంజూ శాంసన్ (45 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 58) అర్ధసెంచరీకి తోడు.. పేసర్ ముకేశ్ (4/22) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో ఆకట్టుకోవడంతో ఆఖరిదైన ఐదో టీ20లో భారత్ 42 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే సిరీస్‌ను సైతం 4-1తో ఘనంగా ముగించింది. ఆదివారం జరిగిన ఈ నామమాత్రపు మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. దూబే (26), పరాగ్ (22) రాణించారు. ముజరబానికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. పేసర్ ముకేశ్ (4/22) ఆరంభ, చివర్లో దెబ్బతీయగా.. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టడి చేశారు. దీంతో 18.3 ఓవర్లలో 125 రన్స్‌కే ఆలౌటైంది. మైర్స్ (34), మరుమని (27) మాత్రమే ఆకట్టుకోగా, డెత్ ఓవర్లలో ఫరాజ్ (27) వేగంగా ఆడి ఓటమి తేడాను తగ్గించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దూబే 26 పరుగులు చేయడమే గాక, రెండు వికెట్లు తీశాడు. అలాగే సిరీస్‌లో 8 వికెట్లతో రాణించిన వాషింగ్టన్ సుందర్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు.

ఆదుకున్న శాంసన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఈసారి దూకుడు తగ్గింది. టాపార్డర్ విఫలం కాగా, సంజూ శాంసన్ ఒక్కడే సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతడికి పరాగ్ సహకారంతో పాటు చివర్లో దూబే మెరుపులు తోడయ్యాయి. దీంతో స్కోరు 160 దాటగలిగింది. చివరి మ్యాచ్‌లో అజేయంగా చెలరేగిన ఓపెనర్ జైస్వాల్ (12) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగాడు. మూడో ఓవర్‌లో అభిషేక్ (14) సిక్సర్, గిల్ రెండు ఫోర్లతో 16 రన్స్ వచ్చాయి. కానీ ఆ తర్వాత వరుస ఓవర్లలో ఇద్దరూ పెవిలియన్‌కు చేరారు. పవర్‌ప్లేలో 44/3 స్కోరుతో నిలిచిన జట్టును మధ్య ఓవర్లలో శాంసన్-పరాగ్ జోడీ ఆదుకుంది. 12వ ఓవర్‌లో శాంసన్ రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. ఇందులో తొలి సిక్సర్ అయితే ఏకంగా 110మీ. దూరం వెళ్లి స్టేడియం బయటపడింది. అయితే జట్టు స్కోరు వంద పరుగులు దాటాక 15వ ఓవర్‌లో పరాగ్‌ను మవుట అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు 39 బంతుల్లో కెరీర్‌లో రెండో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న శాంసన్ కూడా స్వల్ప వ్యవధిలోనే వెనుదిరిగాడు. ఈ దశలో దూబే చెలరేగి 18వ ఓవర్‌లో 4,6,4తో విలువైన రన్స్ అందించినా.. ఆఖరి ఓవర్ తొలి బంతికే రనౌట్‌గా వెనుదిరిగాడు. కానీ చివరి రెండు ఓవర్లలో దూబే, రింకూ (11 నాటౌట్) ఆటతీరుతో జట్టు 30 పరుగులు సాధించగలిగింది.

ఒక్క బంతికి 13 రన్స్

ఓపెనర్ జైస్వాల్ ఒక్క బంతికే 12 పరుగులు సాధించి రికార్డు నెలకొల్పాడు. భారత్ ఇన్నింగ్స్ మొదటి బంతికే స్పిన్నర్ రజా ఫుల్‌టాస్ బంతి వేయగా జైస్వాల్ సిక్సర్ బాదాడు. దీన్ని అంపైర్ నోబాల్‌గా ప్రకటించడంతో, తర్వాతి ఫ్రీహిట్ బాల్‌ను సైతం జైస్వాల్ సిక్సర్‌గా మలిచాడు. దీంతో ఒక్క లీగల్ డెలివరీకి జట్టుకు 13 పరుగులు రాగా.. అటు జైస్వాల్ 12 రన్స్ సాధించినట్టయ్యింది. అలాగే పురుషుల టీ20ల్లో ఈ ఫీట్ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (బి) రజా 12; గిల్ (సి) రజా (బి) ఎన్‌గరవ 13; అభిషేక్ (సి) మదండె (బి) ముజరబాని 14; శాంసన్ (సి) మరుమని (బి) ముజరబాని 58; పరాగ్ (సి) ఎన్‌గరవ (బి) మవుట 22; దూబే (రనౌట్) 26; రింకూ (నాటౌట్) 11; సుందర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 167/6. వికెట్ల పతనం:** 1-13, 2-38, 3-40, 4-105, 5-135, 6-153; **బౌలింగ్:** రజా 4-0-37-1; ఎన్‌గరవ 4-0-29-1; ఫరాజ్ 4-0-39-0; ముజరబాని 4-0-19-2; మవుట 4-0-39-1.

జింబాబ్వే: మదెవెరె (బి) ముకేశ్ 0; మరుమని (ఎల్బీ) సుందర్ 27; బెన్నెట్ (సి) దూబే (బి) ముకేశ్ 10; మైర్స్ (సి) అభిషేక్ (బి) దూబే 34; రజా (రనౌట్) 8; క్యాంప్‌బెల్ (సి) తుషార్ (బి) దూబే 4; మదండె (సి) శాంసన్ (బి) అభిషేక్ 1; ఫరాజ్ (సి) శాంసన్ (బి) ముకేశ్ 27; మవుట (సి అండ్ బి) తుషార్ 4; ముజరబాని (నాటౌట్) 1; ఎన్‌గరవ (బి) ముకేశ్ 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 18.3 ఓవర్లలో 125 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-15, 3-59, 4-85, 5-87, 6-90, 7-94, 8-120, 9-123, 10-125; **బౌలింగ్:** ముకేశ్ 3.3-0-22-4; తుషార్ 3-0-25-1; బిష్ణోయ్ 3-0-23-0; సుందర్ 2-0-7-1; అభిషేక్ 3-0-20-1; దూబే 4-0-25-2.

అల్కారజ్.. వన్స్‌మోర్!


- వింబుల్డన్ టైటిల్ నిలబెట్టుకొన్న కార్లోస్
- ఫైనల్లో జొకోవిచ్ ఓటమి



నిలకడే మంత్రంగా..

బిగ్-3 తర్వాత ఎవరు అనే ప్రశ్న చాలా కాలంగా అలాగే మిగిలి పోయింది. ఫెడరర్ రిటైర్ కాగా.. నడాల్, జొకోవిచ్ వీడ్కోలు అంచున ఉన్నారు. సరికొత్త హీరో ఎవరన్న ప్రశ్నకు కార్లోస్ అల్కారజ్ అనే సమాధానం వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో కార్లోస్ అంతటి నిలకడ ఎవరిలోనూ కనిపించలేదు. పరిస్థితులకు తగ్గట్టుగా తన ఆట తీరును మార్చుకోవడం అతడి ప్రత్యేకత. వింబుల్డన్‌ను రెండోసారి నెగ్గడంతోపాటు.. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌ను కూడా సొంతం చేసుకొన్నాడు. చిన్నవయసులో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లతో సరికొత్త రికార్డు సృష్టించాడు. కార్లోస్ తండ్రి గొంజాలెజ్ టెన్నిస్ కోచ్ కావడంతో.. నాలుగేళ్ల వయసు నుంచే రాకెట్ పట్టాడు. 16 ఏళ్ల వయసులో ఏటీపీ టోర్నీ రియో ఓపెన్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించిన అల్కారజ్.. ఆ తర్వాతి ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ ఎంట్రీ ఇచ్చాడు. 18 ఏళ్ల వయసులో టాప్-100లోకి దూసుకెళ్లిన కార్లోస్.. కెరీర్‌లో వేగంగా ఎదిగాడు. 2021 యూఎస్ ఓపెన్‌లో వరల్డ్ నెం:3 సిట్సిపా‌స్‌ను ఓడించాడు. 2022 ఏప్రిల్‌లో టాప్-10లో చోటుదక్కించుకొన్న అతడు.. అదే ఏడాది యూఎస్ ఓపెన్‌లో కాస్పర్ రూడ్‌ను ఓడించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు. 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో చుక్కెదురైనా.. ఆ తర్వాత వరుసగా రెండు టైటిళ్లతో సత్తాచాటాడు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో క్లే, గ్రాస్ కోర్టుల్లో విజేతగా నిలిచిన ఆరో ఆటగాడిగా అరుదైన ఘనతను అందుకొన్నాడు.





ప్రైజ్‌మనీ

- అల్కారజ్‌కు: రూ. 28 కోట్ల 35 లక్షలు
- జొకోవిచ్‌కు: రూ. 14 కోట్ల 70 లక్షలు
- సెమీఫైనల్లో ఓడిన ఇద్దరికి : చెరి 7 కోట్ల 50 లక్షలు

21 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయసులో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గిన అల్కారజ్..బోర్గ్, బోరిస్ బెకర్, మాట్స్ విలాండర్ సరసన చేరాడు.

లండన్: బిగ్‌ఫైట్‌గా భావించిన వింబుల్డన్ ఫైనల్.. వన్‌సైడ్‌గా ముగిసింది. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన స్పెయిన్ యువ కెరటం, 21 ఏళ్ల కార్లోస్ అల్కారజ్ టైటిల్ నిలబెట్టుకొన్నాడు. గత టోర్నీ ఫైనల్లో ఓటమికి బదులు తీర్చుకోవడమే కాకుండా.. 8వసారి గ్రాస్ కోర్టులో నెగ్గి ఫెడరర్ రికార్డును సమం చేయాలనుకొన్న రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)కు మరోసారి నిరాశే ఎదురైంది. అలాగే 25వ టైటిల్‌తో చరిత్రలో నిల్చిపోదామనుకున్న జొకోవిచ్‌కు బ్రేక్ పడింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ తుది పోరులో మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-2, 7-6(4)తో వరుస సెట్లలో జొకోవిచ్‌ను చిత్తు చేశాడు. గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన అతడు.. కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు. మోకాలి ఆపరేషన్ చేయించుకొన్న 37 ఏళ్ల నొవాక్ మునుపటి తరహాలో అలరించలేక పోయాడు. పదేపదే అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకొన్నాడు. 2 గంటల 27 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో 42 విన్నర్లు కొట్టిన కార్లోస్.. 5 బ్రేక్‌పాయింట్లు సాధించాడు. కాగా, జొకో 26 విన్నర్లు మాత్రమే కొట్టాడు. తొలిసెట్ మొదటి గేమ్‌లోనే నొవాక్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన స్పెయిన్ బుల్ 2-0 ఆధిక్యం సాధించాడు. తర్వాత ఐదో గేమ్‌లో మరోసారి బ్రేక్ పాయింట్ సాధించి తొలి సెట్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో సెట్‌లోనూ అల్కారజ్ జోరు ముందు నిలవలేక పోయాడు. అయితే, మూడో సెట్‌లో మాత్రం నొవాక్ కొంత మేర పోటీ ఇచ్చాడు. అల్కారజ్ 5-4తో చాంపియన్‌షిప్ పాయింట్‌పై ఉన్నప్పుడు.. పోరాడి సర్వీస్‌ను నిలబెట్టుకొన్న నొవాక్ 5-5తో సమం చేశాడు. సెట్ ఫలితం టైబ్రేక్‌కు దారి తీయడంతో జొకో మ్యాచ్‌ను మలుపు తిప్పుతాడని అభిమానులు ఆశించారు. టైబ్రేక్‌లో 3-3తో సమమైనా.. ఆ తర్వాత అల్కారజ్ జోరు చూపాడు. 6-4తో చాంపియన్‌షిప్ పాయింట్‌పై ఉన్నప్పుడు నొవాక్ రిటర్న్ నెట్‌కు తగలడంతో.. సంబరాలు చేసుకొన్నాడు.

అ'ధర'హో..: ఫైనల్ మ్యాచ్ టిక్కెట్ల రేట్లు ఆకాశాన్నంటాయి. ఒకరకంగా క్రీడా చరిత్రలో అత్యంత ఖరీదైన మ్యాచ్ టిక్కెట్లుగా రికార్డులకెక్కనున్నట్టు భావిస్తున్నాయి. తుది పోరు టిక్కెట్ కనీస ధర రూ. 8.35 లక్షలుపైగానే ఉందని ప్రముఖ కామెంటేటర్ డారెన్ జీవెల్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

విజేత సినికోవా జోడీ..

మహిళల డబుల్స్ టైటిల్‌ను కట్రీనా సినికోవా జోడీ సొంతం చేసుకొంది. ఫైనల్లో చెక్-అమెరికా జోడీ సినికోవా-టేలర్ టౌన్‌సెండ్ 7-6(5), 7-6(1)తో కెనడా-న్యూజిలాండ్ ద్వయం గాబ్రియెలా డబ్రోస్కీ-ఎరిన్ రౌటిఫిపై విజయం సాధించింది.

రికార్డుల కుర్రాడు

ఒకే క్యాలెండర్ ఇయర్‌లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ నెగ్గిన పిన్న వయస్కుడిగా (21 ఏళ్ల 70 రోజులు) అల్కారజ్ రికార్డుల్లోకి ఎక్కాడు. అంతకుముందు బోర్గ్ (1978) 22 ఏళ్ల 32 రోజులు, నడాల్(2008) 22 ఏళ్ల 33 రోజుల వయసులో ఈ టైటిల్స్ నెగ్గారు.

- పిన్న వయసులో వింబుల్డన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న వారిలో మూడో ఆటగాడు అల్కారజ్. బోరిస్ బెకర్ (18 ఏళ్ల 227 రోజులు), బోర్గ్ (21 ఏళ్ల 26 రోజులు) ముందున్నారు.

గైక్వాడ్‌కు అండగా బీసీసీఐ

రూ.కోటి ఆర్థిక సహాయం



న్యూఢిల్లీ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న భారత మాజీ క్రికెటర్, మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ (71)కు బీసీసీఐ అండగా నిలిచింది. అతడి వైద్య ఖర్చుల కోసం రూ.కోటి ఆర్థిక సహాయం అందజేయనున్నట్టు ప్రకటించింది. అంతకుముందు గైక్వాడ్ చికిత్స కోసం బోర్డు ఆర్థిక సహాయం చేయాలంటూ కపిల్‌దేవ్ సహా మాజీ క్రికెటర్ల నుంచి విజ్ఞప్తులు అందాయి. దీంతో బోర్డు వెంటనే స్పందించింది. ఏడాది కాలంగా గైక్వాడ్ లండన్‌లో చికిత్స తీసుకుంటున్నారు. అతని మాజీ సహచరులు ఇప్పటికే నిధులు సేకరించి తోడ్పడుతుండగా.. బోర్డు కూడా ముందుకు రావాలని కపిల్ డిమాండ్ చేశాడు.

ఇండియా-ఎ జట్టులో షబ్నం, యశశ్రీ

ముంబై: ఆస్ట్రేలియా-ఎ జట్టుతో వచ్చేనెల ఏడు నుంచి జరిగే సిరీస్‌లో తలపడే భారత జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. ఆస్ట్రేలియాకు పయనం కానున్న 18 మంది సభ్యుల బృందంలో తెలుగు క్రికెటర్లు షబ్నం షకీల్ (ఆంధ్రప్రదేశ్), ఎస్. యశశ్రీ (తెలంగాణ)కి స్థానం దక్కించుకున్నారు. అయితే, షబ్నం ఎంపిక ఆమె ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. ఆసీస్‌తో ఇండియా-ఎ మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు (4 రోజులు) ఆడనుంది.

'అడహాక్' రాజకీయం!

- నాడు టీడీపీ నేతలపై తొడలు కొట్టిన పోలీసు సంఘం నేతలు
- ఐదేళ్లు వైసీపీతో అంటకాగి చంద్రబాబుపైనా పరుష విమర్శలు
- నేడు ప్రభుత్వం మారగానే ఊసరవెల్లులు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వడంపై పోలీసు సిబ్బంది విస్మయం

> 1 'మా మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన మీది అసలు నోరేనా?'
> 1 ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబునుద్దేశించి పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ నేత వ్యాఖ్య ఇది.
> 1 'వర్ల రామయ్యా.. ఖబడ్దార్.. పోలీసుల జాతకాలు నీకు తెలియడం కాదు. నీ జాతకమే మా దగ్గర ఉంది.'
> 1 ఉస్తాద్‌లా మీసం మెలేసి, తొడగొట్టిన మరో నేత.
> 1 'పోలీసులు జగన్‌కు రుణపడి ఉంటారు. 60 వేల కుటుంబాల్లో ఆయన వెలుగులు నింపారు.'
> 1 ఇవ్వని వీక్లీఆఫ్‌లపై నాటి సీఎం జగన్‌కు సంఘం మరో నేత ఇచ్చిన కితాబు.

నాలుగో సింహంలా పనిచేయాల్సిన పోలీసుల్లో కొందరు జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. ముఖ్యంగా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ ముఖ్య నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించారు. పోలీసులు చేసిన తప్పులను ఎత్తిచూపితే మీడియా ముందుకొచ్చి మీసం మెలేసి, తొడలు కొట్టారు. మాజీ సీఎం అన్న గౌరవం కూడా లేకుండా చంద్రబాబును, టీడీపీ నేతలను దుర్భాషలాడారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలంటూ జిల్లాల్లో తిరిగి ప్రచారం చేసిన ఆ 'అధికార' నేతలు రాజకీయం మొదలుపెట్టారు. ఊసరవెల్లి కంటే వేగంగా రంగులు మార్చేస్తున్నారు. పదవులు కాపాడుకోవడానికి..క్రిమినల్ కేసుల మాఫీకి టీడీపీ కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ఇప్పుడు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యేల దగ్గర నుంచి మంత్రుల వరకు ప్రతి ఒక్కరినీ కలుస్తూ బొకేలిస్తూ వారి ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. వైసీపీతో అంటకాగిన అడహాక్ కమిటీ నేతలకు మంత్రులు, ఎమ్మెల్యేలు అపాయింట్‌మెంట్ ఇచ్చి, ఫొటోలు దిగడంపై పోలీసు శాఖలోని ఇతర అధికారులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జగన్ అధికారంలో ఉండగా కొంతమంది పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా సంఘ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు. విజయవాడ కేంద్రంగా పనిచేసిన భూకబ్జాల మాఫియాలతో చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. ప్రస్తుత అడహాక్ కమిటీలో ఉన్న ఇద్దరు, ముగ్గురు నేతలపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో విచారణ కూడా సాగుతోంది. ఏ ఉద్యోగ సంఘంలో అయినా క్లీన్‌చిట్ ఉన్న వారిని నాయకులుగా ఎన్నుకుంటారు. పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీలో మాత్రం నేరారోపణలు ఉన్న వారికి స్థానం కల్పించారు. విజయవాడకు చెందిన ఒక 'రియల్' మోసగాడు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రూ.150 కోట్ల విలువ చేసే ఆస్తికి నకిలీపత్రాలు సృష్టించి కాజేయడానికి స్కెచ్ వేశాడు. దీనికి రూపకల్పన మొత్తం విజయవాడ కేంద్రంగానే సాగింది. అడహాక్ కమిటీలో కీలకంగా ఉన్న నేత ఆ మోసగాడికి సహకరించారని ఆరోపణలు వచ్చాయి. ఆయనపైనా కేసు నడుస్తోంది. కాగా.. పోలీసు అధికారుల సంఘానికి ప్రతి మూడేళ్లకోసారి ఎన్నికలు జరపాలి. అయితే దీనిపై కోర్టులో వివాదం ఉండడంతో.. అడహాక్ కమిటీని ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ఈ కమిటీ పదవీకాలం ఆరు నెలలే. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక ఏర్పడిన అడహాక్ కమిటీ ఆరు నెలలకు మారాల్సి ఉండగా.. ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



సోమశిల జలాశయం ముందు దెబ్బతిన్న అప్రాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రులు ఆనం, నారాయణ తదితరులు

జగన్ పాలనలో.. పాతాళానికి నీటిపారుదల

- సోమశిల డ్యాం కొట్టుకుపోయేలా చేశారు: నిమ్మల

అనంతసాగరం, జూలై 14: ఐదేళ్ల పాలనలో నీటిపారుదల రంగాన్ని జగన్ విధ్వంసం చేశాడని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆదివారం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన నెల్లూరు జిల్లాలోని సోమశిల డ్యాంను సందర్శించారు. తొలుత ఇరిగేషన్ అతిథిగృహంలో ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి లోపాలు తెలుసుకున్నారు. అనంతరం నిమ్మల విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో ఇరిగేషన్ రంగాన్ని పాతాళానికి నెట్టేశారని, సోమశిలలో అప్రాన్ పనులు అత్యవసరంగా చేయాల్సి ఉండగా.. వాటి గురించి పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయే పరిస్థితి తెచ్చారని దుయ్యబట్టారు. ప్రాజెక్టులపై అవగాహన లేని ఒకటో, రెండో కృష్ణులు అనిల్‌కుమార్, అంబటి రాంబాబు వాటిని భ్రష్టుపట్టించారని తెలిపారు. జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులకు రీటెండరింగ్ పేరిట కాలయాపన చేసిందని, ఐదేళ్లలో ఒక్కశాతం పనులు కూడా చేయలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని తెలిపారు. 2019-24 మధ్య రూ.12 లక్షల కోట్ల బడ్జెట్ ఉండగా ప్రాజెక్టులకు కేటాయించింది రూ.30వేల కోట్లు మాత్రమేనని.. అందులో సగం నిధులు వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. వచ్చే ఐదేళ్లపాటు కష్టపడి పనిచేసి ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడతామన్నారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సునీల్, కాకర్ల సురేశ్, ఇంటూరి నాగేశ్వరావు, ఎస్ఈ వెంకటరమణరెడ్డి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం అవినీతిపై విచారణ కమిటీ వేయాలి

- బాధ్యులను గుర్తించి నష్టాన్ని రాబట్టాలి: బీవీ రాఘవులు డిమాండ్



సెమినార్‌లో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

గవర్నర్‌పేట(విజయవాడ), జూలై 14: వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని చెబుతున్న ప్రభుత్వం ఆ అవినీతికి బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో పోలవరంపై సెమినార్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరంపై విడుదల చేసిన శ్వేతపత్రాన్ని సెమినార్‌లో పరిశీలించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ తెలంగాణలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు లోపాలను అనుభవంగా తీసుకుని పోలవరం నిర్మాణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించడంతో పాటు వారి నుంచి నష్టాన్ని రాబట్టాలని కోరారు. పోలవరం నిర్మాణంతో ఎక్కువ నష్టపోతున్నది నిర్వాసితులేనని, వారికి పునరావాసం ఏర్పాట్లు పూర్తిచేశాక పరిహారం చెల్లించాలని, ఆ తరువాతే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని కోరారు. నిర్వాసితుల్లో అధికంగా గిరిజనులు, దళితులే ఉన్నందున పరిహారం చెల్లింపు, పునరావాస కల్పనలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ఆర్థికంగా వెసులుబాటు లేనందున కేంద్రం సహాయం తీసుకోవాలన్నారు. చంద్రబాబు మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నందున ప్రధాని మోదీని డిమాండ్ చేయాలని సూచించారు. సెమినార్‌లో రచయిత ఉమామహేశ్వరి, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, ఆలిండియా న్యాయవాదుల సంఘం కార్యదర్శి మాదవరావు, వివిధ సంఘాల నేతలు రామారావు, హరిబాబు, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కాలేజీలకు వైసీపీ గ్రహణం!

(మొదటి పేజీ తరువాయి)



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో నిర్మాణం ఇంకా పూర్తికాని వైద్య కళాశాల

విరుద్ధంగా చేపట్టారని తెలిసింది. పైగా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. వైద్య సిబ్బంది నియామకాలు పూర్తి చేయలేదు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండానే అడ్మిషన్లకు అనుమతి ఇవ్వాలని ఎన్ఎంసీకి లేఖలు పంపించారు. అయితే, గత ఏడాది అనుమతి పొందిన ఐదు కాలేజీల్లో అరకొర వసతులు ఉన్నప్పటికీ ఎన్ఎంసీ అడ్మిషన్లకు అనుమతులిచ్చింది. కానీ, ఈ ఏడాది 5 కాలేజీలకు అనుమతులు ఇచ్చేందుకు ససేమిరా అంటూ తిరస్కరించింది. రెండో దశలో నిర్మాణంలో ఉన్న ఐదు కాలేజీల్లో జూన్ 24న ఎన్ఎంసీ తనిఖీలు చేపట్టింది. ఎన్ఎంసీ చెక్‌లిస్ట్‌లో ఉన్న 11 పాయింట్లలో ఒక్కదానిలో కూడా ఐదు కాలేజీలకు సరైన మార్కులు రాలేదు. ఐదు కాలేజీల్లో ఇప్పటికీ నిర్మాణాలు పూర్తి కాలేదని, వైద్య సిబ్బంది కొరత 64 శాతంపైన ఉందని, బ్లడ్ బ్యాంక్‌కు అనుమతులు లేవని చెప్పింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పాడేరు, మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల కాలేజీల్లో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఈ నెల 6నే రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ఎంసీ నుంచి లేఖలు వచ్చాయి.

150 నుంచి 100కు

తొలుత ప్రతి కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లకు ప్రవేశాల కోసం ఆరోగ్యశాఖ దరఖాస్తు చేసింది. ఆ తర్వాత ఎన్ఎంసీ కొన్ని కొర్రీలు వేయడంతో పాటు నిబంధనలు మార్చడంతో సీట్ల సంఖ్యను 100కు తగ్గిస్తూ ఆరోగ్యశాఖ అధికారులు మరోసారి దరఖాస్తు చేశారు. కనీసం 50 ఎంబీబీఎస్ సీట్లకు అవసరమైన మౌలిక వసతులు కూడా అందుబాటులో లేకపోవడంతో సీట్లకు అనుమతి ఇవ్వలేమని ఎన్ఎంసీ పేర్కొంది. మొత్తంగా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు కొత్త మెడికల్ కాలేజీలకు శాపంగా మారాయి. దీంతో వైద్యమండలి నిర్ణయంపై కూటమి ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలా? లేదా? అనే విషయంపై తర్జన భర్జన పడుతోంది.

చంద్రబాబుపైనే ఆశలు

రాష్ట్రంలో ప్రతి ఏటా దాదాపు 70 వేల మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. అయితే, వీరిలో కనీసం 10 శాతం మందికి కూడా సీట్లు రావడం లేదు. రాష్ట్రంలో 7 వేల ఎంబీబీఎస్ సీట్లు కూడా అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. ఎంబీబీఎస్ సీట్ల కోసం పోటీ పెరిగినా.. దానికి తగ్గట్టుగా సీట్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కళాశాలల మిగిలిన పనులు పూర్తి చేసి కనీసం 50 ఎంబీబీఎస్ సీట్లకైనా అనుమతి పొందితే.. ఐదు కాలేజీల్లో కలిపి 250 ఎంబీబీఎస్ సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధుల పక్కదారి

గత ప్రభుత్వం అవసరానికి మించిన కాలేజీల నిర్మాణాలు చేపట్టింది. వీటి నిర్మాణానికి దాదాపు రూ.9 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. కానీ, నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలం కావడంతో కాలేజీల నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. 2023, డిసెంబర్ నాటికి అన్ని కాలేజీల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో జాప్యం చేయడంతో పాటు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించడంతో నిర్మాణాలు పూర్తి కాలేదు. పైగా, ఎన్ఎంసీ ఎప్పటికప్పుడు నిబంధనలు మార్చడం కూడా మెడికల్ కాలేజీల అనుమతులకు ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొత్త కాలేజీల నిర్మాణానికి అనుమతులు తీసుకువస్తే మెడికల్ విద్యార్థులకు కొంత మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విశ్వం శూన్యం నుంచి రాలేదు

- హేతువాద సంఘ నాయకుడు డాక్టర్ బాలనాయుని



బాపట్ల, జూలై 14: విశ్వం శూన్యం నుంచి రాలేదని, అకారణంగా విశ్వంలో ఏ సంఘటనా జరగదని హేతువాద సంఘ నాయకుడు డాక్టర్ బాలనాయుని పేర్కొన్నారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో జరుగుతున్న భారత హేతువాద సంఘ 93వ వార్షిక మహాసభలలో భాగంగా ఆదివారం హేతువాద, మానవవాద అధ్యయన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వతత్వం అనే అంశం మీద డాక్టర్ బాలనాయుని మాట్లాడుతూ.. నియమబద్ధ విశ్వపదార్థం శక్తిగా మారుతుందన్నారు. విశ్వపరిణామంలో నూతన నిర్మాణం వచ్చినప్పుడల్లా కొత్త లక్షణాలు వ్యక్తమవుతాయని చెప్పారు. హేతుబద్ధ ఆలోచన-మానవ జీవనతత్వం అంశం మీద తెలంగాణ హేతువాద సంఘ ఉపాధ్యక్షుడు షేక్. నబీ సాహెబ్ మాట్లాడుతూ.. మానవ జీవన విధానం మెరుగుపడాలంటే హేతుబద్ధ ఆలోచన అత్యవసరమన్నారు. తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ మనుషులు సహజంగా హేతుబద్ధ ఆలోచన కలవారని, మతవిశ్వాసాల ప్రభావం వల్ల వారు ఆలోచించలేకపోతున్నారని అన్నారు. భౌతిక వాస్తవిక వాదం- విశ్వతత్వం అనే అంశంపై భారత హేతువాద సంఘ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న మాట్లాడుతూ.. విశ్వం భౌతిక వాస్తవికం అన్నారు. విశ్వానికి ఆది అంతం లేవన్నారు. విశ్వతత్వాన్ని, పరిణామాన్ని అవగాహన చేసుకోవడానికి భౌతిక వాస్తవిక వాదం దారి చూపుతుందన్నారు. కార్యక్రమంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రజలతో జగన్ ముఖాముఖి వాయిదా

- వైసీపీ నేతలతో కూడా..
- అసెంబ్లీ భేటీ సమయంలో కలుస్తానన్న మాజీ సీఎం



అమరావతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పరాజయం తర్వాత ప్రజలనే కాదు.. సొంత పార్టీ నేతలను కలిసేందుకు కూడా వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుముఖత చూపడం లేదని వైసీపీ నాయకులు గుసగుసలాడుతున్నారు. సోమవారం నుంచి తాడేపల్లి ప్యాలెస్ గేట్లు తెరచుకుంటాయని.. ప్రజలు, పార్టీ నేతలు నేరుగా తనను వచ్చి కలుసుకోవచ్చని సన్నిహితులతో ఆయన చెప్పారు. ఈ మాటలను నేతలు సందేహిస్తూనే నమ్మారు. అయితే సోమవారం తనకు వ్యక్తిగత పనులున్నాయని.. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు నేతలకు తెలియజేశారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయం నుంచి కలుస్తానని చెప్పారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలను కలుస్తానని జగన్ సీఎంగా ఉండగా అట్టహాసంగా ప్రకటించారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో రచ్చబండ కూడా నిర్వహిస్తానని.. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని చెప్పారు. కానీ గత ఐదేళ్లలో అదేమీ జరుగలేదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయిన దరిమిలా.. త్వరలోనే రోజూ ఉదయం ప్రజలను కలిసి వినతులు స్వీకరించి ప్రభుత్వంపై పోరాటం చేస్తానని జగన్ పార్టీ ముఖ్య నాయకులకు వెల్లడించారు. అదే సమయంలో వైసీపీ నేతలను కూడా కలిసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాననడంతో.. తమ నాయకుడిలో మార్పు వచ్చిందని వారు సంబరపడ్డారు. అదీ జరుగలేదు. ఆ తర్వాత ప్రజలను కలవడానికి ఈ నెల 15న (సోమవారం) ముహూర్తం పెట్టారు. దాన్ని కూడా వాయిదావేయడంతో ఆయన వన్నీ వట్టి మాటలేనని వారు నిట్టూరుస్తున్నారు.

కులమతాల మధ్య చిచ్చుకు వైసీపీ భారీ కుట్ర

- బ్రాహ్మణ జాతిపై విషం చిమ్ముతున్నారు
- బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్



సిరిపురపు శ్రీధర్

గుంటూరు, జూలై 14: తెలుగు రాష్ట్రాల్లో కులమతాల మధ్య చిచ్చుపెట్టి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. గత పదేళ్ల నుంచి బ్రాహ్మణ జాతిని కక్షపూరితంగా అవమానించడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో విదేశీ సంస్థల కింద పనిచేస్తున్న వారితో సనాతన ధర్మాన్ని మంటగలిపే ప్రక్రియకు వైసీపీ అధిష్ఠానం శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. తెలంగాణలో కంచె ఐలయ్య, బైరి నరేష్, ఏపీలో కత్తి పద్మారావు(పొన్నూరు), పైలా దాస్ (పార్వతీపురం), రామదేవర దాస్(చిత్తూరు) వంటివారు బ్రాహ్మణ, సనాతన ధర్మ వ్యతిరేకులుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ సమాజంలో అలజడులు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. వీరి వెనుక ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, వైసీపీ, కొన్ని వైష్ణవ పీఠాధిపతులు, విదేశీ సంస్థలు ఉండి బ్రాహ్మణ సమాజాన్ని, స్మార్త ఆగమాన్ని కించపరుస్తూ దేవీ, దేవతలను దూషిస్తూ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ జాతిని నిర్మూలిస్తే ఈ దేశంలో సనాతన ధర్మ సంప్రదాయాలను పూర్తిగా కనుమరుగు చేయొచ్చనే ఉద్దేశంతో ఈ కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైష్ణవ పెట్టుడు పీఠాలు, వాటి పీఠాధిపతులు కలసి పైలాదాస్, రామదేవరదాస్ తదితరులను ఎంచుకొని బ్రాహ్మణ జాతిపై, సనాతన ధర్మాలపై సోషల్ మీడియాలో విషం కక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. బ్రాహ్మణ జాతి నిర్మూలనే ధ్యేయంగా వీరు పనిచేస్తున్నారని చెప్పడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి వివాదాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. తక్షణమే ఇటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బ్రాహ్మణ సమాజం మిగిలిన వర్గాలను కలుపుకొని దీనిపై ఎక్కడికక్కడ ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని, బ్రాహ్మణ సమాజం సభ్య సమాజంతో సమష్టిగా ఉద్యమాలు చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

ఒంగోలులో డ్రగ్స్ కలకలం

- అపస్మారక స్థితిలోకి వెళ్లిన విద్యార్థి
- చికిత్స చేయించినా పూర్తిగా కోలుకోని వైనం
- కూల్‌డ్రింక్‌లో కలిపి తాగించారని తల్లిదండ్రుల ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



ఒంగోలు (క్రైం), జూలై 14 : ప్రకాశం జిల్లా ఒంగోలులో డ్రగ్స్ కలకలం రేగింది. ఓ ప్రైవేటు కళాశాలకు సర్టిఫికెట్ల కోసం వచ్చిన ఇంటర్ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడికి వైద్యశాలలో చికిత్స చేయించినా పూర్తిగా కోలుకోలేదు. కూల్‌డ్రింక్‌లో మత్తుపదార్థం కలిపి తాగించారని స్నేహితులపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందరూ విద్యార్థులు కావడంతో పోలీసులు గోప్యంగా విచారణ చేపట్టారు. వివరాలివీ.. నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రమైన ఉలవపాడుకు చెందిన విద్యార్థి ఒంగోలులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. సర్టిఫికెట్లు తీసుకునేందుకు ఆయన ఈనెల 7వతేదీ బస్సులో ఒంగోలు వచ్చాడు. కళాశాల వద్ద అతడు ఒక్కసారిగా అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో స్నేహితులు అతడిని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు వచ్చి కుమారుడిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రెండు రోజులపాటు అక్కడ చికిత్స చేయించిన అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఆ విద్యార్థి పూర్తిగా కోలుకోలేదు. మగతగానే ఉండటంతో అనుమానం వచ్చి శుక్రవారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. పోలీసులు సరిగ్గా స్పందించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయినట్లు వారు చెప్తున్నారు. తిరిగి శనివారం రాత్రి మరోసారి వచ్చి ఫిర్యాదు చేశారు. తమ కొడుకుకు మత్తుపదార్థం తాగించారని ఆరోపించారు. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. తల్లిదండ్రులు తొలిసారి వచ్చినప్పుడు ఫిర్యాదు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పోలీసులు ఏం చెప్తున్నారంటే..

ఉలవపాడు విద్యార్థి ఒంగోలు వస్తున్నట్లు చీమకుర్తి, నగర పరిధిలోని కొప్పోలు, ఇందిరమ్మ కాలనీకి చెందిన ముగ్గురు స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారంతా బస్టాండ్‌కు చేరుకున్నారు. నలుగురూ కలిసి తాము చదువుకున్న కాలేజీకి వెళ్లారు. అక్కడ సర్టిఫికెట్ల గురించి అడగ్గా సిబ్బంది.. 'సదరు సెక్షన్ ఉద్యోగి లేరు, తరువాత రండి' అని చెప్పడంతో వారు మంగమూరురోడ్డులో బీరు, మద్యం కొనుగోలు చేసి సేవించారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ కళాశాలకు వెళ్లారు. అక్కడ ఉలవపాడుకు చెందిన విద్యార్థి అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కాగా, విద్యార్థులు మద్యంలో డ్రగ్స్ కలిపి తాగించినట్లు ఇంకా నిర్ధారణ కాలేదని ఒంగోలు వన్‌టౌన్ సీఐ అలీసాహెబ్ తెలిపారు. ఉలవపాడుకు చెందిన విద్యార్థి మద్యంలో నీళ్లు కూడా కలుపుకోకుండా తాగినట్లు అతడి స్నేహితులు చెప్తున్నారన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

- ఎర్రచందనం స్మగ్లర్లపై కూడా..
- పిల్లలు, మహిళలకు పటిష్ఠ భద్రత : డీజీపీ



కాణిపాక ఆలయంలో డీజీపీ దంపతులు

ఐరాల(కాణిపాకం), జూలై 14: ఎర్రచందనం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ద్వారా స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా చిత్తూరు జిల్లా కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని కేసులను సమర్థంగా విచారించడానికి పోలీసులు శక్తివంచన లేకుండా శ్రమించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలుతున్న మద్యాన్ని అడ్డుకుంటామన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని వివరించారు. దీనికోసం చెక్ పోస్టులను బలోపేతం చేసి, వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్నపిల్లలు, మహిళల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని వెల్లడించారు. నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత పెంచుతామన్నారు. నేరాలను అదుపులో ఉంచేందుకు సీసీ కెమేరాలు, డ్రోన్లు, డిజిటల్ ఫోరెన్సిక్ పరికరాలను విస్తృతంగా వినియోగిస్తామని చెప్పారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. కాగా, ఆదివారం ఉదయం డీజీపీ దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

గంజాయి ముఠా అరెస్టు



జగన్, మోపిదేవితో గంజాయి ముఠాలోని ఆళ్ల రాజ్‌పాల్ (ఫైల్)

రేపల్లె, జూలై 14: రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానది వద్ద వైసీపీ నాయకులు, మరికొంతమందితో కలిసి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ పెనుమూడి వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం తెలియడంతో పట్టణ సీఐ నీజర్‌బేగ్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటుచేసి 10 మందిని అరెస్టు చేశామన్నారు. ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుంచి 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పరస రాజ్‌కుమార్, తోట .ధనుష్‌కుమార్, తోట అనిల్‌కుమార్ అరకు, పాడేరులో గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయాలు జరుపుతురని పేర్కొన్నారు. కాగా.. వైసీపీ నాయకుడు ఆళ్ల రాజ్‌పాల్, బంటి పరారీలో ఉన్నారని తెలిపారు.

పసికందుపై పైశాచికం

- నెలల శిశువుపై తాత వరసయ్యే వక్తి అత్యాచారం



నిందితుడు ఎరకందొర

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ రామభద్రపురం/ బాడంగి, విజయనగరం రింగురోడ్డు, జూలై 14: ఉయ్యాలలో నిద్రిస్తున్న ఆరు నెలల నెలల పసికందుపై ఓ ఉన్మాది అమానుషంగా ప్రవర్తించాడు. తాత వరసైన వ్యక్తి శిశువుపై పైశాచికానికి పాల్పడిన ఘటన విజయనగరం జిల్లాలో శనివారం జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని ఓ గ్రామంలో శనివారం ఓ తల్లి తన ఆరు నెలల పసికందును కింద పడుకోబెట్టి, ఇంటి బయట పనులు చేసుకుంటోంది. అంతలో ఇంటికి వచ్చిన బాలికకు తాతయ్య వరసైన ఎరకందొర చిన్నారిపై అత్యాచారయత్నం చేశాడు. ఒక్కసారిగా ఆ చిన్నారి పెద్దగా ఏడ్చింది. కేకలు విన్న తల్లి పరుగున వచ్చింది. శిశువుకు తీవ్ర రక్తస్రావం కావడం గమనించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఎరకందొర అత్యాచారయత్నం చేశాడని భావించి నిందితుడిపై కర్రతో దాడిచేసింది. అంతలో ఆమె బంధువులు కూడా అక్కడికి చేరుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితుడు పరారయ్యాడు. శిశువు తల్లి శనివారం సాయంత్రం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. చిన్నారిని తొలుత బాడంగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం, వైద్యుల సూచనతో బాలికను శనివారం రాత్రి విజయనగరం ఘోషాసుపత్రికి తీసుకెళ్లారు. నిందితుడిని పోలీసులు ఆదివారం ఉదయం స్వగ్రామంలో అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. విజయనగరం ఆసుపత్రిలో ఉన్న చిన్నారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాలు, వామపక్ష, మహిళా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తనకు అప్పగిస్తే ఒక్కవేటుతో నరుకుతా: నిందితుడి తండ్రి

మనవరాలి వరసైన చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన తన కొడుకు ఎరకందొరను తనకు అప్పగిస్తే కత్తితో ఒక్కవేటుతో నరుకుతానని నిందితుడి తండ్రి ఎర్రయ్యదొర పోలీసుల ముందు అన్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ మొదటి నుంచి చెడు తిరుగుళ్లకు అలవాటు పడ్డాడని, కొడుకు మూలంగా తన కుటుంబానికి చెడ్డపేరు వచ్చిందని, ఇటువంటి వ్యక్తికి సమాజంలో తిరిగే హక్కులేదని అన్నట్లు డీఎస్పీ చెప్పారు.

నిందితుడికి శిక్ష పడేలా చూస్తాం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువును ఆదివారం పరిశీలించారు. పాప బంధువులను కలిసి ఓదార్చారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా పాప బంధువులను పరామర్శించారు.

నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దు ప్లీజ్: మంత్రి సంధ్యారాణి

అత్యాచార ఘటనలో నిందితుడికి న్యాయవాదులు బెయిలిచ్చి మృగాన్ని బయటకు పంపవద్దని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం ఘోషాసుపత్రికి వెళ్లి శిశువు ఆరోగ్యంపై ఆరా తీశారు. బంధువులను పరామర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ, న్యాయవాదులను తాను రిక్వెస్ట్ చేస్తున్నానంటూ బెయిల్ ఇవ్వొద్దని కోరారు. శిశువు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. చిన్నారిపై అఘాయిత్యం జరిగిన విషయం తెలుసుకున్న హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడారు.

బాలికపై అత్యాచారయత్నం

- కామాంధుడికి దేహశుద్ధి

నార్పల, జూలై 14: అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో జిరాక్స్ సెంటర్ యజమాని నాగరాజు (45) ఆదివారం ఎనిమిదో తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి యత్నించాడు. విద్యార్థిని ఆధార్ కార్డు జిరాక్స్ చేయించుకునేందుకు నార్పలలోని మసీదు వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వెళ్లింది. షాపు యజమాని నాగరాజు.. విద్యార్థినిని లోపలకి రా అంటూ తీసుకెళ్లి, అసభ్యంగా ప్రవర్తించాడు. అత్యాచారానికి యత్నించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి పరుగులు తీసింది. విషయాన్ని కుటుంబీకులకు తెలిపింది. కుటుంబీకులు, బంధువులు జిరాక్స్ సెంటర్ వద్దకు చేరుకుని, నాగరాజుకు దేహశుద్ధి చేశారు.



మహారాష్ట్ర సీఎం షిండేతో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్

మహారాష్ట్ర సీఎం షిండేతో చంద్రబాబు భేటీ

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏకనాథ్ షిండేతో సీఎం చంద్రబాబు ముంబైలో భేటీ అయ్యారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్నకుమారుడి వివాహ వేడుకలకు హాజరైన చంద్రబాబు.. ఆదివారం ఉదయం 10 గంటలకు షిండే ఆహ్వానం మేరకు ఆయన అధికారిక నివాసం 'వర్ష'కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పలు రంగాల్లో పరస్పర సహకారం, మౌలిక వసతుల కల్పన, ఆర్థికపరమైన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, మహారాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి దాదా భూసే, షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే పాల్గొన్నారు. సుమారు అర్ధగంట సేపు చర్చలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సామాజిక, సాంస్కృతిక వ్యవహారాల్లో రెండు రాష్ట్రాలూ సహకరించుకోవాలని నిర్ణయించారు. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు డిజిటల్ రంగంలో అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సీఎంలు అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. చంద్రబాబుతో సమావేశమైన ఫోటోలను షిండే ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు.

సుసంపన్న ఆర్థిక వ్యవస్థకు 'ఇంధన సామర్థ్యం'!

- ఇంధన పొదుపు విధానాలు అమలు చేస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): సుసంపన్న ఆర్థిక వ్యవస్థకు ఇంధన సామర్థ్య కార్యక్రమం దోహదపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంధన పొదుపు సామర్థ్య విధానాలను కొనసాగిస్తామని, హరిత ఇంధనోత్పత్తిని పెంచుతూ వాతావరణ పరిరక్షణ చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఏపీలో మిషన్ లైఫ్ కార్యక్రమానికి సంబంధించి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్రం సహకారంతో బీఈఈ అమలు చేస్తున్న సుస్థిర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇంధన సామర్థ్యాల పెంపులో రాష్ట్రాన్ని భాగస్వామ్యం చేస్తూ కేంద్రం కొనసాగిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేస్తామని వెల్లడించారు.

ఆహ్వానం లేకుండా అంబానీ పెళ్లికి..

- ఇద్దరు ఏపీ యువకులు అరెస్ట్

ముంబై, జూలై 14: రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుక కన్నుల పండుగగా జరిగింది. ప్రపంచంలో పేరుగాంచిన సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులెందరో ఈ పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. ముంబైలోని జియో కన్వెన్షన్ సెంటర్‌లో అతిరథ మహారథుల మధ్య అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగిన ఈ వేడుకల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వాసులు ఆహ్వానం లేకుండా పాల్గొనేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. నిందితుల్లో ఒకరిని యూట్యూబర్ వెంకటేశ్ (26)గా, మరొకరిని వ్యాపారవేత్తగా చెప్పుకుంటున్న షేక్ మహ్మద్ షఫీ (28)గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు ఈ ఇద్దరూ ఏపీ నుంచి ముంబై వచ్చారని, ఆహ్వానం లేకుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిద్దరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వారిని భద్రతా సిబ్బంది అడ్డగించి పోలీసులకు అప్పగించారు. దీంతో వారిని బీకేసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేశారు.

అన్నదాతలకూ దగా

- జగన్ సర్కారు బీమా బకాయిలు
- 2022-23లో రైతులకు 1,384 కోట్లు
- బీమా కంపెనీలకు 1,251 కోట్లు
- ఎన్నికల ముందు పెండింగ్ తంతు
- కూటమి ప్రభుత్వంపై ఇదో భారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



పలు శాఖల్లో బిల్లులు పెండింగ్ పెట్టిన జగన్ సర్కార్.. చివరకు రైతులకు సంబంధించిన పథకాలకూ బకాయిలు చెల్లించలేదు. రైతులకు పంటల బీమా కింద గత రెండేళ్లలో రూ.1,384.6 కోట్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది. బీమా అమలు చేసే కంపెనీలకూ చివర్లో రూ.1,251.6 కోట్లు చెల్లించలేదు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నామని ఊదరగొట్టిన వైసీపీ పాలకులు.. ఐదేళ్లలో ఖరీఫ్ పంటలకు బీమా పరిహారం అందించడానికి అపసోపాలు పడ్డారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన పంటల బీమా విధానాన్ని కాదని, జగన్ సర్కార్ సొంతంగా బీమా అమలు చేసి, ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడేలా చేసింది. కేంద్రంతో పని లేకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పంటల బీమా కంపెనీ పెట్టాలని వైసీపీ సర్కార్ చూసింది. కానీ కేంద్రం, ఆర్బీఐ అనుమతి ఇవ్వకపోవడంతో ఆ ప్రతిపాదనను విరమించుకుంది. వాస్తవంగా రాష్ట్రంలో 2016కు ముందు జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్ఏఐఎస్), పునరుద్ధరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) రైతులకు అమలయ్యేవి. 2016లో కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ప్రారంభించాక.. 2015-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సమాంతరంగా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్, పీఎంఎఫ్‌బీవై అమలు చేసింది. పంటల బీమాలో రైతుల వాటాను ఖరీఫ్‌లో 2%, రబీలో 1.5%, వాణిజ్య పంటలకు 5% చెల్లిస్తే.. మిగతా ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా రైతుకు సబ్సిడీ కింద భరించేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 ఖరీఫ్‌లో రైతు ఒక్క రూపాయి చెల్లిస్తే.. ఉచిత పంటల బీమా అమలు చేస్తామని జగన్ సర్కార్ గొప్పగా ప్రకటించింది. కానీ ఈ విధానంలో చాలా మంది రైతులకు ఫలితం దక్కలేదు. డేటా లోపాల వల్ల సమస్య ఉత్పన్నమైందని గుర్తించి, ఈ-క్రాప్ డేటాతో పంటల బీమాను లింక్ పెట్టి కొన్ని క్లైములు పరిష్కరించింది. తర్వాత సొంతంగా బీమా కంపెనీ తెరవాలని ప్రయత్నించింది. పీఎంఎఫ్‌బీవైలో చేరకుండా 2020 ఖరీఫ్ నుంచి 2021 వరకు ఈ-క్రాప్ డేటా ఆధారంగా జగన్ సర్కార్ సొంతంగా పంటల బీమా అమలు చేసి చేతులు కాల్చుకుంది. నష్టాన్ని తగ్గించుకోవటానికి తిరిగి పీఎంఎఫ్‌బీవైలో భాగస్వామ్యమైంది. కానీ ఐదేళ్లలో రబీ పంటలకు బీమా వర్తింపజేయకుండా, ఖరీఫ్ పంటలకే పరిమితమైంది. అదీ కూడా అన్ని పంటలకు అమలు చేయలేదు. ఖరీఫ్‌లో 14 వ్యవసాయ, 7 ఉద్యాన పంటలకు మాత్రమే అమలు చేసింది.

చివరిలో నాటకాలు

2022 ఖరీఫ్, 2022-23 రబీ, 2023 ఖరీఫ్ సీజన్లలో పంటల బీమా అమలుకు రైతు వాటాగా రూ.1,299.9 కోట్లు, రాష్ట్ర వాటా రూ.1,486.3 కోట్లు కలిపి రూ.2,786.2 కోట్లు బీమా కంపెనీలకు గత ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది. ఇందులో 2022 ఖరీఫ్‌కు సంబంధించి రైతుల వాటా కింద రూ.470.1 కోట్లు, రాష్ట్ర వాటా కింద రూ.741.2 కోట్లు కలిపి రూ.1,211.4 కోట్లు మాత్రమే జగన్ సర్కార్ కంపెనీలకు చెల్లించింది. 2022-23 రబీ, 2023 ఖరీఫ్‌కు సంబంధించి రైతుల వాటా రూ.507.2 కోట్లు, రాష్ట్ర వాటా రూ.744.4 కోట్లు కలిపి రూ.1,251.5 కోట్లు బీమా కంపెనీలకు బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. దీంతో 2022-23 రబీలో పీఎంఎఫ్‌బీవై కింద రూ.105.8 కోట్లు, 2023 ఖరీఫ్‌లో పీఎంఎఫ్‌బీవై కింద రూ.319.8 కోట్లు, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద రూ.959 కోట్లు కలిపి మొత్తం రూ.1,384.6 కోట్లు బీమా కంపెనీలు రైతులకు చెల్లించాల్సి ఉందని తాజా సమాచారం. సార్వత్రిక ఎన్నికల ముందు 2022 ఖరీఫ్ పంటల బీమా పరిహారాన్ని అందించిన జగన్ సర్కార్.. 2022-23 రబీ, 2023 ఖరీఫ్ బీమాను ఎన్నికల తర్వాత అమలు చేస్తామని ప్రకటించింది. వైసీపీ ఓడిపోవడంతో ఈ చెల్లింపుల భారం కూటమి సర్కార్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పాత పద్ధతిలో బీమా

రాష్ట్రంలో 2024-25, 2025-26లో ఉచిత పంటల బీమా అమలు కోసం వ్యవసాయ శాఖ డబ్ల్యూబీసీఐఎస్, పీఎంఎఫ్‌బీవై కింద టెండర్లు వేసింది. బీమా కవరేజ్‌పై మూల్యాంకనం పూర్తైంది. దేశంలోనే అతి తక్కువ ప్రీమియం రేట్లను పొందింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. అయితే జగన్ సర్కార్‌లా కాకుండా పాత పద్ధతిలో పంటల బీమా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ విధివిధానాలను రూపొందిస్తున్నట్లు సమాచారం.

'జర్మన్ వర్సిటీ' జంతర్‌మంతర్!

(మొదటి పేజీ తరువాయి)

చదువుకునేందుకు మార్గం సుగమం చేయడం దీని ఉద్దేశం. ఇందుకోసం పలుమార్లు జర్మనీ యూనివర్సిటీలతో ఆన్‌లైన్ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులు నిర్వహించేందుకు ఆ యూనివర్సిటీలకు, ఉన్నత విద్యామండలికి మధ్య 'జర్మన్ వర్సిటీ' వేదికగా వ్యవహరించింది. అది కేవలం ఒక వెబ్‌సైట్ మాత్రమే. కానీ దానినే ఒక యూనివర్సిటీ అన్నట్టుగా ఉన్నత విద్యామండలి ప్రచారం చేసింది. ఆ వెబ్‌సైట్ కూడా తమది ఒక యూనివర్సిటీ అన్నట్టుగా ప్రచారం చేసుకుని లబ్ధి పొందింది. ఆ వెబ్‌సైట్‌కు, హేమచంద్రారెడ్డికి మధ్య సంబంధం ఏంటి? అని ఆరా తీస్తే.. ఆ జర్మన్ వర్సిటీ అధినేత గోదావరి జిల్లాలకు చెందిన వ్యక్తి అని తెలిసింది. పేరుకు జర్మన్ వర్సిటీ అని పెట్టుకున్నా గత ప్రభుత్వంలో ఆయన ఎక్కువగా ఉన్నత విద్యామండలిలోనే ఉండేవారు. జర్మనీకి చెందిన పలు యూనివర్సిటీలతో చేసుకున్న ఒప్పందాలకు ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారు. ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన్ను ఎందుకు మధ్యవర్తిగా పెట్టారన్న విషయాన్ని అప్పటి చైర్మన్ రహస్యంగా ఉంచారు. ఆన్‌లైన్‌లో సదస్సులు నిర్వహించినందుకు ఉన్నత విద్యామండలి బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. అలాగే జర్మనీకి వెళ్లాలనుకునే విద్యార్థులకు కోర్సులు అందిస్తామంటూ సదరు వ్యక్తి లబ్ధి పొందారు. అంతటితో ఆగకుండా ఉన్నతాధికారులు, కొన్ని యూనివర్సిటీల వీసీలు, హేమచంద్రారెడ్డి లాంటి వారిని జర్మనీ పర్యటనకు తీసుకెళ్లారు. పేరుకు అధికారిక పర్యటన అయినా అది ఆసాంతం వ్యక్తిగతంగానే సాగింది. పర్యటన అనంతరం ఏయే ఒప్పందాలు చేసుకున్నారని మీడియా ప్రతినిధులు అడిగినా అప్పటి చైర్మన్ సమాధానం ఇవ్వలేదు. ఉన్నత విద్యామండలి నిధులు మాత్రం దుర్వినియోగం చేశారు. ఈ ప్రభుత్వంలోనూ ఉన్నత విద్యామండలిలో మళ్లీ చక్రం తిప్పేందుకు ఆ లేని యూనివర్సిటీ యజమాని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ద్వారా మళ్లీ ఆన్‌లైన్ సదస్సులంటూ ఒప్పందాలు చేసుకోవాలని చూస్తున్నారు.

నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు

- ఎన్టీఆర్, కృష్ణా, గోదావరి, ఏలూరు జిల్లాలకు హెచ్చరిక
- ఈ సీజన్‌లో 42% అధిక వర్షపాతం

అమరావతి/తిరుమల/విశాఖపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, ఒడిశా పరిసరాల్లో సముద్రమట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది నైరుతి దిశగా ఒంగి ఉంది. మరోవైపు కోస్తాంధ్రకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న మరో ఆవర్తనం దీనిలో విలీనమైంది. ఇంకోవైపు కేరళ నుంచి గుజరాత్ వరకు అరేబియా సముద్ర తీరం వెంబడి ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. రాష్ట్రంలోని అనేకచోట్ల ఆదివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువ చోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో కృష్ణా, ఎన్టీఆర్, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. గత 48 గంటలుగా రాష్ట్రంలో విస్తారంగా వానలు పడుతున్నాయి. గరిష్ఠంగా కల్యాణదుర్గంలో 42, పాడేరులో 36, చింతపల్లిలో 35, నాగాయలంకలో 28, నిజాంపట్నంలో 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ వర్షాలతో ఖరీఫ్ పైర్లకు జీవం లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 42.1% అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 12లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులోకి వచ్చాయి. గతేడాది ఇదే సమయంతో పోల్చితే, 3 లక్షల ఎకరాలు అధికంగా సాగులోకి వచ్చింది. లక్షన్నర ఎకరాల్లో చిరుధాన్యాలు వేయగా, 1.25లక్షల ఎకరాల్లో కంది, మినుము, పెసర వంటి అపరాల పంటలు వేశారు. లక్ష ఎకరాలపైగా వేరుశనగ పడింది.

తిరుమలలో కూలిన భారీ వృక్షం

తిరుమలలో ఆదివారం ఓ భారీ వృక్షం నేలకూలింది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు తిరుమలలో వర్షం కురిసింది. దీంతో పాటు భారీగా ఈదురుగాలులు వీయడంలో బాటగంగమ్మ ఆలయ సమీపంలోని కారు పార్కింగ్‌లో ఉన్న ఓ భారీ వృక్షం కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే చెట్టు కొమ్మలు పడి రెండు టెంపో ట్రావెలర్ వాహనాలు, ఓ కారు ధ్వంసమయ్యాయి. అలాగే పలు ప్రాంతాల్లో కూడా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా అటవీ అధికారులు, సిబ్బంది.. చెట్లు, కొమ్మలను వేగవంతంగా తొలగించారు.



తిరుమలలో కూలిన భారీ వృక్షం

బ్యూటీ పేరుతో లూటీ!

(మొదటి పేజీ తరువాయి)

నియమించుకున్నారు. సుమారు 70మంది సిబ్బందిని నియమిస్తే.. అందులో సగంమంది ఆయన వందిమాగధులే. నిబంధనలకు తిలోదకాలిచ్చి బినామీ కాంట్రాక్టర్లను పెట్టుకుని గ్రీనింగ్ కార్పొరేషన్ నిధులన్నీ స్వాహా చేసేశారు. మునిసిపల్ శాఖలో అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి అండదండలతో ఆయన అక్రమాలకు అడ్డులేకుండా పోయింది. ఇంత అవినీతికి పాల్పడిన అధికారి ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అదే పదవిలో కొనసాగేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన నిధులను ఈ అధికారి దారిమళ్లించి ఖజానాను ఖాళీ చేశారు. టిడ్కో ఇళ్ల వద్ద గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కోసం ఏపీ టిడ్కో ఇచ్చిన సొమ్మును అడ్డగోలుగా వాడేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే 30మంది సిబ్బందిని అర్హత లేకపోయినా నియమించి వారివద్ద లంచాలు తీసుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గత చంద్రబాబు హయాంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లను సైతం డ్రా చేసి వాడేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే కార్పొరేషన్ ఉద్యోగులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో సంస్థ నిధులు రూ.లక్షలు జేబులో వేసుకున్నారు. తన అవసరాలకు ఎప్పుడంటే అప్పుడు ఉద్యోగుల పేరు మీద చెక్ రాసి డబ్బులు డ్రా చేస్తున్నారని చెబుతున్నారు. వైజాగ్ రుషికొండ గ్రీనరీ ప్లాంటేషన్ కూడా రూ.8కోట్ల బడ్జెట్‌తో కాంట్రాక్టర్ ఈయన ఆధ్వర్యంలోనే చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తవ్వుతున్న కొద్దీ ఆయన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

అవినీతి చిట్టా ఇదీ...

- విశాఖలో జీ-20 సదస్సు నిర్వహించిన సమయంలో రూ.20కోట్ల పనుల టెండర్లను నిబంధనలు అతిక్రమించి తన బినామీకి ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వైజాగ్‌లో తిష్టవేసి మరీ రూ.100 విలువజేసే మొక్కలకు రూ.1,000 బిల్లు పెట్టి భారీగా సొమ్ము చేసుకున్నారు. మొక్కలతో పాటు విద్యుత్తు లైటింగ్‌లో కూడా రూ.కోట్లు దండుకున్నారు.
- తాడేపల్లిలో అప్పటి సీఎం జగన్ క్యాంప్ ఆఫీస్ రోడ్డు 2కి.మీ. సుందరీకరణ కోసం రూ.8కోట్ల పనులను బినామీ కాంట్రాక్టర్ పేరిట దక్కించుకొని ఈయనే నిర్వహించారని ఆరోపణలు ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా చెక్‌పవర్ ఇచ్చి నిధులు డ్రా చేశారు.
- కేంద్ర పథకం అమృత్ 2.0 ద్వారా రాష్ట్రంలోని 80 పార్కుల్లో గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ పనులు ప్రారంభించారు. ఈ పనులు 50శాతం కూడా పూర్తి కాకుండానే నూరు శాతం అయినట్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఎంబుక్ రికార్డ్ చేసి నిధులు స్వాహా చేశారు.
- విజయవాడ నుంచి గన్నవరం వరకు ఎయిర్‌పోర్టు రోడ్డు గ్రీనరీ వర్క్‌ని కూడా తన బినామీ కాంట్రాక్టర్‌కే దక్కేలా నిబంధనలు రూపొందించి పనులు దక్కించుకున్నారు. అంబేడ్కర్ స్మృతివనం సుందరీకరణ పనుల్లో కూడా భారీగా సొమ్ము చేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి.
- పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో చేసిన పనుల్లో కూడా అధిక రేట్లకు మొక్కలు కొనుగోలు, బినామీ కాంట్రాక్టర్లతో ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టడం, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ పనుల్లో భారీగా సొమ్ము చేసుకున్నారు.
- కార్పొరేషన్లకు మొక్కలు పెంచేందుకు ఉన్న మూడు నర్సరీల నిర్వహణ కాంట్రాక్టర్‌గా తన అనుచరుడిని పెట్టుకుని భారీగా నిధులు మింగేస్తున్నారు.
- పార్కుల్లో పిల్లలు ఆడుకునే ఎక్విప్‌మెంట్లు, జిమ్ సామగ్రి, పైపులు, డ్రిప్ పనులకు సంబంధించి ప్రభుత్వ రేట్ల కంటే నూరుశాతం అదనంగా కోట్ చేసి కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చి, ముడుపులు జేబులో వేసుకున్నారు. ఈ పనుల నిర్వహణలో ఎలాంటి నిబంధనలు పాటించలేదు.
- ఆర్టీసీలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈకి ఎస్ఈగా పదోన్నతి కల్పించి తన ఇష్టం వచ్చినట్లు పనులు కానిచ్చేస్తూ, కార్పొరేషన్‌కు చెందిన రూ.కోట్ల నిధులు కాజేస్తున్నారని విమర్శలున్నాయి.

ప్రియురాలు చెప్పిందని..

- భార్య, ఇద్దరు పిల్లలను చంపిన వైద్యుడు
- విషపు ఇంజెక్షన్‌తో భార్య ప్రాణాలు తీసి.. కుమార్తెలను ముక్కు, నోరు మూసి హత్య
- కారును చెట్టుకు ఢీకొట్టి ప్రమాదంగా ప్రచారం
- 48 రోజుల తర్వాత వీడిన మిస్టరీ.. భర్త అరెస్టు



చిన్నారులు కృతిక, కృషిక (ఫైల్)

రఘునాథపాలెం, జూలై 14: కట్టుకున్న భర్తే వైద్యుడు! తనకొచ్చిన జ్వరం నయమయ్యేందుకు ఇంజెక్షన్ చేస్తానంటే అతడిని ఆమె ఎలా అనుమానిస్తుంది? భార్యను చంపేందుకు ఎప్పుడో పథకం వేసి, అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆ భర్త విషపు ఇంజెక్షన్‌ను ఇచ్చి ఆమె ప్రాణాలు బలిగొన్నాడు. తర్వాత తన కన్నబిడ్డలిద్దరినీ ముక్కూ నోరు మూసి చంపేశాడు. ఈ మూడు హత్యల్నీ ప్రమాదవశాత్తు జరిగిన మరణాలుగా చిత్రీకరిస్తే చాలు.. తననెవ్వరూ పట్టుకోలేరని భావించాడు. రోడ్డు ప్రమాదం జరిగినట్టు, ఆ ప్రమాదంలోనే భార్యాపిల్లలు చనిపోయినట్లు సీన్ క్రియేట్ చేశాడు. అయితే ఘటన జరిగిన 48 రోజుల తర్వాత అతడి దుర్మార్గం బట్టబయలైంది. మరో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆ వైద్యుడు, తన ఆ ఆనందానికి భార్యాబిడ్డలు అడ్డుగా ఉన్నారని భావించి ఈ ఘోరానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో రోడ్డు ప్రమాదం-ముగ్గురి మరణం ఘటన వెనుక మిస్టరీ వీడింది. ఖమ్మం ఏసీపీ రమణమూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రామ్‌నగర్‌కు చెందిన కుమారి(28)కి రఘునాథపాలెం మండలం బావోజీ తండాకు చెందిన డాక్టర్ బోడా ప్రవీణ్‌తో 2019లో వివాహం జరిగింది. ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనస్థిషియా వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ప్రవీణ్-కుమారి దంపతులకు కూతుళ్లు క్రుషిక (5), కృతిక (3) ఉన్నారు. కుటుంబంతో కలిసి ప్రవీణ్ హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. ఆస్పత్రిలో రాత్రిపూట విధులు నిర్వహించే ప్రవీణ్‌కు అక్కడే పనిచేస్తున్న కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే యువతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ సంగతి భార్య కుమారికి తెలియడంతో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ గొడవలు సోనీకి చికాకు తెప్పించాయి. భార్యాపిల్లలను అడ్డుతొలగించుకుంటే ఇద్దరం ప్రశాంతంగా ఉండొచ్చని ప్రవీణ్‌కు చెప్పింది. దీంతో ప్రవీణ్ భార్య, పిల్లల హత్యకు పథకం వేశాడు. మే నెలలో పది రోజులు ప్రవీణ్ సెలవు పెట్టి భార్యాపిల్లలను వెంటబెట్టుకొని బావోజీ తండాకు వచ్చాడు. మే 28న ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాల్సి ఉందంటూ భార్యాపిల్లలను వెంటబెట్టుకొని కారులో ఖమ్మానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కుమారి.. తనకు అనారోగ్యంగా ఉందని చెప్పడంతో బల్లేపల్లి సెంటర్‌లోని ఓ మెడికల్ షాపు వద్ద కారు ఆపాడు. అక్కడ.. క్యాల్షియం ఇంజెక్షన్‌తో పాటు మరో ఇంజెక్షన్‌నూ కొనుగోలు చేశాడు. మూడు కి.మీ దూరం వెళ్లాక కోయచెలక సమీపంలో కారు ఆపాడు. భార్యను వెనుక సీట్లో పడుకోబెట్టి రెండు ఇంజెక్షన్లు ఇచ్చాడు. వెంటనే కుమారి స్పృహ కోల్పోయింది. తర్వాత.. ఒకరు తర్వాత మరొకరుగా ఇద్దరు చిన్నారులను ముక్కు, నోరు మూసి శ్వాస ఆడకుండా చేసి హత్య చేశాడు. కొద్దిసేపటికి కుమారి కూడా చనిపోయిందని నిర్ధారించుకున్నాక కారు ఎడమవైపు దెబ్బతినేలా పథకం ప్రకారం రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టాడు.

కారులో దొరికిన ఖాళీ సిరంజ్ ఆధారంగా

తమ కూతురు, మనుమరాళ్ల మృతి విషయంలో అనుమానాలున్నాయని కుమారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు కారులో ఖాళీ సిరంజి దొరికింది. కుమారి మృతదేహం చేతికి చిన్న చిన్న మచ్చలు ఉండటంతో అవి ఇంజెక్షన్లు కావొచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా ముగ్గురిది హత్య అని తేలింది.

సర్వం స్వాహా!

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయని ఆ శాఖ సీఎంను కోరనుంది. గనుల శాఖ తయారు చేసిన నివేదికలో అనేక కీలకమైన అంశాలను పొందుపరిచింది. 2019-24 మధ్యకాలంలో జగన్ పాలనలో సమర్థులు, నైపుణ్యం ఉన్నవారిని కాకుండా అస్మదీయులను తీసుకొచ్చి గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించడం మొదలు, అనేక అక్రమాలు, అవినీతి బాగోతాలు గనుల శాఖలో జరిగిపోయాయి. ఫలితంగా 19,137 కోట్ల అక్రమాలు జరిగాయని గనుల శాఖ చెబుతోంది. అసమర్థ పరిపాలన వల్ల ఐదేళ్లలో 9,750 కోట్ల నష్టం వాటిల్లిందని ఆ శాఖ చెబుతోంది. 2016 నుంచి అమల్లో ఉన్న ఉచిత పాలసీని రద్దు చేయడం, అడ్డగోలు ఇసుక తవ్వకాల వల్ల సర్కారుకు 6,940 కోట్ల నష్టం జరిగిందని పేర్కొంది. తెలుగుదేశం ప్రభుత్వంలో ఉచిత ఇసుక అమలైన ప్పుడు రీచ్‌లో టన్ను ఇసుక 75 రూపాయలు ఉంటే.. జగన్ సర్కారు తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీలో దాన్ని రూ.475 చేశారని, ఆచరణలో టన్నుకు వెయ్యి రూపాయలపైనే వసూలు చేశారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

గనుల శాఖ అంచనా ప్రకారం ఐదేళ్ల నష్టం లెక్క

కేటగిరీ	నష్టం (రూ.కోట్లలో)
అసమర్థ ఖనిజ నిర్వహణ పాలన	9750
ఉచిత ఇసుకను రద్దు చేసి అడ్డగోలు దందా	6940
ఇసుక కాంట్రాక్టర్లు చెల్లించని బకాయిలు	1167
మినరల్ పర్మిట్లను ఔట్‌సోర్సింగ్ ఇవ్వడం వల్ల	1000
సీనరేజీ కాంట్రాక్టర్లు చెల్లించని బకాయిలు	280
మొత్తం నష్టం	19,137

పర్యావరణ విధ్వంసం ఎంతెంతో...

గత ఐదేళ్లలో ఇసుక, ఇతర ఖనిజాల తవ్వకాల్లో పెద్దఎత్తున పర్యావరణ విధ్వంసం జరిగిందని గనుల శాఖ సీఎంకు నివేదించనుంది. ఇసుక తవ్వకాల్లో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయని నివేదికలో పేర్కొంది. చట్టవిరుద్ధమైన తవ్వకాలు నిలిపివేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ), హైకోర్టు, సుప్రీం కోర్టు ఆదేశించినా ప్రైవేటు సంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరించాయని నిర్ధారించింది.

భూ దందా కేరాఫ్ విశాఖ

రాష్ట్రంలో సహజవనరు అయిన భూమిని గత వైసీపీ పాలకులు చెరపట్టారు. మూడు రాజధానులు అంటూ అమరావతి పరిధిని కుదించి దాని చుట్టుపక్కల వేల ఎకరాల పట్టాభూములు, అసైన్డ్, చుక్కల భూములు చేజిక్కించుకున్నారు. విశాఖే కార్యనిర్వాహక రాజధాని అంటూ ఉమ్మడి విశాఖ జిల్లా, విజయనగరం చుట్టూ విలువైన భూములు హస్తగతం చేసుకున్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్ బంధుగణం, సన్నిహితులు, ఆయన సకల పరివారం, మంత్రులు, వారి అనుచరగణం, ప్రభుత్వంలో నాడు కీలక స్థానాల్లో ఉన్న అధికారులు అత్యంత విలువైన భూముల్లో పాగా వేశారు. నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జవహర్‌రెడ్డి మేనల్లుడు, వారసుడు, కీలక అధికారి ధనుంజయ్‌రెడ్డి బంధువులు కూడా విశాఖ పరిసరాల్లో ఖరీదైన భూములు కారుచౌకగా కొన్నారని అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. డజను మంది అఖిల భారత సర్వీసు అధికారులు తమ పదవులను అడ్డంపెట్టుకొని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా తక్కువ ధరకే విలువైన భూములు దక్కించుకున్నారని ఫిర్యాదులున్నాయి. జగన్ పాలనలో జరిగిన భూదందాపై రెవెన్యూ శాఖ ఇప్పటికే రెండు దఫాలుగా నివేదికలు సీఎంకు సమర్పించింది. అయితే వాటిలో వైసీపీ నేతల భూ దందాకు సంబంధించిన ప్రస్తావనే లేదు. ఏ ఒక్కరి అక్రమం గురించి నివేదించలేదు. మరి చివరిగా సమర్పించే నివేదికలో అయినా విశాఖలో వైసీపీ పెద్దలు చేసిన భూ దందాను ప్రస్తావిస్తారా? వివరాలు సమర్పిస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ, విజయనగరం, తిరుపతిలో పాటు అమరావతి పరిధిని తగ్గించిన తర్వాత జరిగిన భూ క్రయ, విక్రయాలపై సమగ్ర విచారణ చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నారు. ఈ దిశగా రెవెన్యూ శాఖ సర్కారుకు ప్రతిపాదించనుందా? వాటిపై చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

భూ అక్రమాలపై చర్యలేవీ?

జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. మూడు రాజధానులంటూ కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖ ఎగ్జిక్యూటివ్ రాజధాని అని ప్రకటించారు. కానీ అప్పటికే విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా జోరుగా ఉంది. దీంతో వైసీపీ నేతలు, ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న రియల్ వ్యాపారులు విశాఖ, విజయనగరం జిల్లాలలో వాలిపోయారు. ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ భూములు కొన్నారు. నాటి విశాఖ వైసీపీ ఇన్‌చార్జీగా ఉన్న విజయసాయిరెడ్డి, ఆయన అనుచరులు విశాఖలో విలువైన భూములు దక్కించుకున్నారని ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. పెద్ద ప్రాజెక్టు రాబోతుందని, సాగు భూములను కారుచౌకగా ప్రభుత్వం సేకరించనుందని రైతుల్లో భయాందోళనలు పుట్టించి వైసీపీ నేతలు భీమిలి, ఎండాడ, కాపులుప్పాడ, భోగాపురం మండలంలోని పలు గ్రామాల పరిధిలో కారుచౌకగా జిరాయితీ భూములు పొందారు. జగన్ బంధుగణంలోని అనేక మంది భీమిలి మండలం పరిధిలో కారుచౌకగా భూములు దక్కించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జవహర్‌రెడ్డి మేనల్లుడు, వారసుడు కూడా భోగాపురం మండలంలోని పలు గ్రామాల పరిధిలో అసైన్డ్ భూములను కారుచౌకగా కొన్నారని ఆరోపణలున్నాయి. జనసేన నేత మూర్తీయాదవ్ దీనిపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు. తన ఆరోపణలపై చర్చకు రావాలంటూ జవహర్‌రెడ్డికి సవాల్ విసిరారు. చివరకు పలువురు రైతులు మీడియా ముందుకొచ్చి తమతో నాటి సీఎస్ మేనల్లుడు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నారని బాహాటంగా చెప్పడంతో అసలు గుట్టు రట్టయింది. గతంలో విశాఖ జేసీగా ఉన్న అధికారి ద్వారా 77 ఎకరాల హౌసింగ్ భూమిని ఓ వైసీపీ కీలక ప్రజాప్రతినిధి హస్తగతం చేసుకున్నారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ భూమి ఇద్దరి చేతులు మారిందని పేర్కొంటున్నాయి. కీలకమైన భూములు చేజిక్కించుకునేందుకే విశాఖలో కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసిల్దార్ వంటి పోస్టుల్లో సొంత మనుషులను నియమించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఓ రైతు పేరిట ఉన్న 9 ఎకరాల భూమిని వైసీపీ నేత చెప్పారని రాత్రికి రాత్రే రికార్డులు మార్చిన సంఘటన విశాఖలో వెలుగుచూసింది. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. భూముల సర్వే పేరిట అత్యంత విలువైన ప్రభుత్వ, కాలువ పోరంబోకు, చుక్కల భూములను వైసీపీ నేతలు హస్తగతం చేసుకున్నారు. రీ సర్వే అనంతర రికార్డుల్లో విలువైన భూమి తమ ఖాతాలో పడేలా చక్రం తిప్పారు. దీనిపై రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.